# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి: 8 సంచిక: 4 హైదరాబాద్ 74 ఏప్రిల్ 2017 పేజీలు : 52 వెల: 20/-

nadusthunna telangana

OSMANIA UNIVERSITY

100 YEARS

## వందేళ్ళ ఓయు పై ప్రత్యేక సంచిక

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

ఏప్రిల్ 2017
సంచిక : 4
సంపుటి : 7



గౌరవ సంపాదకులు
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి
**అల్లం నారాయణ**
చైర్మన్-ప్రెస్ అకాడమి
**చిక్కుడు ప్రభాకర్**
అడ్వకేట్-న్యాయ సలహాదారు

ప్రధాన సంపాదకుడు
**డా॥సి.కాశీం**

సంపాదకురాలు
**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం
**డా॥ఎ.సిల్మానాయక్**, అసోసియేట్ ప్రొఫెసర్
**క్రాంతి**, జర్నలిస్టు
**శివరాత్రి సుధాకర్**, పరిశోధక విద్యార్థి

మేనేజర్
**ఎం.బాలునాయక్**
ఫోన్ నెం.: 8008918475, 9290745490

డిటిపి, లే ఔట్ : స్నేహ
కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
క్వార్టర్ నెం. R-9, O.U క్వార్టర్స్,
ఉస్మానియా యూనివర్శిటి, హైదరాబాద్-500 007.
ఇ.మెయిల్: nadusthunnatelangana@gmail.com

**నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబరు: 62254225854**
ఎస్‌బిహెచ్, రాంకోఠి బ్రాంచ్(20350), హైద్రాబాద్.
IFSC: SBHY 0020350


# సంపాదకుని ఉత్తరం

అయ్యా
నేను నీ పాదాలను ప్రేమించాను
ముళ్లు కుచ్చుకొని
రక్తం ప్రవిస్తున్న
నెత్తుటి జాడలను
నా మునివేళ్లతో తాకాను
సూటిగా చెప్పాలంటే
నా చర్మాన్ని అచ్చులుగా కోసి
ప్రేమతో
నీ పాదాలకు కానుకగా ఇచ్చాను

ఒరే నాయనా
అంటరాని చిలుకలు
ఇంటికొచ్చె వేళ
గోరింటాకుతో ఎరుపెక్కిన
నీ ఆడబిడ్డ చేతులు
మా వెలివాడ గుండెలపై
ప్రేమలేఖలు రాసాయి
మేము ప్రేమించడమే తప్పైతే
ఈ దేశానికి పాదాలు ఉండేవి కావు

కాశీం

8 ఏప్రిల్ 2017

* మంథని మధుకర్‌కు పదునెక్కిన కన్నీటితో


నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

# తెలంగాణ తొవ్వ

**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| వందేళ్ల ఓయూ | **స్నేహలత ఎం.** | 5 |

**ఇంటర్వ్యూలు**

| | | |
|---|---|---|
| **Every class is a drama. A teacher is a performer** | ప్రొ॥ఎస్.రామచంద్రం | 6 |
| ఓయూలో మలుపుతిరిగిన జీవితం | **ప్రొ॥అడప సత్యనారాయణ** | 11 |
| రాళ్లెత్తిన కూలీ | **ఆలకుంట్ల ఎల్లయ్య** | 15 |
| ఓయూ లేకుంటే నా జీవితం లేదు | **అల్లం నారాయణ** | 17 |
| జ్ఞాపకాల ముసురు | **ముదిగంటి సుజాతారెడ్డి** | 20 |

**వందేళ్ల ఓయూ...**

| | | |
|---|---|---|
| ఓయూలో విద్యార్థి చలనాలు | **సి.కాశీం** | 24 |
| ఉద్యమాల ఉస్మానియా–అమరుల త్యాగాల మార్గం | **వరవరరావు** | 27 |
| భావోద్వేగాల కూడలి– ఉస్మానియా యూనివర్సిటి | **నందిని సిధారెడ్డి** | 33 |
| ఓయూ కథ | **డేవిడ్** | 37 |
| ఉద్యమాల ఉనికిపట్టు ఉస్మానియా విశ్వవిద్యాలయం | **ఎన్.వేణుగోపాల్** | 41 |
| శతవసంతాల ఓయూ–ప్రగతిశీల రచయితలు | **శివరాత్రి సుధాకర్** | 46 |
| ఓయూ ఒక అందమైన జ్ఞాపకం | **డా॥ఎ.సిల్మానాయక్** | 49 |




**చదువంటె ఉద్యమమని ఉద్యమమే జీవితమని**
**ఉన్నత విద్యను వదిలి ఉన్నత శిఖరాలకెగిసి**
**దోపిడిపై దండెత్తి విప్లవాల బాటనడిసి**
**బాట కొరకు నిండు బ్రతుకు బలిచేసిన మహావీర**
**విద్యార్థి చరితలోనే ప్రజావెలుగు ఎర్రజ్యోతి**

**– గద్దర్**

సంపాదకీయం

# వందేళ్ల ఓయూ

స్నేహలత ఎం.

ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఆ పేరు తలచుకుంటేనే ఓయూలో చదివిన విద్యార్థులైన ప్రతి ఒక్కరికీ జ్ఞాపకాలు ముసురుకొంటాయి. ఆనందజ్ఞాపకాలే కాకుండా ఉద్యమాలకే ఊపిరులూదిన ఉస్మానియా ఏప్రిల్ 26, 2017కు వందేళ్లు పూర్తిచేసుకుంటున్నది.

ఉస్మానియా తెలంగాణలో మొదటి విశ్వవిద్యాలయంగా, దేశంలో 7వ పురాతన విశ్వవిద్యాలయంగా, దక్షిణ భారతదేశంలో 3వ విశ్వవిద్యాలయంగా ఏర్పడి ఈ సంవత్సరంతో నూరేళ్లు నిండుతాయి. ఆర్ట్స్ కళాశాల, లా కాలేజీ, ఇంజనీరింగ్, టెక్నికల్ కాలేజీలు, లైబ్రరీ, ల్యాండ్ స్కేప్ గార్డెన్‌లతో ఎంతో అందంగా ఈ రూపంలో కనిపిస్తున్న ఉస్మానియా ఎంతో మంది వడ్డెరులు, శ్రమజీవుల రక్త మాంసాలతో నిర్మాణమైంది. ఆ శ్రమజీవులు, వారి వారసులు ఈ నాటికీ సరైన గూడు లేక అభద్రతతో, సౌకర్యాల లేమితో ఉస్మానియా చుట్టుపక్కలే జీవిస్తున్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం పేరు 26 ఏప్రిల్, 1917న అధికారికంగా ఫర్మాన్ వెలువడి కాగితాల్లో ప్రాణం పోసుకుంది. కానీ విశ్వవిద్యాలయానికి ఆకారం చేకూరింది 1930ల తర్వాతననే చెప్పాలి. నాలుగు దశలుగా నిర్మాణమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ రోజు మనముందు ఉన్నది. శాస్త్రీయ విజ్ఞానాన్ని భారతీయ భాషల్లో ముద్రించి అందుబాటులోకి తీసుకరావాలని, ఇంగ్లీషును ద్వితీయ భాషగా విద్యార్థులకు నేర్పించాలని, అవసరమైన పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వాలనే అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగి, ఎన్నో సామాజిక శక్తుల ఒత్తిడి మేరకే నిజాం ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపన ప్రయత్నాలు ప్రారంభించింది.

నిజాం ప్రభుత్వం ఫ్యూడల్ స్వభావం కలిగినది. ఆధునిక విద్యను, భావాలను స్వీకరించే తత్వం ఈ పాలక నిర్మాణంలో లేదు. కానీ కొన్నిసార్లు ఆయా వ్యవస్థల అవసరాల రీత్యా నూతన ఆవిష్కరణలు జరుగుతాయి. ఈ క్రమంలోనే ఓయూ ప్రతిపాదన ముందుకొచ్చింది. నాలుగు శాతం కంటే తక్కువ అక్షరాస్యత ఉన్న ఈ ప్రాంతంలో ఓయూ వంటి ఇంతపెద్ద విద్యా కేంద్రం ఏర్పాటు కావటం ఈ సమాజ చలనంలో సాధారణ విషయమేమీ కాదు. తెలంగాణలోని కొందరు విద్యార్థులైనా ఒకదగ్గర చేరి ఉన్నత విద్యను అభ్యసించటం తెలంగాణలో చైతన్యం రావటానికి కారణమయింది. ఆ కాలంలో నిజాం ప్రభుత్వం విద్యపై 74 లక్షలు ఖర్చు చేసిందని సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రిక సంపాదకీయాల్లో రాసి ఉన్నాడు. ఇది ఆనాటి ప్రభుత్వం మొత్తం ఆదాయంలో పదో వంతు. నిరంకుశ ప్రభుత్వంగా పేరున్న నిజాం ప్రభుత్వం విద్యారంగం మీద ఇంత ఖర్చుపెట్టడం చూస్తే, నేడు ప్రజాస్వామ్య పాలకులమని చెప్పుకునే వారికి కనువిప్పు కావాలి.

ఓయూ కేవలం వందల ఎకరాల భూమి, కొన్ని భవనాలు మాత్రమే కాదు. రక్తమాంసాలతో సంచరిస్తుండిన విద్యార్థుల, ఉద్యోగుల సమూహం. వీరి ప్రతీ చైతన్యం ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రగా బయటి ప్రపంచానికి వ్యక్తమవుతుంది. ఉర్దూ మీడియంలో చదువులు ఉన్నప్పటికీ ప్రపంచ జ్ఞానమంతా ఆ మీడియంలోకి అనువదించటం వలన ఆ చదువు విద్యార్థులకు వివేకాన్నిచ్చింది. ఆ వివేకం ఆలం కుంద్‌మీరి, మగ్దూం మొహియుద్దీన్, దేవులపల్లి వెంకటేశ్వరరావు మొదలైన వారికి సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడింది. "తీగలను తెంపి అగ్నిలో దింపిన నిజాం ముసలినక్క" అనే ఎరుక ఈ జ్ఞానం వలన కలిగింది. రైతుదే రాజ్యం అనే అవగాహనతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి విద్యార్థులు మద్దతు తెల్పడమే కాకుండా నాయకత్వం వహించారు. ఓయూలో చదివే విద్యార్థులు విద్యకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక చలనంలో భాగం కావాలనే అవగాహన తర్వాతి తరాలకు ఉపయోగపడింది. వందేమాతరం ఒక గేయం మాత్రమే కాదు. జాతీయ భావాలను యువతలో ప్రచారం చేయడానికి ఉపయోగపడిన నినాదం. నిజాం సంస్థానంలో ఈ నినాదంపై నిషేధం ఓయూ విద్యార్థులు ప్రజ్వరిల్లేలా చేసింది. విద్యార్థులను బహిష్కరించడం ఉద్యమాన్ని రాజేసింది. ఓయూలోని కొందరు ముస్లిం ప్రొఫెసర్లు విద్యార్థుల మధ్యన హిందు-ముస్లిం విభేదాలను తీసుకరావాలని కుట్ర చేసిన సందర్భంలో ఆర్ట్స్ కాలేజీ ముందు జరిగిన అలావ్‌లో సామూహికంగా ధూల ఆడి విద్యార్థులు ఐక్యతను చాటారు.

60వ దశకంలో ప్రారంభమైన ప్రగతిశీల, విప్లవ ఆలోచనలు విద్యార్థులలో చలనం తీసుకొచ్చాయి. స్పష్టంగా ప్రజాపక్షం వహించేలా చేసాయి. జార్జిరెడ్డి ఈ వరుసలో మొదటివాడు. జంపాలప్రసాద్, సంతోష్‌రెడ్డి, వీరన్న, రంగవల్లి ఇదొక పరంపర. విద్యార్థి ఉద్యమాల చరిత్రలో ఉస్మానియా మైలురాయి. దళిత, తెలంగాణ, స్త్రీవాద, ముస్లిం అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో ఓయూ కేంద్రంగా అనేక మంది విద్యార్థులు కొత్త ఆలోచనలకు పురుడుపోసారు. వ్యక్తమైన ప్రతీ ప్రజాస్వామిక ఆకాంక్షను హత్తుకొని ఓయూ విద్యార్థులు ముందుకు తీసుకెళ్లారు. 1969 నుంచి 2009 వరకు తెలంగాణ కోసం జరిగిన ప్రతి మిలిటెంట్ పోరాటంలో ఓయూ విద్యార్థులు అగ్రభాగాన ఉన్నారు. 2014 జూన్ 2 తెలంగాణ చరిత్రలో కొత్త శకం, అంతకంటే ఓయూ చరిత్రలో సువర్ణభాగం. ఈ గతం నుంచి వర్తమానాన్ని చూస్తే కొంత విషాదమే. ఉత్పత్తి కులాల నుంచి ఉన్నత విద్యకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నా కొద్దీ పాలకులు యూనివర్సిటీలను విధ్వంసం చేసే కుట్రకు పూనుకున్నారు. బ్లాక్ గ్రాంట్ ఇవ్వకపోవడం, ఖాళీలను నింపకపోవటం, మౌలిక వసతులు కల్పించకపోవటం చూస్తే వందేళ్ల ఓయూ కొన్నేళ్లలోనే కనుమరుగయ్యే ఛాయలు కన్పిస్తున్నాయి. తెలంగాణ ప్రతి మూల మలుపులో ఓయూ నిలబడి ఉంది. అట్లాంటి చరిత్రను మన కళ్ల ముందే కాలగర్భంలో కలిసి పోకుండా కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వందేళ్ల సందర్భంలోనైనా ఉన్నత విద్య ఆ మాటకొస్తే మొత్తం విద్యారంగం ప్రభుత్వ బాధ్యత అని చాటిచెప్పాలి. విద్యార్థి, అధ్యాపకులలో పెరిగిన అన్యవర్గ ధోరణులను, కెరియరిజాన్ని పక్కనపెట్టి అధ్యయనం-అధ్యాపనం అనే అవగాహనతో నాణ్యమైన పరిశోధనలు చేసి తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యలకు పరిష్కారాలు చూపవల్సిన సామాజిక బాధ్యత మనందరిపై ఉన్నది. దీపం వెలుగుతున్నప్పుడు దాని చుట్టూ చీకటి ఉంటూనే ఉంటుంది. ఆ చీకటిని కూడా పారద్రోలే మరో దీపం ఎప్పటికీ ఉండవల్సిందే. అది విద్య, చైతన్యం తప్ప మరేమవుతుంది? సామాజిక మార్పులో విద్య బలమైన ఆయుధం. ఆ ఆయుధానికి ఓయూ నిలయం. కనుక ఓయూను కాపాడుకోవడం బుద్ధిజీవులైన ప్రతి ఒక్కరి బాధ్యత.

**ఏప్రిల్ 10, 2017**

# Every class is a drama. A teacher is a performer

మట్టి మిద్దెలు, పొక్కిలి వాకిళ్లు, రోలు, రోకలి, పంటపొలాలు, ఎగిరే పక్షులు, లేగదూడల అరుపులు ఇవన్నీ మనందరికి పురాస్మృత జ్ఞాపకం. ఇట్లాంటి జ్ఞాపకాలతో వాట్సాప్ తరానికి వారధిగా పల్లె నుంచి పట్నమొచ్చి ఎడారి లాంటి గ్రీష్మం నుంచి వసంతం లాంటి కేరళకు ప్రయాణించి మౌనమునిలా అల్పాక్షరాలతో మాట్లాడుతూ మనిషితనాన్ని పంచుతున్న మానవీయుడు వంద వసంతాల ఉస్మానియా యూనివర్సిటీ **వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్.రామచంద్రంగారి** జీవితం లోతుల్లోకి మిమ్మల్ని ఆహ్వానిస్తూ....

**కాశీం: బాల్యం-విద్యాభ్యాసం గురించి చెప్పండి?**

**ఎస్.రామచంద్రం:** నేను సామలోనిబావి గ్రామం, గుర్రంపోడు మండలం, నల్గొండ జిల్లాలో పుట్టాను. మూడో తరగతి వరకు మా గ్రామంలోనే చదువుకున్నాను. మా ఊరి బడి ఏకోపాధ్యాయ పాఠశాల. తర్వాత పిట్టలగూడెం, కొప్పోల్ గ్రామాల్లో పదో తరగతి వరకు చదివాను. రోజూ 5 కిలోమీటర్లు నడిచి బడికి వెళ్లేవాడిని. పదో తరగతికి వచ్చేసరికి నాతోపాటు చదివే అందరూ మధ్యలోనే ఆగిపోవడంతో నేనొక్కడినే మిగిలాను. మా టీచర్ల ప్రోత్సాహంతో పదో తరగతి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను. కానీ ఆర్థిక సమస్యలతో చదువు అక్కడితో ఆపి తల్లిదండ్రులకు చేదోడుగా ఉండాలనే ఆలోచనతో హైదరాబాద్‌లో ఒక బట్టల షాపులో పనికి చేరాను. పదో తరగతిలో 500 మార్కులు దాటిన వారికి ఇచ్చే మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాను. ఆ విషయం టీచర్ల ద్వారా మా తల్లిదండ్రులకు ఆలస్యంగా తెలిసింది. మెరిట్ స్కాలర్‌షిప్ రావడంతో నేను నల్గొండ జిల్లా ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరాను. నల్గొండలోని బీసీ హాస్టల్‌లో ఉ ంటూ చదువుకున్నాను. ఆ సమయంలో మా హాస్టల్‌లో నోముల నర్సింహ్మయ్య సీనియర్‌గా ఉండేవారు. ఆయన అప్పుడు డిగ్రీ చేస్తున్నారు. విద్యార్థి ఉద్యమాల్లో తిరుగుతూ ఉండేవారు.

**కాశీం: ఉస్మానియా యూనివర్సిటీకి ఎలా వచ్చారు? ఎందుకు రావాలనిపించింది?**

**ఎస్.రామచంద్రం:** 1978-79 విద్యా సంవత్సరంలో నేను నల్గొండ ఎన్.జీ. కాలేజీలో బీఎస్సీలో చేరాను. మాకప్పుడు ఐఐటీ రామయ్యసారు మ్యాథమెటిక్స్ చెప్పేవారు. ఆయన



మొదటి రోజు చెప్పిన పాఠాన్ని తర్వాతిరోజు విద్యార్థులను అడిగేవారు. క్లాస్‌లో అందర్నీ అడిగాక ఎవరూ సమాధానం చెప్పకపోతే చివరగా నన్ను అడిగేవారు. ఒకరోజు నేను కూడా సమాధానం చెప్పకపోయే సరికి క్లాసులు అయిపోయాక నన్ను బయటికి పిలిచి భుజం మీద చేయివేసి రెండు కిలోమీటర్లు నడిపించుకుంటూ ఎందుకు చదవలేదని అడిగారు. విద్యార్థుల మీద ఆయనకంత శ్రద్ధ ఉండేది. అప్పటికి నాకు ఇంజినీరింగ్‌లో చేరాలనే విషయం తెలీదు. ఎంట్రెన్స్ రాసి ఇంజినీరింగ్‌లో చేరొచ్చని ఆయనే చెప్పారు. ఆయన సలహా మేరకు ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ రాసాను. ఎంట్రెన్స్‌లో నాకు 224 ర్యాంకు వచ్చింది. అట్లా నేను ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీలో సీటు సంపాదించాను.

**కాశీం: ఏదైనా విద్యార్థి సంఘంలో పనిచేసారా?**

**ప్రొ॥రామచంద్రం:** నేను ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజీలో 1979-83 వరకు బి.ఇ. ఎలక్ట్రానిక్స్ చదివాను. అప్పుడు స్టూడెంట్ యూనియన్ ఎలక్షన్స్ ఉండేవి. రామయ్యసార్ కొడుకు శ్రీనివాస్ నా క్లాస్‌మేట్. ఆయన క్లాస్ రిప్రజెంటేటివ్‌గా ఉండేవాడు. మా క్లాస్‌మేట్ రఘు కాలేజీ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు. లెఫ్ట్, రైట్ రెండు రకాల రాజకీయాలు ఉండేవి. విద్యార్థులు, నాయకుల్లో సెల్ఫ్ డిసిప్లెయిన్ ఉండేది. లెఫ్ట్ భావజాలం కలిగిన విద్యార్థులు హాస్టల్, కాలేజీలో జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై లెక్చర్లు పెట్టేవాళ్లు. ఆ ఉపన్యాసాలు చాలా లోతుగా ఉండేవి. అవి మా ఆలోచనా పరిధిని పెంచేవి. విద్యార్థి సంఘాలు విద్యారంగ సమస్యల మీద నిర్దిష్టంగా కేంద్రీకరించి పనిచేసేవి. సైద్ధాంతిక లోతు విద్యార్థి నాయకత్వంలో ఉండేది. విస్తృతమైన అధ్యయనం వల్లనే ఇది సాధ్యమైందని నాకనిపించేది. విద్యార్థి సంఘాలలో పనిచేసేవారు కూడా చదువులో టాపర్స్‌గా ఉండేవాళ్లు. వారిని విద్యార్థులు అనుసరించేవాళ్లు. ఇతర విద్యార్థులకు విద్యార్థి సంఘాల నాయకులు ఆదర్శంగా ఉండేవాళ్లు. నేను కూడా అప్పుడప్పుడు రామయ్యసార్ కొడుకుతో కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. ఆయనకు ప్రజాస్వామిక భావనలు ఉండేవి. అందుకే వాళ్ల మార్గం నాకు నచ్చింది.

**కాశీం: మీరు వచ్చిననాటి యూనివర్సిటీ గురించి చెప్పండి?**

**ఎస్.రామచంద్రం:** 1979లో నేను యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో చేరాను. అప్పటి వరకు ఐదేళ్ల కోర్సుగా ఉన్న ఇంజనీరింగ్ మా బ్యాచ్‌తో నాలుగేళ్ల కోర్సుగా మారింది. మా సీనియర్లు, మేము ఒకేసారి ఇంజనీరింగ్ పూర్తిచేసాము. ఇంజనీరింగ్ విద్యార్థులకు 'డి' హాస్టల్‌ను కేటాయించేవారు. ఆ హాస్టల్‌లో సీటు దొరకడం నాకు అపురూపంగా అనిపించింది. పేదరికం నుంచి వచ్చిన నాకు హాస్టల్‌లో ఒక రూమ్, కాట్, మెస్, చదువుకోవడానికి లైబ్రరీ లభించటం గొప్ప అనుభూతిని ఇచ్చింది. ఇవన్నీ పొందుతున్న నేను కష్టపడి చదివి ఈ సమాజానికి ఉపయోగపడాలనే పట్టుదల పెరిగింది. మా ఈసీఈలో హైదరాబాద్ నగరం నుంచి వచ్చినవాళ్లే ఎక్కువగా ఉండేవాళ్లు. వాళ్లు ఇంగ్లీష్‌లో ఫ్లూయెంట్‌గా మాట్లాడేవాళ్లు. విభజన స్పష్టంగా కనిపించేది. మొదట్లో గ్రామాల నుంచి తెలుగు మీడియంలో చదువుకొని వచ్చిన నాలాంటి అతికొద్ది మందికి కొంత ఇబ్బంది కలిగినా తర్వాత ఇంగ్లీష్ మీద పట్టు సంపాదించాను. పట్టణ విద్యార్థులతో పోటీపడ్డాను. అప్పుడు ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజీలో టాప్ ర్యాంకర్లు చేరేవాళ్లు. కాబట్టి ఆ రోజుల్లో పోటీ ఎక్కువగా ఉండేది. బిఇ తర్వాత ఎం.ఇ ఎంట్రెన్స్ రాసాను. అందులో ఫస్ట్ ర్యాంకు సంపాదించి ఎంటెక్‌లో చేరాను. టాప్ ర్యాంకు రావడంతో నెల నెలా 600 రూపాయల స్కాలర్‌షిప్ వచ్చేది. ఆ రోజుల్లో ఆ డబ్బులు చాలా ఎక్కువే. కొంత భాగం నా తల్లిదండ్రులకు పంపేవాడిని. ఎంటెక్‌లో భాగంగా థీసిస్ సబ్మిట్ చేసాను.

**కాశీం: ఎంటెక్ తర్వాత....**

**ప్రొ॥రామచంద్రం:** ఒకరోజు నేను హాస్టల్‌లో చదువు కుంటున్నాను. కేరళ నుంచి కొలుట్రా సిస్టమ్స్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు హాస్టల్‌కి వచ్చారు. రూమ్‌లో మా ముందు కూర్చొని నాకు ఉద్యోగం ఇస్తామన్నారు. హాస్టల్‌కి వచ్చి ఉద్యోగం ఆఫర్ చేయడంతో నాకప్పుడు చాలా ఆశ్చర్యమేసింది. పైగా వెంటనే రమ్మని ట్రైన్ టికెట్స్ కూడా ఇచ్చారు. ఉద్యోగం అవసరం కనుక కనీసం కేరళానైనా చూసొద్దామని నా మిత్రుడు చెప్పడంతో ఇద్దరం కలిసి వెంటనే కేరళలోని కొచ్చిన్‌కి వెళ్లాము. అక్కడ రెండు సంవత్సరాల పాటు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసాం. ఎడారి లాంటి తెలంగాణ నుంచి కేరళకు వెళ్లిన నాకు అక్కడి పచ్చదనం అద్భుతమనిపించింది. దాన్ని వదిలేసి రావాలనిపించలేదు. కేరళ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయాన్ని మోము కంప్యూటరీకరించడంపై కేరళ అసెంబ్లీలో చర్చ నీయాంశమైంది. అది కమ్యూనిస్టు ప్రభుత్వం కావడం వలన కంప్యూటరీకరణకు వ్యతిరేకత వచ్చింది. కానీ దానిపై ఓ కమిటీని నియమించారు. ఆ కమిటీ మా పనిని సమర్థిస్తూ నివేదికను ఇచ్చింది. మొదట్లో కంప్యూటర్‌పై అవగాహన తీసుకరావాలనే మా ప్రయత్నాన్ని అట్లా ప్రారంభించాము.

**కాశీం: మళ్లీ ఓయూకి ఎలా వచ్చారు?**

**ప్రొ॥రామచంద్రం:** 1986 డిసెంబర్‌లో పెళ్లి చేసుకున్నాను. పెళ్లి కోసమే హైదరాబాద్ వచ్చాను. పెళ్లి తర్వాత కొన్ని నెలలు హైదరాబాద్‌లోనే ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసాను. మూడు నెలలు సిబిఐటిలో లెక్చరర్‌గా పనిచేసాను. 1988 ఫిబ్రవరిలో అప్పుడు ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ గరుడాచారి బిఇలో కంప్యూటర్ సైన్స్ ప్రారంభించారు. ఈ కోర్సుకు టీచ్ చేయడానికి నన్ను రమ్మని అడిగారు. అప్పటికి నాకు టీచింగ్‌పై అంతగా ఆసక్తిలేదు. కానీ ఇంటర్వ్యూలో ఆసక్తి ఉన్నట్లు చెప్పాలని మిత్రులు సూచించారు. దీంతో గరుడాచారి గారు నన్ను అడిగిన మొదటి ప్రశ్న 'ఈ ఉద్యోగం ఎందుకు

చేయాలనుకుంటున్నార'ని, సమాధానంగా నేను 'నాకు టీచింగ్ అంటే ఆసక్తి' అని చెప్పాను. అయితే రేపే ఉద్యోగంలో చేరిపో అని ఆయన అన్నారు. ఒకసారి ఉద్యోగంలో చేరాక విద్యార్థులకు బోధిస్తున్న సందర్భంలో వారి కళ్లలో ఆనందాన్ని చూసి టీచింగ్‌పై మెల్లగా నాలో ఆసక్తి పెరిగింది. రెండు నెలల తర్వాత యూనివర్సిటీలో లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్ వస్తే అప్లై చేసుకున్నాను. ఆగస్టులో నాకు పర్మినెంట్ ఆర్డర్స్ ఇచ్చారు. ఈ మధ్యలోనే యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 7వ ర్యాంకు వచ్చింది. పోలీసోల్లు ఎంక్వయిరీ రిపోర్టును ఆలస్యంగా పంపించడం వలన సరైన టైంలో ఉద్యోగంలో చేరలేకపోయాను. తర్వాత కొన్నాళ్లకు యూపీఎస్సీనే నేను ఎంపికైన విషయాన్ని నాకు తెలియజేసింది. ఓయూ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఐఈఎస్‌లో చేరాను. కానీ ఆ జాబ్‌పై ఆసక్తి లేకపోవటం వలన ఒకటి రెండు రోజుల్లోనే తిరిగొచ్చి ఓయూలో మళ్లీ చేరిపోయాను. అప్పటికి నా రాజీనామాను ఓయూ అంగీకరించలేదు.

**కాశీం: మీరు ఓయూలో పొందిన టీచింగ్ అనుభవాలు, చేసిన పరిశోధనలు చెప్పండి?**

**ప్రొ။రామచంద్రం:** మనకెంత జ్ఞానముందనేది కాదు, ఉన్న జ్ఞానాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తున్నామా లేదా అనేది ప్రాథమిక కర్తవ్యంగా భావించాను. ఆ క్రమంలోనే విద్యార్థులకు లోతుగా అర్థమయ్యేటట్లు చెప్పడానికి ప్రయత్నించేవాడిని. సూటిగా కాకుండా మోటివేటివ్‌గా బోధన చేసేవాడిని. విద్యార్థులు కూడా మాతో పోటీపడి చదివేవారు. మేము 3-4 వారాల్లో పూర్తి చేయగలిగే ప్రయోగాలను ఇస్తే పోటీ పడి ఒక విద్యార్థి 4 రోజుల్లోనే పూర్తిచేసాడు. నాకే ఆశ్చర్యం కలిగింది. కొందరు విద్యార్థులు పరీక్షలో రాసే సమాధానాలు పరిశోధనాత్మకంగా చాలా లోతుగా ఉండేవి. భాష కూడా గొప్పగా ఉండేది. అదొక గొప్ప అనుభూతి. అట్లాంటి విద్యార్థులు టీచర్ జీవితంలో ఉండటం మరిచిపోలేని గుర్తులు.

ఇక పరిశోధనల విషయానికి వస్తే నేను 2002 సంవత్సరంలో ప్రొఫెసర్ కె.వి.చలపతిరావు దగ్గర పీహెచ్‌డీలో చేరాను. Processing of Read-Only Transactions in Mobile Broadcast Environment టాపిక్ మీద పరిశోధన చేసి 2005లో థీసీస్ సమర్పించాను. ప్రొ။చలపతిరావు గారి పరిశోధన పద్ధతి నాకు ఉపయోగపడింది. ఎంతటి కఠినమైన విషయాన్నైనా సరళంగా చెప్పడం ఆయన ప్రత్యేకత. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో ఎన్నో ప్రోగ్రామ్స్ అభివృద్ధి చేసాను. ఎంసెట్ ఫలితాలు, ఓయూ పీజీ సెట్ ఫలితాలు, అడ్మిషన్స్ ఆన్‌లైన్ చేయడం వంటి ప్రోగ్రామ్స్‌ని డిజైన్ చేసిచ్చాను. 1992లో ప్రాజెక్ట్ ఇంపాక్ట్, టెకిప్ అనే వరల్డ్ బ్యాంకు ప్రాజెక్టులు సీఎస్ఈ, ఈసీఈ డిపార్ట్‌మెంట్లకు వచ్చాయి. ఈ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేసాం. వరల్డ్ బ్యాంకు చేత గుర్తింపు కూడా లభించింది.

1994లో ఐఐటి బాంబేలో 15 రోజుల్లో జావా లాంగ్వేజ్ కోర్సును నేర్చుకొన్నాను. జావా కోర్సును ఓయూలో ప్రారంభించాం. ఈ కోర్సులో చేరడానికి ఆ కాలంలో ఎందరో విద్యార్థులు పోటీపడేవారు. ఫలితంగా డిపార్ట్‌మెంట్‌కు రూ.50 లక్షల ఆదాయం వచ్చింది. ఈ డబ్బుతో డిపార్ట్‌మెంట్‌ను ఎక్స్‌టెండ్ చేసాం.

**కాశీం: ఓయూలో అప్పటికి, ఇప్పటికి వచ్చిన మార్పుల గురించి వివరించండి?**

**ప్రొ။రామచంద్రం:** ఆ రోజుల్లో విద్యార్థులు స్వంతంగా ఆలోచించేవాళ్లు. గోల్ పెట్టుకొని చదివేవాళ్లు. రిఫరెన్స్ పుస్తకాల అధ్యయనం ఎక్కువగా ఉండేది. ఐఐటీలలో సీటు వచ్చినా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో చేరేవాళ్లు. ఆర్ఇసిలో సీటు వద్దనుకొని ఓయూలో చేరినవాళ్లు ఎందరో ఉన్నారు. విద్యార్థులకు, టీచర్లకు మధ్య సత్సంబంధాలుండేవి. టీచర్స్ సబ్జెక్టును లోతుగా చెప్పేవాళ్లు. స్టూడెంట్స్ కూడా టీచర్లను గౌరవ భావంతో చూసేవాళ్లు. ప్రొఫెసర్ ఆర్.వి.బి.చారి సార్ చెప్పిన పాఠాలు నాకిప్పటికీ గుర్తున్నాయి. డీసీరెడ్డిగారు అసైన్‌మెంట్స్ ఇచ్చి విద్యార్థుల్లో పరిశోధనాసక్తిని పెంచేవారు. పరీక్షల్లో కాపీ ఉండేది కాదు. కష్టపడి చదివి పరీక్షలు రాసేవాళ్లు. స్టూడెంట్స్ టీచర్ల పట్ల భయంతో, గౌరవంతో మెలిగేవారు. ఇప్పుడు అకడమిక్ స్టాండెట్స్ తగ్గాయి. టీచర్స్‌లో కమిట్‌మెంట్ తగ్గింది. ఇప్పుడొస్తున్న స్టూడెంట్స్ తెలివికల్లవాళ్లే. కానీ బేసిక్ స్కిల్స్ వారిలో కొరవడ్డాయి. పాఠశాల విద్యలోనే ఆ నైపుణ్యాలను నేర్పించాల్సి ఉంది. విద్యా విధానంలో వచ్చిన మార్పు వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత తగ్గింది. టీచర్ల పట్ల గౌరవ భావం పోయింది. స్టూడెంట్స్‌లో నైతిక విలువలు పెంచేలా కోర్సులు పెట్టమని కంపెనీలు చెప్తుంటాయి. కానీ ఈ విలువలు నేర్పించే పద్ధతి పాఠశాల స్థాయిలోనే పోయింది. విద్యార్థులలో సేవాభావం, తోటివారిపై గౌరవం పోయి వాటి స్థానంలో వ్యక్తివాదం, స్వార్థం పెరిగిపోయాయి.




**కాశీం: ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా మీ అనుభవాలు చెప్పండి.**

**ప్రొ॥రామచంద్రం:** ఇంజినీరింగ్ కాలేజీలోకి మంచి విద్యార్థులు రావాలంటే మంచి బోధన జరగాలని భావించాను. రాష్ట్రంలోని బెస్ట్ క్రీం విద్యార్థులు ఇక్కడికే వస్తున్నారు. కానీ టీచర్లలో అంకితభావం లోపించడం వలన కొన్ని సమస్యలు వచ్చాయి. Every class is a drama. A teacher is a performer అనే విషయాన్ని కొందరు టీచర్లు మర్చిపోయారు. దీన్ని సరిచేయటం నా మొదటి బాధ్యతగా భావించాను.

తెలంగాణ ఉద్యమం జరుగుతున్న రోజుల్లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టాను. టీచర్స్‌లో ఐక్యతను తీసుకొచ్చే ప్రయత్నం చేసాను. వారిలో ఉండే ప్రతిభను గుర్తించి తగిన పనిని ఇచ్చేవాడిని. ఫలితంగా వారు నాతో నిలబడ్డారు. టీచర్లలో లోపాలు వెతకడం కాకుండా వారిలోని మంచిని గుర్తించటం వలన క్రమంగా బాధ్యతగా ప్రవర్తించడం నేర్చుకొన్నారు. నేను వరల్డ్ బ్యాంకు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా ఉన్న కాలంలో నా టీం వర్క్‌ను గుర్తించి ఇంజనీరింగ్ కాలేజీకి 5 కోట్లు ఇచ్చారు.

**కాశీం: ఓయూలో అకడమిక్‌గా ఏ మార్పులు రావాలని కోరుకుంటున్నారు?**

**ప్రొ॥రామచంద్రం:** నేను వీసీగా విద్యార్థులకు, టీచర్లకు, ఉద్యోగులకు గ్యాప్‌ను మెయింటెయిన్ చేయాలనుకోవట్లేదు. మనం ప్రజాస్వామ్య కాలంలో జీవిస్తున్నాం. నేను యూనివర్సిటీలో ఒక అధ్యాపకుడినే. కనుక అందర్నీ కలుపుకొని పనిచేయించాలనేది నా ఆశయం. భయపెట్టి ఎవర్నీ పని చేయించలేం. ప్రతి ఒక్కరూ ఇష్టంగా పని చేసేటట్లు ప్రోత్సహించాలి. వ్యక్తిలోని మంచిని గుర్తించకపోతే నిరుత్సాహ పడతారు. ఓయూలో కొంతమంది మంచి ప్రొఫెసర్లు ఉన్నారు. వారిని గుర్తించి ప్రోత్సహించాలి. నేను విజన్ డాక్యుమెంట్‌పైన పనిచేయాలనుకుంటున్నాను. రాబోయే 50 సంవత్సరాలకు సరిపడా విజన్ డాక్యుమెంట్‌ను తయారుచేయాలి. విద్యను మాసెస్‌లోకి తీసుకెళ్లాలి. పరిశోధన స్టాండెట్స్ పెంచాలి. విద్యా వాతావరణం పెరగాలి. యూనివర్సిటీలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను డెవలప్‌చేయాలి. యూనివర్సిటీలో పర్యావరణాన్ని కాపాడాలి. క్యాంపస్‌లోపల ఎన్నో నీటి కుంటలు ఉన్నాయి. వాటిని పరిరక్షించాలి. ఫలితంగా క్యాంపస్‌లో భూగర్భజలాలు పెరుగుతాయి. నీటి సమస్య తగ్గుతుంది.

**కాశీం: తెలంగాణ పునర్నిర్మాణంలో ఓయూ పాత్ర ఎలా ఉండాలని మీరు భావిస్తున్నారు?**

**ప్రొ॥రామచంద్రం:** ఓయూ తెలంగాణలో ఉన్న అతి పెద్ద యూనివర్సిటీ. తెలంగాణ నిర్మాణంలో వందేళ్లుగా ఓయూ పాత్రను విస్మరించలేం. ఇక్కడి సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఓయూ అవిభాజ్యమైనది. కనుక నేటి తెలంగాణ పునర్నిర్మాణ బాధ్యతను కూడా ఓయూనే చేపట్టాలి. ఈ రాష్ట్రానికి కావల్సిన విద్యా విధానాన్ని, పాఠ్య ప్రణాళికను, పరిశోధనను, బోధనా నైపుణ్యాలను, సామాజిక సమస్యల పరిష్కారాలను రూపొందించ

వల్సిన బాధ్యత ఓయూ విద్యార్థుల, అధ్యాపకులపైనే ఉంది. ఇండస్ట్రీకి, ఓయూకి అనుసంధానం పెరగాలి. పరిశోధనా ఫలితాలను సమాజానికి అందించాలి. ఇవన్నీ పరిశోధనలో నాణ్యత పెరిగితేనే సాధ్యమవుతుంది. పాఠశాల విద్యా నిర్మాణంలో ప్రభుత్వంతో పాటు యూనివర్సిటీ తన పాత్రను నిర్వహించాలి. యూనివర్సిటీ విద్యార్థుల్లో విలువలను పెంచినట్లయితే వాళ్లే అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా సమాజంలో సరైన పాత్ర నిర్వహించగలుగుతారు. యువతలో ఆత్మస్థైర్యాన్ని, రచనా, భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి. విద్యార్థి ప్రవర్తన మీదే తెలివి, నైపుణ్యత ఆధారపడి ఉంటాయి.

**కాశీం: వీసీగా ఏడాది పూర్తవబోతున్న సందర్భంలో ఓయూలో మీరు గమనించిన సమస్యల గురించి చెప్పండి.**

**ప్రొ॥రామచంద్రం:** క్రమశిక్షణ లోపించింది. అకడమిక్ స్టాండెట్స్ తగ్గాయి. క్లాస్‌రూం వాతావరణం డిస్టర్బ్ అయ్యింది. విద్యార్థుల్ని కౌన్సిలింగ్ చేసి క్లాసులకు రప్పించాల్సిన అవసరం ఉంది. టీచర్లకూ అంతే.... ఇప్పుడు యూనివర్సిటీకి వస్తున్న విద్యార్థులకు మనపై చాలా ఆశలున్నాయి. వాటిని మనం నెరవేర్చాలి. పరిశోధనను పటిష్టం చేయాలి. ఉన్నత విద్యలో మంచి పరిశోధన, మంచి బోధన లేకపోతే నైపుణ్యాలు కొరవడతాయని విద్యావేత్తలు చెబుతున్నారు. పుస్తకంలో ఉన్నది ఉన్నట్లు చెప్పడం కాకుండా అనువర్తించటం అనే పద్ధతిలో చెప్పటం వలన ఎక్కువ ఫలితం ఉంటుంది. ఓయూలో టీం వర్క్ తక్కువ. ఈ సమస్యలను అధిగమిస్తే విద్యార్థుల భాగస్వామ్యం పెరుగుతుంది. ఉమ్మడి పనివిధానం అభివృద్ధి అవుతుంది. సమస్య మన దృష్టికి రాగానే ప్రాథమిక స్థాయిలోనే పరిష్కరించడానికి ప్రయత్నం చేయాలి. పై అధికారుల మీదికి నెట్టి సమస్య నుంచి పారిపోయే తత్వాన్ని తగ్గించుకోవాలి.

**కాశీం: ఓయూ శతాబ్ది ఉత్సవాలను ఎలా నిర్వహించ బోతున్నారు?**

**ప్రొ॥రామచంద్రం:** వందేళ్లు పూర్తిచేసుకున్న ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకున్న ప్రతి ఒక్కరూ గర్వంగా భావిస్తున్నారు. ఈ సందర్భంలోనైనా కొన్ని మార్పులను తీసుకరావాలని ఆలోచిస్తున్నాను. శతాబ్ది ఉత్సవాల కోసం ప్రభుత్వం ఇచ్చిన రూ.200 కోట్లలో రూ.72 కోట్ల వరకు హాస్టల్ భవనాల నిర్మాణం కోసమే కేటాయించాలనుకున్నాం. రూ.20 కోట్లు మాత్రమే సంవత్సరం పొడుగునా జరగబోయే ఉత్సవాలకు ఉపయోగిస్తున్నాం. 2018 జనవరి 3-7 వరకు ఓయూలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నాం. శతాబ్ది ఉత్సవాలకు పూర్వవిద్యార్థులు సహాయం చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. నేను వీసీగా ఉన్న సందర్భంలో శతాబ్ది ఉత్సవాలు జరగటం నాకెంతో సంతోషంగా ఉంది. ఇది చరిత్ర నాకిచ్చిన అవకాశంగా, బాధ్యతగా భావిస్తున్నాను. ప్రతిభను నమ్ముకొని ఇంత దూరం వచ్చాను. నేను నిజాయితీగా పనిచేయవల్సిన సందర్భం వచ్చింది. అందర్నీ భాగస్వాములుగా చేసి చరిత్రలో నిలిచిపోయేటట్లు ఈ ఉత్సవాలను నిర్వహిస్తాం. మంచి విద్యా వాతావరణాన్ని అభివృద్ధి చేయాలనుకుంటున్నాను. ఒక క్లాస్ రూంలో 60 మంది విద్యార్థులు అధ్యాపకులు చెప్పే పాఠం కోసం 60 నిమిషాలు వింటారు. ఆ సమయంలో వారి భవిష్యత్తును తీర్చిదిద్దే విషయాలను మనం చెప్పకపోతే విద్యార్థులకు నష్టం చేసినవారమవుతాం. ఈ ఎరుక అందరిలో ఉంటే దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మాణమవుతుంది. మనము నాణ్యమైన విద్యను అందించకపోతే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు మన భవిష్యత్తును దెబ్బతీస్తాయి.

**కాశీం: మీరు నల్గొండ జిల్లా నుంచి వచ్చారు కదా! మీ నేపథ్యాన్ని చెప్పండి?**

**ప్రొ॥రామచంద్రం:** నల్గొండ జిల్లా అంటే రజాకార్ల వ్యతిరేక పోరాటం నుంచి నేటి వరకు పోరాటాల ఖిల్లా. నా బాల్యంలో మా ప్రాంతంలో రజాకార్ల వ్యతిరేక పోరాటం నడిచింది. రజాకార్ల దాడుల నుంచి మా బంధువులు రక్షణ పొందటం కోసం పంటపొలాలలోనే ఇండ్లు నిర్మించుకొని ఉండేవారు. తీవ్రమైన పేదరికం, పీడన మా జీవితంలో అంతర్భాగమయ్యింది. దాని నుంచే పోరాట చైతన్యం వచ్చింది. ఆ చైతన్యం నన్ను ఇక్కడికి నడిపించింది. మన మూలాలను మరచిపోకుండా ఉండటమే సమాజానికి మనమిచ్చే మొదటి కానుక.

**కాశీం: మీ జీవితంలో మర్చిపోలేని సంఘటన చెప్పండి?**

**ప్రొ॥రామచంద్రం:** నేను నల్గొండలో చదువుకుంటున్నప్పుడు ఫీజు కట్టడానికి నా దగ్గర డబ్బులు లేవు. అప్పుడు మా అమ్మ వచ్చి తన గెంటీలను షాపులో అమ్మేసి డబ్బులు ఇచ్చిపోయింది. ఆ దృశ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. నా చదువు కోసం ఏదైనా త్యాగం చేయాలనుకునే మా అమ్మను కూడా మరిచిపోలేను. ఏ టైంలోనైనా చదువును ఆపేయాల్సిన పరిస్థితిలోనూ నన్ను ముందుకే నడిపించిన నా కుటుంబానికంతా ఏమిచ్చి రుణం తీర్చుకోగలను.

T

ఇంటర్వ్యూ

# ఓయూలో మలుపుతిరిగిన జీవితం

బట్టలు కట్టడమే తెలియని ఆదిమ మానవుడికి తమ నరాలను దారాలుగా నేసి బట్టనిచ్చిన వారొకరు. ఆ బట్టను శరీరానికి సరిపోయేటట్లు కుట్టే దర్జీవాళ్లు ఈ నాగరికతకొక మొదటిమెట్టు. దర్జీ కులం నుంచి ఉన్నత చదువులకు రావటమే ఒక అపురూపం. ఆర్ట్స్ కాలేజీ మెట్లెక్కడం జీవితాన్ని జయించినంత ఆనందం. ఎక్కడి ఆర్ట్స్ కాలేజీ, ఎక్కడి జేఎన్‌యు, ఎక్కడి జర్మనీ హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ... ఖమ్మం జిల్లా నుంచి వచ్చి రొమిల్లా థాపర్, బిపిన్ చంద్రల శాస్త్రీయ పరిశోధనలపై మోహంతో మట్టి చరిత్రలోకి అడుగుపెట్టిన ప్రత్యామ్నాయ చరిత్ర పరిశోధకుడు **ప్రొఫెసర్ అడప సత్యనారాయణ** చరిత్ర పుటల్లోకి మిమ్మల్ని ఆహ్వానిస్తూ....



**స్నేహ: మీ బాల్యం, విద్యాభ్యాసం గుర్చి చెప్పండి.**

**అడపా సత్యనారాయణ:** మాది ఖమ్మం జిల్లా సుబ్రవీడు గ్రామం. దర్జీ కుటుంబంలో పుట్టిన. మా గ్రామంలోనే జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 11వ తరగతి వరకు చదువుకున్న. ఆ తర్వాత ఖమ్మం ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదివిన. కుటుంబ ఆర్థిక సమస్యలతో చదువు మానేసి ఉద్యోగం చేయమన్నడు మా తాతయ్య. నా ఉపాధ్యాయులు చంద్రయ్య, దేవరాజు గారి ప్రోత్సాహంతో చదువు కొనసాగించిన. నాకు ఆనాడు ఎంఏ చేయాలనే కోరిక బలంగా ఉన్నది. ఆర్థిక వనరులు సహకరించలేదు. నా క్లాస్‌మేట్స్ ఆర్థిక సహాయం అందించారు.

**స్నేహ: ఓయూకు ఎప్పుడు, ఎలా వచ్చారు?**

**అడపా సత్యనారాయణ:** 1974లో ఓయూ పీజీ కోర్సులో చేరడానికి ఎంట్రన్స్ ఎగ్జామ్ రాసిన. ఎంట్రన్స్ ద్వారా వచ్చినవారిలో మాది ఫస్ట్ బ్యాచ్. పింగళి జగన్‌మోహన్ రెడ్డి వీసీగా ఉన్నపుడు ఎంట్రన్స్ పెట్టారు. వాస్తవానికి నేను బీఏలో థర్డ్ క్లాస్‌లో పాసయ్యాను. ఎంట్రన్స్ పెట్టడం వల్ల నా ప్రతిభకు గుర్తింపు వచ్చింది. 1974లో పోలీసు బందోబస్తు మధ్య కోఠి ఉమెన్స్ కాలేజీలో ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ రాసినం. ఆ రోజుల్లో వామపక్ష విద్యార్థులు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్ ఉత్తేజం తోటి ఉస్మానియా క్యాంపస్‌లో పీడీఎస్‌యూ కార్యకలాపాలు జరిగేవి. మొదటితరం దళిత, బహుజన సామాజిక నేపథ్యం నుంచి వచ్చిన అనేక మంది నాలాంటి విద్యార్థులు వామపక్ష ఉద్యమాల్లో చేరినం. తెలుగు మీడియం నుంచి వచ్చినా కసి, పట్టుదలతో చదివి ఇంగ్లీష్ నేర్చుకున్నం. మాది మొదటితరం.

**స్నేహ: ఓయూతో మీ అనుబంధం గురించి చెప్పండి.**

**అడపా సత్యనారాయణ:** నేను, కంచ ఐలయ్య, ఎకనామిక్స్‌లో అరవింద్ మొదటి తరంలో బీసీ నేపథ్యం నుంచి వచ్చినవాళ్లం. మాకు ప్రోత్సాహం లభించింది. సోషల్ వెల్ఫేర్ స్కాలర్‌షిప్ కోసం ఉద్యమాలు కూడా చేయాల్సివచ్చింది. సాంఘిక సంక్షేమ శాఖ స్కాలర్‌షిప్ రావడం వల్ల కొంత వెసులుబాటు కలిగింది. ఎందుకంటే మా తల్లిదండ్రులకు చదివించే స్థోమతలేదు కాబట్టి. స్కాలర్‌షిప్‌తో చదువుకుంటూ సమయం దొరికితే రామ్‌నగర్ గుండు దగ్గర ఓ టైలర్ షాప్‌లో కులవృత్తి అయిన కుట్టుపనిని పార్ట్‌టైమ్‌గా చేసేవాడిని.

ఆంధ్రమహిళా సభ, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీల విద్యార్థినులతో పరిచయం ఏర్పడింది. వాళ్లు కూడా సహాయం చేసేవాళ్లు. వామపక్ష ఉద్యమాలతో సంబంధాలు ఉండటం వల్ల సాయంత్రం స్టడీ క్లాసులు, డిస్కషన్స్ చేసేవాళ్లం. దీంతో సభల్లో మాట్లాడటం, ఎంతోమందితో చర్చల్లో పాల్గొనే అవకాశం

వచ్చింది. 1974–76లో ఓయూలో ముఖ్యమైన సామాజిక మార్పు వచ్చింది. విద్యార్థి ఉద్యమాల స్ఫూర్తితో సామాజిక సమస్యలపై పోరాడినం. విద్యార్థి ఉద్యమాల వల్ల సామాజిక స్పృహ అలవడింది. అట్లా రెండేళ్ళ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ చదివి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను.

మా తాతయ్య అన్నట్టు జూనియర్ లెక్చరర్ కావాలనే కోరిక నెరవేర్చాలని ఉండె. ఎంఏ చదివే రోజుల్లోనే మా సీనియర్స్ జేఎన్‌యూ గురించి చెప్పేవాళ్లు. బిపిన్ చంద్ర, రోమిల్లా థాపర్ లాంటి గొప్ప ప్రొఫెసర్‌లు అక్కడున్నారని చెప్పారు. జేఎన్‌యూలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేస్తే భవిష్యత్ ఉంటుందని మా సీనియర్స్ సలహా ఇచ్చారు. నేను, కంచ ఐలయ్య, తిరుమలి ఉండేవాళ్లం. అప్పట్లో జేఎన్‌యూలో కూడా ఎంట్రన్స్ ఉండేది. జేఎన్‌యూలో సీటు సంపాదించాలనే తపన ఉండేది. అప్పుడు మా సీనియర్స్ టంకశాల అశోక్, హరనాథ్‌లాంటి వాళ్లు మమ్మల్ని ప్రోత్సహించారు. అక్కడ ఎంఫిల్‌లో సీటు సంపాదించాను. తర్వాత పీహెచ్‌డీలో చేరాను. ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో 50వ ర్యాంకు వచ్చింది. దీంతో నాకు యూజీసీ జేఆర్ఎఫ్ స్కాలర్‌షిప్ వచ్చింది. అట్లా జేఎన్‌యూలో నా జీవితం మలుపు తిరిగింది.

**స్నేహ: ఓయూలో ఏదైనా విద్యార్థి సంఘంలో పనిచేసారా?**

**అడప సత్యనారాయణ:** ఓయూలో చదువుకుంటున్న కాలంలో నేను పీడీఎస్‌యూలో పనిచేసాను. కానీ ప్రత్యేకంగా ఒక్క సంఘానికే కాకుండా అన్ని వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి తిరిగేవాడిని. ఆయా విద్యార్థి సంఘాలు నిర్వహించే రాజకీయ తరగతులకు హాజరయ్యేవాడిని. ఆనాడు ఆర్ఎస్‌యు, పీడీఎస్‌యు విద్యార్థి సంఘాలు ఉండటం వల్ల తెలుగు మీడియం నుంచి వచ్చిన మాలాంటి విద్యార్థులు ఇంగ్లీషు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులను తట్టుకొని నిలబడగల్గినం.

విద్యార్థి ఉద్యమాల వల్ల దళిత, బహుజన విద్యార్థి లోకంలో చైతన్యం పెరిగింది. జేఎన్‌యూలో మూడేండ్లున్నాను. అక్కడ తెలంగాణ నుంచి వచ్చిన మిత్రులు కొందరు మా క్లాస్‌మేట్స్‌గా ఉన్నారు. పీహెచ్‌డీలో అడ్మిషన్ వచ్చిన తర్వాత ఫారిన్‌లో పీహెచ్‌డీ చేస్తే బాగుంటుందని మా మిత్రులు సలహా ఇచ్చారు.

స్నేహితుల సలహాతో ఆస్ట్రేలియాలోని నేషనల్ యూనివర్సిటీ, జర్మనీలోని హైడెల్ బర్గ్ యూనివర్సిటీలో అప్లై చేశాను. సీటువచ్చింది. జర్మనీ మీద నాకు చాలా ఇష్టం ఉండేది. ఎందుకంటే మార్క్స్ పుట్టిన దేశమది. కారల్ మార్క్స్ జర్మనీలో జన్మించడం వల్ల ఆయన రచనలు అక్కడే ఉంటాయని జర్మనీలోనే చదవాలని నిర్ణయించుకున్న. ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీ ఫెలోషిప్ ఇచ్చినప్పటికీ నేను హైడెల్ బర్గ్ యూనివర్సిటీలో చేరాను. నాకు కారల్ మార్క్స్, అంబేద్కర్ ఇద్దరూ ఇష్టం. అంబేద్కర్ కూడా జర్మన్ భాష నేర్చుకునేందుకు లండన్ నుంచి జర్మనీ వచ్చి చదువుకున్నారు. ఎంఏలో ఉన్నప్పుడు అంబేద్కర్ తెలియదు. జేఎన్‌యూ పోయిన తర్వాతనే అంబేద్కర్ అంటే ఏంటో తెలిసింది. అప్పటి వరకూ వర్గదృక్పథంతోనే ఉన్న మాకు మూడేండ్ల దాకా కులం అంటే ఏంటో తెలియదు. అంబేద్కర్‌ను చదివిన తర్వాత పీహెచ్‌డీకి హైడెల్‌బర్గ్‌కు వెళ్లినపుడు 'కులం, వర్గం– భారత సమాజం' అనే సంబంధాల గురించి పరిశోధన చేసేందుకు మా గురువు గారు ఓ టాపిక్ ఇచ్చారు. 'ఆంధ్రలో వ్యవసాయ సంబంధాలు' అనే టాపిక్‌తో పీహెచ్‌డీలో పరిశోధన చేసాను. గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ పరిస్థితులు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, వాణిజ్యీకరణ, మార్కెట్, అంతర్జాతీయ సంస్థలతో వ్యవసాయ సంబంధాలు, వ్యవసాయ రంగంలో కులం, వర్గానికున్న అవినాభావ సంబంధాలు గురించి పీహెచ్‌డీ చేశాను. 1983లో తిరిగి వెనక్కి వచ్చాను.

ఆ రోజుల్లో ఉస్మానియా యూనివర్సిటీ ఒక ఇంటెలెక్చువల్ సెంటర్‌గా ఉండేది. 1970–80వ దశకంలో ఉస్మానియా విద్యార్థి ఉద్యమాలతో విలసిల్లింది. ఓయూ విద్యార్థి ఉద్యమాలు లేవనెత్తిన సమస్యలపై విస్తృత చర్చలు జరిగాయి. వాటిని సమాజానికి అన్వయించడానికి మేధో మథనం జరిగింది. ఓయూలో పడిన బీజాలు మాకు జేఎన్‌యూలో వేళ్లూనుకున్నాయి. మాకు ఆనాడు దళిత బహుజన దృక్పథంతోటి మన చరిత్ర, మన గతాన్ని తెలుసుకోవాలని ఉండేది. 1969లో తెలంగాణ ఉద్యమం, తర్వాత ఎమర్జెన్సీ, జనతాపార్టీ ఎక్స్‌పరిమెంట్ వచ్చింది. సామాజిక మార్పును కోరుకునే నూతన సమూహాలు ఉత్తేజం పొందాయి. 1977లో విప్లవోద్యమం తర్వాత అస్తిత్వ ఉద్యమాలు వచ్చాయి. కుల వర్గ దృక్పథంతోటి ఉద్యమాలొచ్చాయి. వాటిపై లోతైన చర్చలు జరిగాయి. 80వ దశకంలో మహారాష్ట్రలో దళిత్ పాంథర్స్ ఉద్యమం, దళిత ఉద్యమాన్ని రెండింటినీ అవగాహన చేసుకున్నాను. వర్గ దృక్పథంతో ప్రభావితమై ఉన్న విద్యార్థి దశలో మేము కులాన్ని గురించి కూలంకషంగా చర్చించే అవకాశం కలుగలేదు. 1984లో ఓయూలో ఫ్యాకల్టీగా చేరాను. నేను చదువుకున్న యూనివర్సిటీలో ఉపాధ్యాయునిగా చేరడం ఆనందం వేసింది. అప్పటికి వామపక్ష ఉద్యమం బలంగా ఉండటంతో పోలీస్ నిర్బంధం బాగా ఉన్నది.

90వ దశకంలో మండల్ ఉద్యమం వచ్చింది. మండల్ మందిర్ ఉద్యమం తర్వాత విప్లవోద్యమాలు కొంత వెనకబడి పోయినట్లనిపించింది. రిజర్వేషన్స్ ప్రధాన సమస్యగా వచ్చినపుడు అస్తిత్వ ఉద్యమాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 1970లో వర్గ దృక్పథం, ప్రజాస్వామిక ఉద్యమాలు వచ్చాయి. అస్తిత్వ ఉద్యమాలు లేవనెత్తిన వర్గం , కులానికి సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయి.

**స్నేహ:** మండల్ కమిషన్ ఉద్యమ సందర్భంలో ఓయూ ఎలా స్పందించింది?

**అడప సత్యనారాయణ:** ఉస్మానియాలో కుల, అస్తిత్వ ఉద్యమాలు వచ్చాయి. దళిత అస్తిత్వ ఉద్యమాలు వచ్చాయి. అవి అంబేద్కర్ యువజన సంఘాలుగానే ఉన్నాయి. అప్పటికే పీడీఎస్‌యూ లాంటి సంఘాలున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీలో క్యాస్ట్ బేస్డ్ విద్యార్థి సంఘాలు లేవు. వర్గ దృక్పథ సంఘాలు మాత్రమే ఉన్నాయి. మండల్ కమిషన్ వచ్చినపుడు ఏబీవీపీ వాళ్లు, అగ్రవర్ణాల వాళ్లు రిజర్వేషన్‌లను వ్యతిరేకించారు. వీళ్లంతా దళిత, బహుజన ఉద్యమాలకు వ్యతిరేకంగా పనిచేశారు. అప్పుడున్న విద్యార్థి సంఘాల్లో రిజర్వేషన్ వ్యతిరేక ఫోర్సెస్‌ను అంత గట్టిగా ధిక్కరించే శక్తిలేకపోయింది.

**స్నేహ:** ఓయూలో టీచర్‌గా చేరాక ఉద్యమాలలో భాగమయ్యారా?

**అడప సత్యనారాయణ:** ఆనాటి ప్రోగ్రెసివ్‌గా ఆలోచించే చక్రధరరావు, కేశవరావు జాదవ్, కోదండరామ్, నేను, ఎకనామిక్స్ మనోహర్(హెచ్‌సీయూ) ఉండేవాళ్లం. మేమంతా లైక్‌మైండెడ్ పీపుల్. వామపక్ష ఉద్యమాల్లో పాల్గొన్నవాళ్లు యాక్టివ్‌గా ఉన్నారు. 1984నుంచి అస్తిత్వ ఉద్యమాలు పుంజుకున్నాయి. కేవీపీ ఆవిర్భవించింది. పీడబ్ల్యూ, మహిళా విద్యార్థి సంఘాలు, పౌరహక్కుల ఉద్యమాలు, స్వచ్ఛంద సంఘాలు వచ్చాయి. అనేక ఉద్యమాలకు ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఉన్నది.

ఉస్మానియాలో ఫ్యాకల్టీగా చేరిన తర్వాత సివిల్ రైట్స్ ఉద్యమంలో పాల్గొన్నాను. ఉపాధ్యా సంఘాలతో మాట్లాడేవాళ్లం. యాంటీ క్యాస్ట్ ఉద్యమాలను ఎలా ఎదుర్కోవాలన్నప్పుడు పౌరహక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, టీచర్స్ సంఘాలతో కలసి మా వంతు కృషిచేశాం. విశాల ప్రాతిపదికన చర్చలు చేసేవాళ్లం. జేఎన్‌యూ హాస్టల్స్‌లో నైట్ మీటింగ్స్ జరిగేవి. అలాంటి సమావేశాలు ఓయూలో కూడా పెట్టాలని భావించాం. అప్పుడు విద్యార్థుల్లో పెద్దఎత్తున మార్పులు తేవాలని ప్రయత్నించాం.

**స్నేహ:** అస్తిత్వ ఉద్యమాలను మీరెలా అర్థం చేసుకున్నారు?

**అడప సత్యనారాయణ:** విద్యార్థి సంఘాల్లో ఒక అటానమస్ మొబిలైజేషన్ వచ్చింది. పార్లమెంటరీ సంఘాలు వీక్ అయ్యాయి. జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్ లాంటి నాయకత్వం లేకపోవడం లోపంగా ఉంది.

సోషలిస్ట్ శిబిరం కుప్పకూలడం, అంతర్జాతీయ పరిణామాలు. అలాగే యూరప్‌లో బలమైన సోషల్ డెమాక్రసీ రావడం, జాతీయ స్థాయిలో వామపక్ష ఉద్యమాలు బలహీనపడటం, బీజేపీ రైజ్ కావడం, ఇక్కడ కూడా తెలుగుదేశం పార్టీ రావడం, ఇక్కడ విప్లవోద్యమం కొంచెం వెనక్కిపోవడం, ఆ తర్వాత మండల్ కమిషన్ వచ్చింది. వర్గదృక్పథంతో పనిచేసే సంఘాల్లో కులం అనే ప్రశ్న వచ్చింది.

అస్తిత్వ ఉద్యమాల్లో పనిచేసిన వాళ్లంతా వర్గదృక్పథం ఉన్న ఉద్యమాల్లోంచి వచ్చినవాళ్లే. ఆనాడు విప్లవ పార్టీల్లో కూడా కులం గురించిన చర్చ జరిగింది. వామపక్ష ఉద్యమాలు, పార్లమెంటరీ వామపక్ష ఉద్యమాలు నిర్వీర్యమయ్యాయి. క్యాస్ట్ క్లాస్ అనేదానిపై ఈపీడబ్ల్యూలో దళిత ప్రొటెస్ట్ లిటరేచర్ పై రాశాను. 1988లో ఈపీడబ్ల్యూలో అది ప్రచురితమైంది. దీంతో కొందరు పీడీఎస్‌యూ నాయకులన్నారు... ఏంటీ నువ్వు కులవాదిగా మారిపోయినవని. ఆ వ్యాసంలో కులం– వర్గం మధ్య అవినాభావ సంబంధం ఉందని రాశాను. పీహెచ్‌డీ థీసిస్‌లో కనీసం 'కులం' అనే పదమే వాడలేదు. మార్క్సిస్ట్ హిస్టారికల్ మెథడ్‌లో రాశాను. కానీ 80వ దశకంలో వచ్చిన అస్తిత్వ ఉద్యమాలు, చర్చలు నా ఆలోచనలో మార్పులు తీసుకొచ్చాయి.

తమిళనాడులో కులదృక్పథం, కేరళలో వర్గదృక్పథం ఉన్నది. కర్ణాటకలో మరో విధంగా, ఒక్క ఆంధ్రలోనే అన్నీ కలిసి ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం, నక్సలైట్ ఉద్యమం, ఆదివాసీ ఉద్యమాల తర్వాత ఎన్టీఆర్ వచ్చినపుడు కుల సమస్య వచ్చింది. అప్పటిదాకా మాకు శిష్టవర్గాల గురించే చెప్పారు కానీ కింది కులాల నుంచి వచ్చినవాళ్ల గురించి చెప్పలేదు. సామాజిక సమస్య ఏమిటనేది కందుకూరి వీరేశలింగం, రాజా రామ్‌మోహన్‌రాయ్‌ల గురించి చెప్పారు కానీ దళిత ఉద్యమాల గురించి చెప్పలేదు. తెలంగాణలో ఆదిహిందూ ఉద్యమాన్ని నడిపిన భాగ్యరెడ్డి వర్మ గురించి మాట్లాడలేదు. 80వ దశకం వరకు నేను కులం అనే పదమే వాడలేదు. నేనంతా మార్క్స్ ఇంటర్‌ప్రిటేషన్‌తో లెనిన్, మావో ఆలోచనతో విశ్లేషణ చేసిన.

ధనిక రైతు, మధ్యతరగతి రైతు, భూస్వామి, వ్యవసాయదారుడు... ఇలా విభజించాను. ఎక్కడ కూడా మాల మాదిగల గురించి రాయలేదు.

**స్నేహ:** జేఎన్‌యూలో అంబేద్కర్‌ను చదివారా?

**అడప సత్యనారాయణ:** చదివాను. కానీ వర్గదృక్పథం ఉండటం వల్ల ప్రధాన సమస్యగా తీసుకోలేదు.

**స్నేహ:** మీరు ఏ విద్యార్థి సంఘంలో పనిచేసారు?

**అడప సత్యనారాయణ:** పీడీఎస్‌యూలో ఉన్నాను. సంక్షేమ హాస్టల్స్, అందులోని కుల సమస్య. హాస్టల్స్‌లో, విద్యాలయాల్లో ప్రధానంగా ఏబీవీపీ దౌర్జన్యం ఉండేవి.

**స్నేహ:** మీరు చదివే రోజుల్లో అకడమిక్ వాతావరణం గురించి చెప్పండి.

**అడప సత్యనారాయణ:** విద్యార్థి సంఘాల్లో పనిచేసే విద్యార్థులంతా పాఠ్యప్రణాళికను అనుసరించారు. శ్రద్ధగా క్లాసులు వినేవాళ్లం. లైబ్రరీకి వెళ్లేవాళ్లం. ఆనాడు చక్కని అకడమిక్ వాతావరణం ఉండేది. ఉద్యమాలు కూడా ఉండేవి. విద్యార్థి ఉద్యమ నాయకులు సైతం రెగ్యులర్‌గా క్లాసులకు వచ్చేవారు. బాగా చదివేవారు. జ్ఞానవంతులుగా ఉండేవారు. లోతైన చర్చలు చేసేవారు. ఆనాడు క్లాస్‌లు ఎగ్గొట్టే పరిస్థితి లేదు. రెగ్యులర్ విద్య అనేది టీచర్లకూ, విద్యార్థులకూ మంచిది. మా టీచర్లంతా ఉన్నత కులాలకు చెందినవాళ్లు. వాళ్లు నిబద్ధతతో పనిచేశారు.

**స్నేహ:** దీనికి ప్రధాన కారణం ఏమై ఉంటుంది?

**అడప సత్యనారాయణ:** 1. కొత్త రాష్ట్రం–ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యకు ఏమీ చేయకపోవడం, 2. టీచర్లకు నిబద్ధత లేకపోవడం, 3. విద్యార్థి సంఘాలు ఒక్కటిగా లేకపోవడం, 4.విద్యార్థి ఎన్నికలు లేకపోవడం, 5. నాన్ టీచింగ్ సమస్య

ఉస్మానియాలో ప్రతీ డిపార్ట్‌మెంట్ క్షీణదశకు వెళ్లింది.

**స్నేహ:** యూనివర్సిటీ విద్యలోకి దళితులు, ట్రైబల్స్, మహిళలు ఎక్కువగా వస్తున్నారు. కానీ ఎందుకు విలువలు పతనమవుతున్నాయి?

**అడప సత్యనారాయణ:** సామాజిక, నైతిక విలువలు గల టీచర్ల లక్ష్యం బోధన మొదటిది. విద్యాలయాల అకడమిక్ వాతావరణం దెబ్బతినడం, దీనితో నష్టపోయేది ఈవర్గం పిల్లలే.

**స్నేహ:** తెలంగాణ ఉద్యమంలో ఓయూ పాత్ర గురించి చెప్పండి.

**అడప సత్యనారాయణ:** తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల పాత్ర మహోన్నతమైనది. రాజకీయ అవకాశవాదాన్ని ఎత్తిచూపుతూ ప్రాంతీయ ఆకాంక్షను వెలిబుచ్చారు విద్యార్థులు. విద్యార్థులు ఆశించిన ప్రజాస్వామిక, సామాజిక నినాదంతోటి చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంక్ ఎజెండాను ముందుకు తెచ్చిన సందర్భంలో దానికి ప్రత్యామ్నాయంగా తెలంగాణ ఉద్యమాన్ని నడపడం వల్లనే తెలంగాణ వచ్చిందనేది నా అభిప్రాయం.

**స్నేహ:** 1969 ఉద్యమం ఎందుకు వచ్చిందంటారు?

**అడప సత్యనారాయణ:** 1969లో విద్యార్థులు, ఉద్యోగుల పిలుపు మేరకు వామపక్ష ఉద్యమాల్లోకి వెళ్లడం, భూ సమస్య, ఆంధ్ర భూస్వాములు తెలంగాణ భూములను కైవసం చేసుకోవడం వల్లనే ఈ ఉద్యమం వచ్చింది.

**స్నేహ:** ఓయూ ఏర్పాటు వలన ప్రజలకు జరిగిన మేలు చెప్పండి.

**అడప సత్యనారాయణ:** 1917లో (ఏడవ నిజాం కాలం) తెలంగాణలో విద్యావ్యాప్తి జరిగింది. స్పెషల్ స్కూల్స్ పెట్టాడు. ఆది హిందూ పాఠశాలకు స్థలాలిచ్చాడు. ఆంగ్ల మాధ్యమానికి స్వస్తి చెప్పి మాతృభాషకు పట్టం కట్టాడు. పాశ్చాత్య విజ్ఞానాన్ని మాతృభాషలో బోధించాలని ఆదేశించాడు. దీంతో దళితులు కొంతమేరకు లబ్ధిపొందారు. డిగ్రీలు సంపాదించారు. బీఎస్ వెంకట్రావు కోటి రూపాయల నిధి, దళితులకు, ఆదివాసీలకు 1943లో నిధులు కేటాయించారు.

**స్నేహ:** నిజాం కాలంలో జరిగిన విద్యా వ్యాప్తి గురించి చెప్పండి.

**అడప సత్యనారాయణ:** సహజంగానే తెలుగుకు నిరాదరణ ఉన్నది. ఖాన్గీ స్కూల్స్ నడిచాయి. తెలుగు విద్యాబోధన జరిగింది. ఇందులో దళితులు తక్కువగా ఉన్నా బీసీలు బాగా ఉండేవాళ్లు. చివరి నిజాం ఖాశీం రజ్వీని కలవడం, ఇత్తేహదుల్ ముస్లిమీన్ పార్టీని ప్రోత్సహించడం లాంటి అపవాదు మాత్రం ఉన్నది. ఇది చివరి మూడేళ్లలో మాత్రమే. 1945– 46 47. అంతకుముందు సాలార్జంగ్ కూడా విశాల దృక్పథంతో విద్యను అందించాడు. క్రైస్తవ మిషనరీలు స్కూల్స్ ద్వారా విద్యనందించారు. వీళ్లను కూడా నిజాం ఆదరించారు. వెస్లీ స్కూల్‌లో మొదటి దళిత మహిళ విద్యనభ్యసించింది. 6వ, 7వ నిజామ్‌లు విద్యా వ్యాప్తిలో ప్రత్యేక విధానాన్ని అవలంభించారు.

**స్నేహ:** మీరు చదివే రోజుల్లో సైద్ధాంతిక చర్చల గురించి చెప్పండి.

**అడప సత్యనారాయణ:** ఆనాడు సీరియస్ విషయాలపై చర్చలు జరిగేవి. పీడీఎస్‌యూ క్లాస్‌లు నిర్వహించేది. సిద్ధాంత చర్చలు జరిగేవి. ఏబీవీపీని ఎదుర్కోవడం, ఫిజికల్ ఫైట్ చేయడం జరిగింది. కానీ ఈనాడు ఆ సిద్ధాంత ఆలోచనలు, లోతైన చర్చలు కొరవడినట్లుగా కనిపిస్తున్నది.

**స్నేహ:** ఆర్ట్స్ కాలేజీ గురించి...

**అడప సత్యనారాయణ:** ఆర్ట్స్ కాలేజీలోకి రాగానే ఒక అపురూపమైన భావన కలిగేది. ఆర్ట్స్ కాలేజీ వరండా నాకు బాగా నచ్చేది. అక్కడే చదువుకొని ఉద్యోగం చేయడం ఆర్ట్స్‌కాలేజీతో అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది.

T

# రాళ్ళెత్తిన కూలీ...

**లక్షలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దింది ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఆర్ట్స్ కాలేజీ, ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణాలను పోలినవి ప్రపంచంలో మరెక్కడా కన్పించవు. అలాంటి చారిత్రక నిర్మాణాలకు పునాదులు తవ్విన మట్టి మనుషులు పక్కనే బస్తీలో అనామకంగా మిగిలిపోయారు. ఆర్ట్స్ కాలేజీకి పునాదులు తవ్వినవాళ్లలో ఇప్పుడు పండుటాకుల్లా మిగిలిన కొందరిలో ఆలకుంట్ల ఎల్లయ్య ఒకడు. నూరేళ్ళు నిండిన వయసులోనూ ఆనాటి జ్ఞాపకాలను తడితడిగా తడుముకుని ఒక్కొక్కటిగా గుర్తు చేసుకున్నాడు. ఆ మట్టి మనిషి యాది ఆయన మాటల్లోనే...**



అనేక చారిత్రక నిర్మాణాలకు పునాదులు తవ్వి, రాళ్ళెత్తిన కూలీలు చరిత్రలో భాగం కాకపోవడం ఒకానొక చారిత్రక విషాదం. కనీసం వాళ్లను మనుషులుగా గుర్తించేందుకు కూడా వెనుకంజే అందరిదీ. ఆదిమానవుడి రాతియుగం నుంచీ ఆర్ట్స్ కాలేజీ నిర్మాణం దాకా వాళ్ల నెత్తురు, చెమటలతో తడవని పునాదుల్లేవు. ఎన్నెన్ని చారిత్రక నిర్మాణాల పునాదుల కింద ఆ కూలీల ఎముకల మూలుగులు ఆర్తనాదం చేస్తున్నయో ఎవరికీ పట్టదు. వాళ్లు శ్రమ తప్ప ఇంకేమీ తెలియనివాళ్లు. ఈరోజు పని దొరికితే చాలు. రేపటి గురించి చింతేలేని బతుకులు.

ఉన్న ఊరినీ, అయినవాళ్లనూ వదిలి ఇక్కడికి వలస వచ్చి బతుకుతున్నారు. చెరువులు, పునాదులు తవ్విండ్రు. కొండల్ని తొలిచి బండల్ని చెక్కిండ్రు. ఆర్ట్స్ కాలేజీకి పునాదులు తవ్వి ఇప్పుడు పండుటాకుల్లా మిగిలిన కొందరిలో ఆలకుంట్ల ఎల్లయ్య ఒకడు. నూరేళ్ళు నిండిన వయసులోనూ ఆనాటి జ్ఞాపకాలను తడితడిగా తడుముకుని ఒక్కొక్కటిగా గుర్తు చేసుకున్నడు. ఆ మట్టి మనిషి యాది ఆయన మాటల్లోనే...

"నాకప్పుడు పదేండ్లుంటయ్. మా అయ్య, అమ్మ కూలినాలి జేసి బతికేది. మా అయ్య బావులు తొవ్వేది. మట్టి గోడలు కట్టేది. కర్వుకాలం. వానల్లేవు. చేస్తాన్కి పన్లేదు. కూలి దొర్కుడు కష్టమైంది. తింటానికి తిండి లేదు. ఊరోల్లమంత శాన తప్పుదీసినం. అప్పుడెవలో సెప్పిండ్రు మా అయ్యకు.. పట్నంల పనికివోతె మంచిదని. అక్కడ రోడ్డు పన్లు, చెర్వు తొవ్వుడు పన్లున్నయని సెప్పిండ్రు. అప్పుడే మా ఊర్నొదిలొచ్చినం. మాది నల్లగొండ జిల్లా చిట్యాల దగ్గర వనిపాగల. మేం వడ్డెరోల్లం. గుంటెడు భూమిగూడ లేదు మాకు. మా కుటింబమంత పట్నమొచ్చినం. మా పాలోల్లు శానమంది అక్కన్నే ఉన్నరు. పట్నమొచ్చినంక గండిపేట చెర్వు తొవ్వుడు పన్కివొయినం. తర్వాత ఉస్మాన్‌సాగర్ తొవ్వినం. ఇదైపొయినంక ఉస్మానియాల రోడ్ల పన్లుజేసినం. మొదుగాలు రోడ్ల పన్లయినంకనే ఆర్ట్స్ కాలేజీ కటిండ్రు. ఆర్ట్స్ కాలేజీకి ముగ్గువోసినపుడు నాకు పదేండ్లుంటయ్. మా అయ్యతోటి గల్సి కంకర గొట్టిన. రాళ్లు మోసిన. ఆర్ట్స్ కాలేజీకెదురుంగ కోంటోని బిల్లింగుండె(బీ హాస్టల్ భవనం). ఇప్పుడున్న ఠాగూర్ ఆడిటోరియం అడుగున అప్పట్ల సిల్మా ఆలుండె. దాని కట్టనీకి ఇటికెల్ని మూసిల్నించి తెచ్చేది. ఇటికెల్ని బాలీస్(చిన్న టిప్పర్)మీద తెచ్చేది. తార్నాక నించి ఛే నెంబర్ దాక ఆరు క్యాంపులుండె. ఆ క్యాంపులల్లనే కూలోల్లందరుండేది. అప్పట్ల ఫస్టు క్యాంపు (తార్నాక)నించి రామాంతపురం, నాగోల్ వరకు రైల్ లైనుండె(రైల్వే ట్రాక్). దానిమీద గూడ ఇటికెల్దెచ్చేది. రామాంతపురంల బండలు కొట్టేది. కూలోల్లందరం సిల్మా టాకీసు దగ్గెర గుడిసెలేసుకొని ఉండేది. విజయవాడ, నల్లగొండ నించి శానమంది ఒచ్చిండ్రు. రాళ్లుగొడ్తానికి. పునాదుల్దీస్తాన్కి.

పొద్దుగూకులు పన్జేసేది. బండలు పాలీష్ చేస్తాన్కి కోయంబత్తూరో ల్లొచ్చింన్రు. ఆల్లుగూడ ఇక్కన్నే గుడిసెలల్ల ఉండేది. ఈ బస్తీల హిమాత్ అలీ బాగ్ అని తోట ఉండె. ఆ తోట పక్కన్నే ఒక పెద్ద భవంతిల ఆ తుర్కాయ్నె ఉండేది. శానమంచోడు. ఇప్పుడు వడ్డెర బస్తీ అంటుండ్రుగానీ అప్పటి పేరు హిమాత్ అలీ బాగ్.



ఆర్ట్స్ కాలేజీ ఓప్నింగుకు నిజాం నవాబు మనవడు మొఖరంజాను ఎంటబెట్టుకొని గుర్రం బగ్గి మీదొచ్చిండు. అప్పుడు శానమంది మిల్ట్రోల్లు కాపలుండె.

తర్వాత ఫస్టు క్యాంపుకాడ ఐదార్గురం గల్సి ఒక కొట్టం గట్టినం. దాన్ని బడిజేసినం. మా పోరగాండ్లకు బడి చెప్పెటందుకు ఒక కోంటాయ్నని పంతులుగ బెట్టినం. ఆయ్నెకు నెలకు ఆఠాణిచ్చేది." ఇదంతా చెప్తున్నంత సేపూ ఆ ముసలి తాత కళ్లల్లో ఆగని కన్నీరే. ఆనాటి జ్ఞాపకాలను ఒక్కొక్కటిగా తవ్వితీసిండు. విశ్వవిద్యాలయంతో వాళ్ల జీవితాలు పెనవేసుకున్నట్లన్పించింది. వాళ్ల జీవితంలో ప్రతీదీ విశ్వవిద్యాలయంతోనే ముడిపడి ఉన్నది. ఇంజనీరింగ్ కాలేజీకి ముగ్గుబోసినపుడు తన తమ్ముడు పుట్టిండని గుర్తుజేసుకున్నడు. నీ పెళ్ళెప్పుడైందంటే ఫలానా హాస్టల్ కట్టేటప్పుడనీ, కొడుకులు, బిడ్డలూ ఫలానా పని చేసేటపుడు పుట్టింద్రని వివరించిండు. పుట్టుకా, పెళ్లీ, కార్యాలూ... ఇట్లా ఏ విషయమైనా విశ్వవిద్యాలయం వాళ్ల జీవితంలో భాగం కాకుండా పోలేదు. చాలా ఉద్వేగంగా ఆనాటి స్మృతులను నెమరువేసుకున్నడు.

"మెట్టుగూడ నించి ఇక్కడి చెర్వులకు ఒక కాల్వుండె. దాంట్లె నీల్లే తాగేది. సిల్మా టాకీసు దగ్గరున్న మమ్ముల్ని కొన్నెల్ల తర్వాత ఎల్లిపొమ్మన్నరు. ఎల్లిపోకపోతే నల్లాలు బంజేసింన్రు. గుడిసెలు పీకేసి ఎల్లగొట్టింన్రు. అప్పుడే ఈ బస్తీకొచ్చినం. ఇక్కన్నే గుడిసెలేసుకున్నం. కొన్నాల్ల తర్వాత క్యాంపులు కాల్జెయిమన్నరు." ఈ మాటలు చెప్తుంటే అతని గాజు కళ్లల్లో ఒద్వని దుఖం.

పనులున్నంత కాలం చేయించుకుని ఇప్పుడు వెళ్లిపొమ్మంటే ఎక్కడికి పోవాలనే ప్రశ్న. ఎందుకు తరుముతున్నరని ధిక్కరించే తత్వం విన్పించింది.

"క్యాంపులల్ల నించి కాల్జెయిమన్నప్పుడు అన్ని క్యాంపుల్లనించి అందరం ఏకమైనం. సుమారు 3000మందిమి జమైనం. కాంగ్రిస్ బేనర్లు కట్టి జులూస్ తీసినం. ఎవలెదు రొచ్చినా ఆగలేదు. అట్లా ఇంటి జాగలు సంపాంచుకున్నం." ఇదీ ధిక్కారం. ఇక్కడి బస్తీలో ఈ కులస్తుల పిల్లలెవరికీ చదువులేదు. పొద్దున లేస్తే పని ఎక్కడ చూస్కోవాలన్న ధ్యాసే. పొద్దంతా కష్టం చేస్తేనే నాలుగు మెతుకులతో కడుపు నిండేది. నిత్యం జీవన పోరాటమే. ఆకలి పోరాటం. చరిత్ర నిర్మాణాలకు రాళ్ళెత్తిన ఈ మట్టి మనుషులు ఇంకా మట్టి పనులతోనే బతుకులీడుస్తున్నారు.

వాళ్లు కొండల్ని తొలిచింన్రు. బండలను పిండిచేసింన్రు. నెత్తురు, చెమట ధారపోసి ఆర్ట్స్ కాలేజీని నిర్మించింన్రు. వాళ్ల వారసుడొక్కడు కూడా ఈ యూనివర్సిటీల చదువుకోలేదు.

లక్షలాది మంది విద్యార్థులకు ప్రాపంచిక జ్ఞానాన్ని అందిస్తున్న నూరు వసంతాల ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వీళ్లింకా అంటరానివారే. ఆ తాతను ఇంకా కదిలిస్తే మట్టి గుండెల ఘోష ఈ జీవిత కాలమంతా వెంటాడక తప్పదు. ఇప్పుడు ఆ ముసలి తాత కళ్ళల్లో నీళ్లు లేవు. గుండె తడి తప్ప.

**వివరాలు:**

**ఆర్ట్స్ కాలేజీకి శంకుస్థాపన : 1934 జూలై 5**

**ఆర్ట్స్ కాలేజీ ప్రారంభం : 1939 డిసెంబర్ 4**

**ఆలకుంట్ల ఎల్లయ్య ఫోన్ నంబర్: 8187829439**

**ఎల్లయ్య మాటల అక్షరీకరణ : శివరాత్రి సుధాకర్**

# ఓయూ లేకుంటే నా జీవితం లేదు

రాడికల్ జెండాను ఎత్తి పట్టిన నాటి విద్యార్థి నాయకుడు..
జగిత్యాల జైత్రయాత్రను గానం చేసిన కవి..
ప్రాణహిత ప్రవాహమైన పాత్రికేయుడు... ఆయనే ఉస్మానియా పూర్వ విద్యార్థి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ. విద్యార్థి దశలోనే విప్లవ పాఠాలు నేర్చి, విద్యార్థి నాయకుడిగా ఉస్మానియాలో పోరాటాన్ని ఎత్తిపట్టాడు.
తెలంగాణ పోరాటంలో నేను సైతం అంటూ కలంతో అక్షర అగ్గిరవ్వల్ని కురిపించాడు.
వందేళ్ల ఉస్మానియాతో తన బంధాన్ని పంచుకున్నారు **అల్లం నారాయణ.**
ఆ ముచ్చట్లు పాఠకుల కోసం...

**క్రాంతి: బాల్యం, విద్యాభ్యాసం ఎక్కడ సాగింది ?**

**అల్లం నారాయణ:** ఉస్మానియా యూనివర్సిటీకి రావడానికి ముందే నేను విప్లవ రాజకీయాల్లో ఉన్నాను. కరీంనగర్ జిల్లా గాజుల పల్లి మా స్వగ్రామం. రైతు కుటుంబంలో పుట్టిన. నాన్న రైతుకూలీ కావడంతో చదువు గురించి తెలియదు. దీంతో ఆయన మమ్మల్ని చదువుల పట్ల ప్రోత్సహించే దిశలో శ్రద్ధ పెట్టలేదు. మా పెద్దన్న అల్లం రాజయ్యకు సాహితీ మిత్రులతో బాగా పరిచయం. ఆయన వల్ల ఇంట్లోకి వచ్చే పుస్తకాలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. మంథనిలో ఒక లైబ్రరీ ఉండేది. అక్కడికి ఐదవ తరగతి నుంచే వెళ్లడం అలవాటైంది. అది నాకు బాగా కలిసొచ్చింది కూడా. అక్కడ చాలా పుస్తకాలు చదివాను. అల్లం రాజయ్య తెచ్చిన సుబ్బారావు పాణిగ్రాహి పుస్తకం నన్ను బాగా ప్రభావితం చేసింది. కవులు, గాయకులను ఎందుకు చంపేస్తున్నారన్న ప్రశ్న అప్పట్లో ప్రభుత్వానికి చెమటలు పోయించింది. తర్వాత ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు మంథనిలో చదివిన. టెన్త్ అయిపోయాక ఆ సమయంలో ఆ ప్రాంతాల్లో పూర్తిగా విప్లవాత్మక వాతావరణం ఏర్పడింది. చందుపట్ల క్రిష్ణారెడ్డి, మల్లా రాజిరెడ్డిల పరిచయం వల్లనే నాకు రాజకీయాలు పరిచయమయ్యాయి. కరీంనగర్‌లో ఓసారి జనవరి 26న క్రిష్ణారెడ్డి, రాజిరెడ్డి లాంటోళ్లు కరపత్రాలు రాసి, ముద్రించి, పంచారు. అవి అప్పట్లో సంచలనం సృష్టించాయి. క్రిష్ణారెడ్డి మా పెద్దన్న అల్లం రాజయ్య క్లాస్ మేట్స్. క్రిష్ణారెడ్డి వయసులో పెద్దవాడైనప్పటికీ మాతో చనువుగా



ఉండేవాడు. ఇంటర్‌కి వచ్చాక విప్లవ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. కొల్లూరు చిరంజీవి మా ప్రాంతానికి ఆర్గనైజర్‌గా పనిచేసేవాడు. మల్లా రాజిరెడ్డి, క్రిష్ణారెడ్డి, మందాటి భాస్కర్‌రెడ్డి లాంటి వాళ్ల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో తరచూ పాల్గొనేవాళ్లం.

**క్రాంతి: ఉస్మానియాకు రాకముందు విద్యార్థి ఉద్యమాలతో ఎలా సంబంధం ఉండేది?**

**అల్లం నారాయణ:** 74లో హైదరాబాద్‌లో జరిగిన ఆర్ ఎస్ యూ మొదటి మహాసభకు జమ్మికుంట, మంథని, పెద్దపల్లి ప్రాంతాల నుంచి ఒక రైలు నిండా విద్యార్థులం వచ్చాం. అనంతరం మా కాలేజీ వార్షికోత్సవంలో మాట్లాడేందుకు

అంపశయ్య నవీన్‌ని పిలిచాం. ఆ సందర్భంగా.. రైట్ వింగ్ వాళ్లు గొడవ చేశారు. క్రిష్ణారెడ్డిపై దాడి జరిగింది. దీంతో మేమూ తిరిగి దాడిచేశాం. దాడి వెంటనే మాకు తెలీకుండానే అజ్ఞాతంలోకి వెళ్లాం. ఇంటర్మీడియెట్ తరువాత పార్టీ పిలుపు వచ్చింది. అలా మల్లారాజిరెడ్డి, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, సాహు, నేను, క్రిష్ణారెడ్డి మంథని కమిటీలో పనిచేసేవాళ్లం. కొద్దికాలానికి మేమంతా అరెస్టయ్యాం.

రెండున్నరేళ్ల జైలు జీవితం... బయటికి వచ్చాక పార్టీ ఆదేశాల మేరకు... మంచిర్యాలలో 1977లో బీఎస్‌సీ చేశాను. అప్పటికే మామీద మంథని, ఖమ్మం కేసులు ఉండేవి. మళ్లీ అరెస్టు చేశారు. 6 నెలల పాటు ఎమర్జెన్సీలో లాకప్‌లో ఉన్నాం. జైలు జీవితం తరువాత... 30 మంది పూర్తికాలం కార్యకర్తలతో ఐవీ మాస్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. శాస్త్రుల పల్లిలో జరిగిన ఈ సమావేశం తరువాతే రోడ్ టు రెవల్యూషన్ డాక్యుమెంట్ వచ్చింది. ఎన్నికల బహిష్కరణ నినాదాలతో... ప్రజాసంఘాల ఏర్పాటు, గో టూ విలేజ్ మొదలైంది.

**క్రాంతి: ఓయూలో ఎంతకాలం చదువుకున్నారు? ఆనాటి ఓయూ పరిస్థితుల గురించి చెప్పండి.**

**అల్లం నారాయణ:** 1977-82 వరకు కొవ్వూరు, తాడిచెర్ల ప్రాంతాల్లో సెంట్రల్ ఆర్గనైజర్‌గా పనిచేశా. ఈ క్రమంలో కొత్తపల్లి ప్రాంతంలో నామీద దాడి జరిగింది. పార్టీ పిలుపు మేరకు 1982 చివర్లో అక్కడి నుంచి వచ్చేశా. కొవ్వూరు నుంచి వచ్చేశాక చాలా ఆలోచించా. ఏం చేయాలా...? అని. ఏం తోచలేదు. కృష్ణారెడ్డిగారితో కలిసి పనిచేసేటప్పుడు ఆయన నిత్యం నాకో మాట చెప్పేవాడు. ఎమ్మే చెయ్యి.. ఎమ్మే చెయ్యి.. అని ఆయన మాటను గౌరవించి ఓయూ ఎంట్రెన్స్ రాశా. పొలిటికల్ సైన్స్, సోషియాలజీ రెండింటిలో సీటొచ్చింది. సోషియాలజీలో చేరా. ఎప్పటికైనా ఓయూలో చేరాలన్న నా చిరకాల కోరిక అది.

అప్పటికే 'ఉదయం' పేరుతో కవిత్వం రాయడం మొదలుపెట్టా. కొంతమంది మిత్రులతో కలిసి పార్టీకి ఫుల్‌టైమ్ పనిచేస్తూనే మరోపక్క కవిత్వం రాశా. ఓయూలో చేరినప్పటి నుంచి నాలో వస్తున్న మార్పును గమనించా. నేను మునుపటిలా లేను సబ్జెక్ట్ విషయంలో, ఆలో చనల విషయంలో చాలా మార్పు వచ్చింది. ఉద్యమంలో ఉన్నప్పుడు నేను వెలితిగా ఫీలయ్యే అంశాలు ఓయూలో చేరాక నాకు దూరమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు, ఉద్యమాల్లో పాల్గొనే విద్యార్థులకు, సాహితీ విద్యార్థులకు ఓయూ ఒక ఉపకేంద్రంగా ఉండేది. ఆర్ట్స్, సైన్స్ కాలేజీలు బలమైన విద్యార్థులను, విద్యార్థి నాయకులను, ఉద్యమాలను నిర్మించాయి. శంకర్, దామోదర్, స్వర్ణ, మల్లారెడ్డి, ప్రహ్లాద్ లాంటి వారి స్నేహం, ఓయూ వాతావరణం నన్ను ప్రశాంతంగా ఉండనివ్వలేదు. అందరం కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాం. అప్పుడు ఓయూలో మేం చూసిన చైతన్యం మళ్లీ కనిపించలేదు. సామాజిక చలన కేంద్రంగా ఓయూ పనిచేయడం నేను కళ్లారా చూశా. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, వామపక్ష విద్యార్థులకు ఓయూ రక్షణ కవచంలా ఉండేది. ఆర్ఎస్‌యూ, పీడీఎస్‌యూ, ఎస్.ఎఫ్.ఐ లాంటి విద్యార్థి సంఘాల ఆధిపత్యం ఓయూలో బాగా ఉండేది. ఎన్నో ర కాల చర్చలకు ఓయూ వేదికైంది. అన్నీ సందర్భాల్లో, సమయాల్లో, పరిస్థితుల్లో ఓయూ ఒక సంచలనాత్మక చైతన్య వేదికలా ఉండేది.

**క్రాంతి: ఓయూ విద్యార్థి ఉద్యమంలో మీ పాత్ర?**

**అల్లం నారాయణ:** నేను రాజకీయాలవైపు రావడం నా విద్యార్థి దశలోనే జరిగింది. విప్లవ రాజకీయాల్లో ఉండడం వల్ల నేను రాజకీయాల పట్ల పరిపూర్ణమైన పరిపక్వత సాధించగలిగాను. అందులో నేను ఓయూలో గడిపిన, నేర్చుకున్న విషయాలు నాకు అనేక అంశాల పట్ల క్లారిటీ ఇచ్చాయి. 1985 కాలంలో ఉన్న రాజకీయాలను అధ్యయనం చేసే అవకాశం నాకు ఓయూ వల్లనే లభించింది. ఉద్యమంలో ఉన్నప్పుడు ఆర్గనైజర్‌గా నేను మిస్ అయిన అంశాలు తిరిగి నేర్చుకోవడానికి ఓయూ నాకు చాలా సహాయపడింది. వామపక్ష ఉద్యమం మీద స్పష్టమైన అవగాహన నాకు ఇచ్చింది ఓయూనే. రకరకాల సిద్ధాంతాల మీద అవగాహన కల్పించింది. ఇక్కడ ఉండే సాహిత్య వాతావరణం అలాంటిది. అంజన్న సాహిత్యం నన్ను బాగా ప్రభావితం చేసింది. ఓయూలో ఉన్నప్పుడే విరసం సభ్యత్వం తీసుకున్నా. ఓసారి అలిశెట్టి చిత్రాల ప్రదర్శన పెట్టారు. అది నన్ను బాగా ప్రభావితం చేసిన అంశాల్లో ఒకటి. నేను, దేవేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి లాంటి వాళ్లం కలిసి హైదరాబాద్‌లో మొట్టమొదటి సారి ఆర్ఎస్‌యూ మహాసభ నిర్వహించినం. ఈ సభకు మంథని, పెద్దపల్లి లాంటి ప్రాంతాల నుంచి భారీగా విద్యార్థులను కదిలించాం. ఒక రైలు నిండా విద్యార్థులు సభకు వచ్చారు. నా బాల్యం చాలా సామాన్యంగా గడిచింది. ఆర్ఎస్‌యూ ఏర్పడ్డ నాటి నుంచి పూర్తిగా ఆర్ఎస్‌యూకి అనుబంధంగానే పనిచేశా. సరోజినీ దేవి హాల్‌లో ఓసారి మీటింగ్ ఏర్పాటు చేసుకున్నాం.

మీటింగ్ ప్రారంభంలోనే పోలీసులు దాడి చేసి అందరినీ చెల్లాచెదురు చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో పార్టీని కలవడం, అందరినీ సమీకరించి ఆర్ఎస్‌యూ విస్తరణకు తోడ్పడడంతో రాజకీయ జీవితానికి తెర లేచింది.

**క్రాంతి: సైద్ధాంతిక, రాజకీయ పరిపక్వత సాధించడానికి మీకు ఓయూ ఎలా ఉపయోగపడింది?**

**అల్లం నారాయణ:** నేనెప్పుడూ చెప్తుంటా.. నా జీవితంలో రెండు కోణాలున్నాయని. ఒకటి ఉద్యమం. ఇంకోటి సంతోష్. అతని నైజం నాకు నచ్చేది. యూనివర్సిటీ మొత్తాన్ని ఆయన ప్రభావితం చేసేవాడు. ఆయన గురించి ప్రతిరోజూ వర్సిటీ చర్చించేది. మాట్లాడుకునేది. ఒక వ్యక్తి ఒక యూనివర్సిటీని అంతలా ప్రభావితం చేసిండంటే.. అది చిన్న విషయం కాదు. కరెంట్ ఇష్యూస్ మీద ఆయన స్పందించే తీరు ప్రత్యేకం. అదే అందరినీ ఆయన వైపు ఆకర్షితులయ్యేలా చేసింది. ఈ మధ్య ఓయూలో, అక్కడి వాతావరణంలో, చైతన్యంలో చాలా మార్పొచ్చింది. అప్పుడు పూర్తిగా లెఫ్ట్ వాతావరణం ఉండేది. ఒక అర్థవంతమైన చర్చ నడిచేది.

సమాజానికి ఉపయోగపడే ఉద్యమాలు, ఆలోచనలు చేసేవారు. ఇప్పుడు పరిస్థితిలో చాలా తేడా వచ్చింది. అంతా కలగూరగంపలా తయారైంది. సబ్జెక్ట్, కరెంట్ ఇష్యూస్, మీద నిత్యం చర్చ జరిగేది. ఇలాంటి అంశాలు నాలాంటి వాళ్లను చాలా మార్చాయి. నన్ను ఒక స్థాయి నుంచి ఇంకో స్థాయికి తీసుకుపోయిందంటే.. వందకు వంద శాతం ఉస్మానియా విశ్వవిద్యాలయమే. అందుకు నేను యూనివర్సిటీకి జీవితాంతం రుణపడి ఉంటా. ఓయూలో నేను రెండున్నరేళ్లు చదువుకున్నా. విద్యార్థిగా, విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, స్వతంత్ర భావాలు గల యువకుడిగా, నిరంతరం అధ్యయనం చేసే అధ్యయన శీలిగా ప్రతీ విషయంలో ఓయూ నాకు చాలా నేర్పింది. ఓయూ లేకుంటే నా జీవితం లేదు.

**క్రాంతి: ఓయూలో మీరు చదువుకునే రోజుల్లో సాహిత్య వాతావరణం గురించి చెప్పండి?**

**అల్లం నారాయణ:** ఓయూలో విద్యార్థి, సామాజిక ఉద్యమాలతో పాటు, సాహిత్య ప్రక్రియకూ ప్రాధాన్యత ఉంది. అప్పట్లోనే యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్ అని ఓ సంఘం పనిచేసేది. నందిని సిద్ధారెడ్డి, కెఎన్ చారి, విజయారావు, లాంటి వాళ్లంతా అందులో ఉండేవారు. "ఈ తరం యుద్ధ కవిత" పేరుతో సంకలనం విడుదల చేశాం. మంచి స్పందన వచ్చింది.

**క్రాంతి: జర్నలిజం వృత్తిలోకి ఎలా వచ్చారు?**

**అల్లం నారాయణ:** నిరంతర అధ్యయనమే నేను జర్నలిస్టుగా మారేందుకు తోడ్పడింది. క్రియాశీలక రాజకీయాల్లోంచి బయటకొచ్చేశాక నాకు కనిపించిన మార్గం జర్నలిజమే. నేనేంది.. ఎటూ కాకుండ పోతున్న. అనే అచేతన స్థితిలోంచి మళ్లీ చైతన్య దిశలోకి మారే అవకాశమొచ్చింది. సరిగ్గా అప్పుడే ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమం ఊపందుకుంది. నిజానికి ఆ కాలంలో నక్సల్బరీ ఉద్యమం, వామపక్ష రాజకీయాల నుంచి వచ్చినవాళ్లు తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకోలేదు. దీనికి కారణం తెలంగాణను అర్థం చేసుకోలేకపోవడం కావచ్చు. తెలంగాణ గురించి, దాని ఏర్పాటు గురించి అంతలా ప్రాధాన్యత ఇవ్వకపోవడం కారణం అయి ఉండవచ్చు. అయితే.. 96లో వచ్చిన ఉద్యమం నాలాంటి ఎందరిలోనో మార్పు తెచ్చింది. ఉద్యమం వైపు తిప్పుకున్నది. మలి చైతన్యం పుట్టి నేను మళ్లీ ప్రజల్లోకి వెళ్లగలిగాను. ప్రజాక్షేత్రంలో తెలంగాణ ఆవశ్యకత గురించి అవగాహన తీసుకొచ్చే బాధ్యత తీసుకున్నాను.

**క్రాంతి: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఓయూ పాత్ర గురించి మీరెలా విశ్లేషిస్తారు?**

**అల్లం నారాయణ:** రకరకాల కారణాల వల్ల విడిపోయిన తెలంగాణ విద్యార్థి లోకాన్ని మలిదశ ఉద్యమం మళ్లీ కలిపింది. ఆర్ట్స్ కాలేజీ ముందు ఏర్పాటు చేసిన ఓ మీటింగుకి మేం కూడా వెళ్లాం. అక్కడ జర్నలిస్టుల ఫోరంతో సంబంధాలు ఏర్పడ్డాయి. అక్కడే తొలి విద్యార్థి జేఏసీ ఏర్పాటు చేశాం. వారం రోజుల పాటు నేను, ఘంటా చక్రపాణి లాంటి వాళ్లం అక్కడే ఉండి రకరకాల ప్రోగ్రామ్స్ కండక్ట్ చేశాం. ఓయూ లేకుంటే తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఇంత బలం ఉండేది కాదు. తెలంగాణ ఉద్యమాన్ని నిలబెట్టింది ఓయూనే. తెలంగాణ కోసం అన్నీ వర్గాల విద్యార్థులను ఏకం చేసింది. తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసింది. ప్రొఫెసర్లు, లెక్చరర్లు, టీచర్లు, విద్యార్థులు అనే తేడా లేకుండా తెలంగాణ అనే అంశాన్ని చర్చించుకునేందుకు ఓయూ ఒక వేదికయింది. ప్రేరణ ఇచ్చింది. అమెరికా, గల్ఫ దేశాలు, ఆస్ట్రేలియా, స్వీడన్ లాంటి దేశాల్లో ఉన్న తెలంగాణ వారసులు నాకు ఉత్తరాలు రాసేవారు. వారికి వివరంగా, ఓపికగా తిరుగు లేఖ రాసేవాణ్ణి. నన్ను తెలంగాణ ఉద్యమంలో నిలిచేలా.. ఇంతటి స్థాయికి ఎదిగేలా చేసింది.. అక్షరాలా ఉస్మానియా యూనివర్సిటీయే. అందుకే.. నేనెప్పుడూ చెప్తుంటా.. ఓ యూకు నేను రుణపడి ఉంటా అని.

## ఇంటర్వ్యూ

# జ్ఞాపకాల ముసురు

తెలంగాణ సమాజం ఫ్యూడలిజం మాత్రమే కాదు, పితృస్వామికమైనది కూడా. పురుషలే చదువుకోని రోజుల్లో స్త్రీ విద్యను కోరుకోవటం సాహసమే. ఆనాడు ఖాన్గీ బడులల్లో పురుషులకే ప్రవేశం ఉండేది. స్త్రీలు తెరచాటుకే పరిమితమయ్యారు.బాధునిక భావాలు ప్రవేశించిన కొన్ని కుటుంబాల్లో అమ్మాయిలకు క్షర జ్ఞానం జీవితాన్ని వెలిగిస్తుందనే ఆలోచన వచ్చింది. నైజామును ముప్పుతిప్పలు పెట్టిన నల్గొండ జిల్లా నుంచి అక్షరభ్యాసం చేసిన మొదటితరం స్త్రీ ఈనాడు తెలంగాణ పునర్నిర్మాణంలో బలమైన కలంగా **డా॥ముదిగంటి సుజాతరెడ్డి** జ్ఞాపకాలలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తూ...

**స్నేహ: మీ బాల్యం-విద్యాభ్యాసం గురించి చెప్పండి?**

**సుజాతారెడ్డి:** నా బాల్యమంతా పల్లెటూరులోనే గడిచింది. మాది వ్యవసాయ కుటుంబం. ఎటువంటి విద్యా వాతావరణం లేదు. మావాళ్లకు చదివించాలనే ఆలోచన కూడా లేదు. మాది నల్లగొండ జిల్లా ఆకారం గ్రామం. నేను పుట్టిన ఐదారేండ్లకే 1947- 48లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రారంభమైంది. దీంతో ఆంధ్రా ప్రాంతాలకు వెళ్లిపోయినం. అక్కడ రెండేండ్లుండి మళ్లీ 1950 చివరలో తిరిగొచ్చినం. అప్పటికీ నల్లగొండలో ఇంకా సాయుధ పోరాట వేడి వాతావరణం ఉన్నది. మా జిల్లా కమ్యూనిస్టు ఉద్యమాలకు సెంటర్‌గా ఉండేది. రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు లాంటి వాళ్లంతా నల్లగొండ జిల్లా వాళ్లే. చిన్నప్పుడు కొంతకాలం వరంగల్‌లో మా అమ్మమ్మ వాళ్ల ఊర్లో ఉన్న. ఊర్లు మారడంతో చదువు సరిగ్గా సాగలేదు. నర్సారావుపేటకు పోయినపుడు ఏదో కొంచెం చదువుకున్న. మా మేనమామది వరంగల్‌లో వెంకటాద్రిపేట. అక్కడ కొద్దికాలం చదువుకున్న.

1950లో నల్లగొండకు వచ్చినపుడు గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్‌లో నాలుగో తరగతిలో చేరిన. 10వ తరగతి వరకు అక్కడే చదివిన. ఆ స్కూల్‌లో మృగశిర అనే హెడ్‌మిస్ట్రెస్ ఉండేది. విద్యార్థినులపై ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకునేది. ఆమె చేత చాలా ప్రేరణ పొందినం. చాలా పుస్తకాలు చదివినం. మా తల్లిదండ్రులకు మాత్రం ఎప్పుడు పెళ్లి చెయ్యాలా అనే తొందర్నే వుండేది.

**స్నేహ: ఉస్మానియా యూనివర్సిటీకి ఎలా వచ్చారు? ఎందుకు రావాలనిపించింది?**



**సుజాతారెడ్డి:** బీఏ ఫస్ట్ ఇయర్ వరకు నల్లగొండల్నే చదివిన. బీఏ ఫస్ట్ ఇయర్‌లో ఉండగానే పెళ్లయింది. తర్వాత హైద్రాబాద్‌కు వచ్చి ఉమెన్స్ కాలేజీలో చేరిన. అక్కడ డిగ్రీ పూర్తిచేసాను. పీజీ చదివేటప్పుడు కూడా ఉద్యోగం చేయాలనే ఆలోచన ఉండేది కాదు. ఎప్పుడూ చదువుకోవాలనే ధ్యాసే ఉండేది. ఆడపిల్లలం కాబట్టి ఉద్యోగమనే ఆలోచనే లేదు. పీజీ చదివేటపుడు మా క్లాస్‌లో 28మంది ఉంటిమి. అందులో ఐదుగురం మాత్రమే అమ్మాయిలం ఉండేవాళ్లం. సెకండ్ ఇయర్‌కు వచ్చేసరికి ఇద్దరం మాత్రమే మిగిల్నం. ఆ 28 మందిలో కూడా నలుగురైదుగురు టీచర్ క్యాండిడేట్స్. రెగ్యులర్ విద్యార్థులు తక్కువనే.

1961- 63లో ఎంఏ చదివిన. మా ఇంట్లో అసలు చదివించాలనే ఆలోచనే లేదు. పీయూసీ చదివిన. అప్పట్లో అందరికీ ఆడపిల్లలు డాక్టర్ కావాలని ఉండేది. చదువుకొనే

ఆడపిల్లలు డాక్టర్ అయితేనే బాగుంటదనేవాళ్లు. అందుకని సైన్స్ కోర్సు తీసుకున్న. కానీ నాకు సైన్స్ ఇష్టం లేదు. దీంతో బీఏ తెలుగు లిటరేచర్‌లోకి మార్చుకున్న. బీఏ ఫస్ట్ ఇయర్‌లో నల్లగొండలో వెంకట్రామయ్య అనే లెక్చరర్ ఉండెవారు. ఆయన బాగా చెప్పేవాడు. డిగ్రీలో మంచి లెక్చరర్స్ ఉండిరి. ఖండవల్లి లక్ష్మీరంజనం గారి ఆంధ్రుల సాహిత్య సంగ్రహ చరిత్ర చదివిన. అదెక్కణ్నో దొరికింది. ఆ పుస్తకం చదవడంతో నాకు సాహిత్యంపై చాలా ఆసక్తి కలిగింది. దీంతో తెలుగులో ఎంఏ చదవాలని నిర్ణయించుకున్న.

హైస్కూల్‌లో ఉన్నప్పుడు నాగార్జున సాగర్‌కు ఎక్స్‌కర్షన్ పోయినం. ఆ జ్ఞాపకాలతో ఒక ఆర్టికల్ రాసి ఆంధ్రప్రభ పత్రికకు పంపిన. ఆ పత్రికలో ప్రమదావనం అనే కాలమ్ ఉండేది. ఆ కాలమ్‌ను మలతీచందూర్ నిర్వహించేవారు. ప్రమదావనంలో నా ఆర్టికల్ అచ్చయింది. అప్పుడప్పుడూ కవితలు కూడా రాసేదాన్ని. కాలేజీలో ఫస్ట్ ఇయర్‌ల శ్రీశ్రీ మీదొక కవిత రాసిన. అది బెస్ట్ పొయెమ్‌గా సెలక్టయింది. కానీ ఎట్లా రాయాలె, ఏయే పుస్తకాలు చదవాలని చెప్పేవాళ్లెవరూ లేరు.

**స్నేహ: మీరు చదువే రోజుల్లో ఓయూలో ఏవైనా విద్యార్థి సంఘాలు ఉండేవా?**

**సుజాతారెడ్డి:** మేం చదువుకునేటపుడు కమ్యూనిస్ట్ భావాలున్న విద్యార్థులు ఉన్నారేమో కానీ నాకు అంతగా తెలిసేవాళ్లు కాదు. ఉద్యమాలేవీ ఉండేవి కాదు. కానీ అంతకుముందు లెఫ్టిస్ట్ భావాలున్నవాళ్లు ఉండేవాళ్లు. విప్లవ కవి వరవరరావు మాకు ఒక సంవత్సరం సీనియర్. వీళ్లంతా అప్పటికే లెఫ్టిస్ట్ భావాలున్నవాళ్లు. ఎలాంటి కార్యక్రమాలుండేవి కాదు. లెక్చర్స్ మాత్రం జరిగేవి. విద్యార్థి ఉద్యమాలు బలంగా ఉండేవి కాదు. 1969 నుంచి చాలా గొడవలు జరిగేవి. 1969లో బలమైన విద్యార్థి ఉద్యమాల్లేకుండె. 1975లో నా పీహెచ్‌డీ పూర్తిచేసిన.

**స్నేహ : ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో మీరు ఓయూలోనే ఉన్నారా?**

**సుజాతారెడ్డి:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంలో మేమిక్కడ లేము. 1969 చివరలో ఇండియాకొచ్చినం. అప్పటికే ఇక్కడ ఉద్యమ తీవ్రత తగ్గింది. ఒక సంవత్సర కాలమంతా యూనివర్సిటీ మూసేసింద్రు. పీజీ తర్వాత జర్మనీ వెళ్లినం. మా వారికి జర్మన్ కాలేజీలో పీజీ చదివేందుకు స్కాలర్‌షిప్ వచ్చింది. ఆయన నాకంటే ఒక సంవత్సరం ముందుగానే జర్మనీకి వెళ్లిండు. అక్కడ మూడేండ్లున్నం. 1969లో తిరిగొచ్చినం. అప్పటికే నాకు ఇద్దరు పిల్లలు.

**స్నేహ: మీరు జర్మనీలో ఉన్నప్పుడు ఏం చేసారు?**

**సుజాతారెడ్డి:** జర్మనీలో ట్యుబింగన్ యూనివర్సిటీ చాలా పేరున్న యూనివర్సిటీ. అక్కడి మెయిన్ లైబ్రరీలో పనిచేసిన. ఓరియంటల్ సెక్షన్‌లో కేటలాగ్ చేయడంలో ఉద్యోగం. అక్కడ అన్ని యూనివర్సిటీల్లో సంస్కృతంలో ఇండాలజీ డిపార్ట్‌మెంట్ ఉండేది. ఇప్పుడక్కడ ఆర్ట్స్‌కు డిమాండ్ తగ్గింది. ఇండాలజీ డిపార్ట్‌మెంట్ తీసేసి సౌత్ ఏషియా స్టడీస్ అని పెట్టారు. ప్రతి పుస్తకాన్ని చదివి కేటలాగ్ చేయాల్సివచ్చేది. దీంతో నాకు సంస్కృత పుస్తకాలతో చాలా పరిచయమైంది. మా వారికి సంస్కృతంలో మంచి ప్రావీణ్యమున్నది. అతను గురుకులంలో చదివారు. వేద మంత్రాలు చదువుతూ ఉండేవారు. వేదాల్లో మనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. సైన్స్, సోషల్, సోషియాలజీ, వైద్య విద్య, కవిత్వానికి సంబంధించిన ఎన్నో విషయాలున్నాయి. మనం చాలా తక్కువ అర్థం చేసుకుంటున్నాం. ఇప్పుడు వాడుకలో ఉన్న మంత్రాలు మాత్రమే సంస్కృతం అనుకుంటాం. కానీ అందులో ఎంతో కవిత్వం ఉన్నది. అందమైన కవిత్వమే కాకుండా ఆనాటి సోషల్ కండీషన్స్ ప్రతిబించినయి. అట్లా సంస్కృతం గురించి నాకు చాలా విషయాలు తెలిశాయి. చాలా నోట్స్ తయారుచేశాను. హైదరాబాద్ వచ్చిన తర్వాత ఇద్దరం (నేనూ, గోపాల్‌రెడ్డి) సంస్కృత సాహిత్య చరిత్ర రాసినం. సాహిత్య లోకంలో ఆ పుస్తకాన్ని నభూతో నభవిష్యతి అని పొగిడింద్రు.

**స్నేహ : మీరు ఉద్యోగంలో ఎప్పుడు చేరారు?**

**సుజాతారెడ్డి:** జర్మనీ నుంచి వచ్చిన తర్వాత రెడ్డి కాలేజీలో ఉద్యోగానికి అప్లయ్ చేసిన. నాకు సెకండ్ క్లాస్ మార్కులే ఉన్నయ్. కానీ ఫస్ట్ క్లాస్ వచ్చినవాళ్లు జాయిన్ కాలేదు. దీంతో నేను జాయినైన. తర్వాత ఆ ఉద్యోగం రెగ్యులరయింది. అట్లా అక్కడే 30ఏండ్లు పనిచేసిన. నాకు టీచింగ్ అంటే చాలా ఇంట్రస్టు. టీచింగ్ వల్ల మనం నేర్చుకునేది ఎక్కువగా ఉంటుంది. అందుకని మాక్స్‌ముల్లర్ భవన్‌లో ఎక్కువ జీతమున్న ఉద్యోగాన్ని వదిలేసి రెడ్డి కాలేజీలో తక్కువ జీతానికి పనిచేసిన. అప్పుడే పీహెచ్‌డీ కూడా చేసిన. అప్పట్లో దివాకర్ల వేంకటావధాని గారు హెడ్‌గా ఉన్నరు. ఆయన మాకు మను, వసుచరిత్రలు బోధించేవారు. యూనివర్సిటీల్లో అప్పట్లో ప్రాచీన సాహిత్యమే నడిచేది. మేం చదువుకునేటపుడు అంతా ప్రాచీన సాహిత్యమే సిలబస్‌లో ఉండేది. పీహెచ్‌డీలో కూడా అంతా ప్రాచీన సాహిత్యానికి సంబంధించిన అంశాలే ఇచ్చేవారు. తర్వాత 1990లో మార్పొచ్చింది. సిలబస్‌లో ఆధునిక సాహిత్యం చేర్చారు.

**స్నేహ: మీ రచనా వ్యాసంగం గురించి చెప్పండి?**

**సుజాతారెడ్డి:** ఆ కాలంలో స్త్రీలు చాలా రచనలు చేసారు. పత్రికల్లో అచ్చయ్యేవి. కానీ నాకవి అంతగా నచ్చేవి కాదు. అంత సీరియస్ రచనలుగా అన్పించకపోయేది. ఆ కాలంలో నేనేమీ రచనలు చేయలేదు. వాటితో ఎలాంటి ప్రేరణా పొందలేదు.

తర్వాత కాలంలో అప్పుడప్పుడూ రాసి పత్రికలకు పంపేదాన్ని. కానీ వాటిని ప్రచురించేవాళ్లు కాదు. తెలంగాణ యాసలో రాయడం వల్లనో ఏమో గానీ పత్రికల్లో వేసేవాళ్లు కాదు. నేను సీరియస్‌గా రాసింది మాత్రం 1985నుంచే. కథలు, నవలలు రాసిన. మలుపు తిప్పిన రథచక్రాలు నవల రాసి విశాలాంధ్రకు పంపిన. వాళ్లు దాన్ని చూసి ఒకసారి దాశరథి రంగాచార్యకు చూపించమన్నారు. ఆయన ఆ ప్రతిని చదివి దీన్ని ఎవరూ ప్రచురించరమ్మా...నువ్వే ప్రచురించుకోమని చెప్పారు. అయితే నా కథలు, నవలలు నేనే ప్రచురించుకున్న. అప్పటికి ఎవరి రచనలు వాళ్లే ప్రచురించుకోవాలనే పద్ధతి లేకుండె. ఏంటీ నీకు నువ్వే వేసుకుంటున్నవేంటని అందరన్నరు. ఇప్పుడు ఎవరి రచనలు వాళ్లే వేసుకుంటున్నరు. తెలుగులో పబ్లిషర్స్‌తో పనిలేకుంటయింది.

**స్నేహ : ఆనాడు ఓయూలో ప్రొఫెసర్లకు, విద్యార్థులకు మధ్య సంబంధాలు ఎలా ఉండేవి**

**సుజాతారెడ్డి:** క్లాసులు చాలా శ్రద్ధగా వినేవాళ్లం. ప్రొఫెసర్‌లతో ఫ్రీగా మాట్లాడాలంటే జంకేవాళ్లం. మగపిల్లలు మాత్రం ప్రొఫెసర్‌ల ఇళ్లకు వెళ్లి బాగా మాట్లాడేవాళ్లు. అబ్బాయిలు ప్రొఫెసర్‌లను ఇల్లకు వెళ్లి కాకా పడతారు కాబట్టే వాళ్లకు ఎక్కువ మార్కులు, మాకు తక్కువ మార్కులొచ్చేదనుకునేవాళ్లం. పీజీ ఫస్ట్ ఇయర్‌లో నాకు, ముదిగొండ వీరభద్రయ్యకు ఫస్ట్‌క్లాస్ వచ్చింది. సెకండ్ ఇయర్‌ల నాకు సెకండ్ క్లాస్ వచ్చింది. ఫస్ట్‌క్లాస్‌కు నాకు ఒక అరమార్కు తక్కువొచ్చింది. అప్పట్లో ఫస్ట్ క్లాస్ రావడం చాలా తక్కువ. ఒకటి, రెండు మాత్రమే ఫస్ట్‌క్లాసులొచ్చేవి.

**స్నేహ : మీరు ఓయూలో చదువుకున్నప్పుడు అకడమిక్ స్టాండెట్స్ గురించి చెప్పండి.**

**సుజాతారెడ్డి:** అప్పట్లో అకడమిక్ సెమినార్స్ లాంటివేవీ ఉండేవి కాదు. ఖండవల్లి లక్ష్మీరంజనం గారు వ్యాకరణం చెప్పేవారు. దివాకర్ల వేంకటావధాని గారు పద్యం చెప్పేవారు. వసుచరిత్ర లాంటివి. పద్యం ఎట్లా చదవాలో అవి విని నేర్చుకునేవాళ్లం. రెఫరెన్స్ వర్క్ బాగా చేసేవాళ్లం. ఆర్ట్స్ కాలేజీలో లైబ్రరీ వర్క్ బాగా జరిగేది. అప్పట్లో శ్రీనాథుని కవితా సౌందర్యం అనే ఒక పుస్తకం రాసిన. అప్పట్లో మాకు పీజీలో శ్రీనాథుడు అని ఒక పేపర్ ఉండేది. దీనికోసం బాగా చదివి రిఫరెన్స్ వర్క్‌తో నోట్స్ తయారుచేసాను. దానిని తర్వాతి కాలంలో పుస్తకం వేసిన.

**స్నేహ : ఆనాడు విద్యార్థుల వ్యాపకాలు ఎలా ఉండేవి?**

**సుజాతారెడ్డి:** విద్యను వ్యాపకంగా మాత్రమే ఎంచుకునేవారం. అందరూ చదవకపోయేవారు. దానితో ఇష్టం ఉన్నవారు మాత్రమే లోతైన అధ్యయనం చేసేవారు. చదివేవారికి అదే లోకంగా ఉండేవారు. విద్యార్థులకు వేరే ఏమీ వ్యాపకాలు ఉండేవి కాదు. ఇంట్లో టీవీ కూడా లేని కాలమది. ఎక్కడికి వెళ్లాలన్నా రవాణా ఇంతగా లేదప్పట్లో. ఫోన్లు, టీవీలు, ప్రయాణాలు లేకపోవడంతో ప్రశాంతంగా చదువుకునేవారం.

**స్నేహ : ఓయూలో మీరు ఎప్పటివరకు ఉన్నారు?**

**సుజాతారెడ్డి:** నేను రెడ్డి కాలేజీలో ఉద్యోగం చేసేటప్పుడు, నా భర్త ఓయూలోనే ఫాకల్టీగా విధులు నిర్వర్తిస్తుండటంతో ఓయూ క్వార్టర్ నెంబర్ 29లో ఉండేవాళ్లం. 13 ఏండ్లు అక్కడే ఉన్నాం. ఓయూ నుంచి రెడ్డి కాలేజీకి బస్‌లో వెళ్లేదాన్ని. ఓయూలో కేవలం విద్యార్థుల కోసమే బస్సులొచ్చేవి. బస్సులు మాత్రం టైముకొచ్చేవి. జనరల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉండేది కాదు. ఆర్ట్స్ కాలేజీ దగ్గర బస్సుదిగి హాస్టల్స్ వెనుక తొవ్వ నుంచి ఇంటికి వెళ్లేవాళ్లం. అప్పట్లో క్యాంపస్‌లో చుట్టూ చెట్లు, స్వచ్ఛమైన గాలితో వాతావరణం చాలా అహ్లాదంగా, అందంగా ఉండేది.

**స్నేహ : అప్పటి అధ్యయనం-అధ్యాపనం గురించి చెప్పండి?**

**సుజాతారెడ్డి:** ప్రాచీన సాహిత్యం గురించి తెలుసుకున్నం. బాగా చదువుకున్నం. అంతేగాని రచనలు ఎట్లా చేయాలనేది తెలియదు. క్రియేటివ్ రైటింగ్ అంటే ఏంటో తెలియదప్పట్లో. వెస్ట్రన్ కంట్రీస్‌లో ఉన్నట్లు మన దగ్గర క్రియేటివ్ రైటింగ్ ఏమీ లేదు. మనం పుస్తకాలు చదివి ఎట్లా రాయాలంటే మనకు మనమే చదువుకోవాలె. అంతే. అట్లనే నేర్చుకున్నం.

బాల్యంలో పల్లెటూరి జీవితం నుంచి చాలా నేర్చుకున్న. నాకు పల్లె జీవితమంటేనే చాలా ఇష్టం. అందుకే నా నవలల్లో, కథల్లో పల్లె జీవితం గురించిన ప్రస్తావనే ఎక్కువుంటది.

అప్పట్లో పద్యం చదవడం, చెప్పడం. అంతే. వ్యాకరణం చెప్పడం, ఆంధ్రుల ప్రాచీన చరిత్ర సంస్కృతి ఒక పేపర్ ఉండేది. మేఘ సందేశం, నాటకం ఉండేవి. చలమచర్ల రంగాచార్యులు గారుండేవారు. ఆయన చాలా చాలా ఓరియంటల్ విధానంలో చెప్పేవాళ్లు.

**స్నేహ : ఆనాటికి, ఈనాటికి విద్యార్థుల్లో వచ్చిన మార్పుల గురించి చెప్పండి?**

**సుజాతారెడ్డి:** ఇప్పటి విద్యార్థుల్లో చాలా తొందరగా ఉద్యోగంలో చేరి డబ్బు సంపాదించాలనే ఆత్రుతే ఎక్కువ కన్పిస్తున్నది. అంతేగానీ చదవాలి, విజ్ఞానాన్ని సంపాదించాలనే ఆలోచనలో లేరు. అధ్యయనం చేసి, రెఫరెన్స్ వర్క్ చేయాలనే తపన తగ్గింది. విద్యార్థుల్లో జిజ్ఞాస తగ్గింది. అంతా టెక్నాలజీ మయమైంది. బాగా చదువుకుని, డబ్బులున్నవాళ్లేమో టెక్నాలజీ రంగంవైపు పోతున్నారు. సాహిత్యం వైపు దృష్టి పెట్టట్లేదు. సమాజంలో వస్తున్న మార్పులు, పరిస్థితుల వల్లనే ఇట్లవుతున్నదేమో. పెండ్లయిన తర్వాత నా భర్త ఎంఏ సంస్కృతం చేశారు. ఆయనకు అప్పటికి ఏమీ ఉద్యోగం లేదు, అసలు ఉద్యోగం గురించి ఆలోచించనే

లేదు. తర్వాత మేము హైదరాబాద్‌కు వచ్చినం. వచ్చిన కొత్తలో చప్పల్ బజార్‌లోని ఒక మామూలు ఇంట్లో ఉండేవాళ్లం. అన్ని సౌకర్యాలు కావాలని ఎప్పుడూ అనుకోలేదు. నీళ్లు పట్టడం, కిరోసిన్ స్టౌలపై వంటచేయడం ఇదే సరిపోయేది.

వివిధ పరిస్థితులను బట్టి వచ్చిన మార్పు మనిషి జీవితాన్ని మార్చుతున్నది. ప్రొఫెసర్‌లు కూడా బస్సుల్లోనే వచ్చేవాళ్లు. ఎవరికీ కార్లు, మోటార్ సైకిళ్లు ఉండేవి కాదు. ఆలోచించే విధానం మారింది. విద్యార్థులు అవకాశాలు ఎక్కువ కావాలని కోరుకుంటున్నరు. ఇప్పుడున్న విద్యార్థుల్లోనూ కొందరైనా లిటరేచర్ చదివే వాళ్లుంటరు. అందరూ ఒకేలా ఉండరు కదా. విషయం మీద మనసు లగ్నం చేసే ఓపిక విద్యార్థుల్లో తగ్గింది. పుస్తకాలు చదవడం తగ్గింది. ఎవరికైతే అసలైన ఇంట్రస్టుందో వాళ్లు మాత్రమే చదివితే బాగుంటది. బాగా ఆసక్తి ఉన్నవాళ్లు మాత్రమే ఉన్నత విద్యకు వస్తరు.

ఆ మధ్య పరిశోధనలు బాగనే వచ్చినయి. కొన్ని రెఫరెన్స్‌గా కూడా మిగిలినయి. కలకాలం నిలిచిపోయే పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసాలు కూడా వచ్చినయి. ఈ కాలంలో పిల్లలు చదవట్లేదు. వారిలో రాసే ఓపిక కూడా లేకుండా పోయింది. తీసుకున్న పుస్తకం కూడా చదవటం లేదు.

ఉద్యోగంలో కంపల్సరీ పీహెచ్‌డీ ఉండాలనే నిబంధన పెట్టింది యూజీసీ. దీంతో అందరూ పరిశోధనల్లో జాయినయింద్రు. ఇష్టమున్నా లేకున్నా చేరింద్రు. ఇప్పుడు అసలైన ఆసక్తి ఉన్నవారు కాకుండా అవసరాల కోసం పీహెచ్‌డీ చేసేవాళ్లే ఎక్కువున్నరు. దీంతో పరిశోధన ప్రమాణాలు పడిపోతున్నవి.

**స్నేహ : మీతో కలిసి చదువుకున్న మిత్రుల గురించి చెప్పండి?**

**సుజాతారెడ్డి:** మా బ్యాచ్‌లో సువర్చల అనే అమ్మాయి ఉండేది. ఆమె లెక్చరర్‌గా పనిచేసింది. సువర్చల కొన్ని నవలలు కూడా రాసింది. ఇప్పుడేమయిందో తెలియదు. సువర్చల, వీవీ కాలేజీలో పనిచేసే కాశీనాథుని నాగేశ్వరరావు ప్రేమ పెండ్లి చేసుకున్నరు. ఒకమ్మాయి యూఎస్‌ఏ వెళ్లిపోయింది. మేమంతా మగపిల్లలతో కలిసే వుండేది.

**స్నేహ : ఓయూలో ఆ రోజుల్లో కుల ప్రభావం ఏ విధంగా ఉండేది?**

**సుజాతారెడ్డి:** మేం పీజీ చేసేటపుడు ఎక్కువగా ఉన్నత కులాలవాళ్లే వచ్చేవారు. ఎక్కువగా బ్రాహ్మిన్స్, రెడ్డి, వెలమలు ఉండేవారు. ఒకరిద్దరు బీసీలుండేవారు. ఎస్సీ, ఎస్టీల నుంచి విద్యార్థులు అసలే లేరు. మేం డిగ్రీ పిల్లలకు క్లాసులు చెప్పేటపుడు కూడా డిగ్రీలో కూడా ఎస్సీ, ఎస్టీ పిల్లలు చాలా తక్కువగా వున్నారు. 1990తర్వాత అప్పర్ క్యాస్ట్ పిల్లలంతా టెక్నాలజీ వైపు వెళ్లిపోయారు. ఆ క్రమంలో దళిత, గిరిజన, ఆదివాసీ విద్యార్థులు యూనివర్సిటీలకు వచ్చారు. ఆ రోజుల్లో అమ్మాయిలు కూడా చాలా తక్కువగా ఉండేవారు. ఉన్నవారు కూడా పీజీ అయిపోయేలోగానే మధ్యలో పెళ్లిళ్లై మానేసేవారు. ఇప్పుడు సగభాగంగా వస్తున్నారు. కానీ చదువులో నాణ్యత తగ్గిపోయింది.

**స్నేహ : మీ రచనల గురించి చెప్పండి.**

**సుజాతారెడ్డి:** నేను ముఖ్యంగా నవలలు, కథలు రాసాను.

**నవలలు:** 1. మలుపు తిరిగిన రథచక్రాలు(1994),

2.సంకెళ్లు తెగాయి(1994),

3. ఆకాశంలో విభజన రేఖల్లేవు(1995).

**కథా సంపుటాలు:** 1. విసుర్రాయి(19980, 2. మింగుతున్న పట్నం(2001), 3. వ్యాపార మృగం(2005), మరో మార్పు పుట్టాలె(2010)

**సాహిత్య విమర్శ గ్రంథాలు:** 1. మను, వసుచరిత్రల తులనాత్మక పరిశీలనం (1981), 2. శ్రీనాథుని కవితా సౌందర్యం(1982), 3. తెలుగు నవలానుశీలనం(1991), 4. వేమన-నాథ సాంప్రదాయం (1993), 5. రస చర్చ- ఆధునికత(2010), 6. అద్యతన దృష్టి(2014)

**సంపాదకత్వం:** 1. తెలంగాణ తొలితరం కథలు (2002), 2. తొలినాటి కతలు-2005 (తెలంగాణ తొలితరం కథలు రెండో భాగం0, 3. జైలు లోపల (వట్టికోట ఆళ్వారుస్వామి కథలు), 4. నూరేండ్ల తెలుగు కథలు(2010)

**వ్యాస సంకలనం:**1. ముద్దెర- 2005(తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్య విమర్శ వ్యాసాలు.

**ఆత్మకథ:** ముసురు- 2010 (అనుభవాలు- జ్ఞాపకాలు)

**స్నేహ : ఓయూ గురించిన జ్ఞాపకాల ముసుర్లు...**

**సుజాతారెడ్డి:** ఓయూలో చదవడం ఒక అదృష్టంగా భావించేవాళ్లం. ఇరాన్ నుంచి వచ్చిన ఓ ఇంజినీర్ ఆర్ట్స్ కాలేజీని డిజైన్ చేసిండు. ఆర్ట్స్ కాలేజీ నిర్మాణ సమయంలో పాల్గొన్న కూలీలతో అంగడి బజార్ అనేది ఏర్పడింది. అక్కడ ఆర్ట్స్ కాలేజీ నిర్మాణంలో పనిచేసిన కార్మికులుండేవాళ్లు. వాళ్లలో ఒకతనితో అప్పట్లో ఇంటర్వ్యూ చేసిన. ఆర్ట్స్ కాలేజీ కట్టినవాళ్లని చేతులు నరికేసింద్రని చెప్పిండు. ఇట్లాంటి నిర్మాణం మరెక్కడా ఉండకూడదని అట్ల చేసింద్రని చెప్పిండు. తాజ్‌మహల్ తర్వాత ఇదే అందమైన కట్టడమని అందరూ అంటుంటారు. ఇప్పుడు ఆర్ట్స్ కాలేజీని ఎట్లా ప్రొటెక్ట్ చేస్తున్నారనేది తెల్వదు. వందేళ్ల సందర్భంగా ఏమైన మరమ్మతులు చేస్తున్నరో లేదో. అదొక అందమైన కట్టడం. ఆ కాలేజీలోకి ప్రవేశించగానే ఉండే వరండా, మెట్లను చూస్తే ఒక అనుభూతి మాలోకి ప్రవేశించేది. ఆ అనుభూతి ఇప్పటికీ నా జ్ఞాపకాలలో పదిలంగా ఉంది.

T

# ఓయూలో విద్యార్థి చలనాలు

● సి. కాశీం

తెలంగాణ లాంటి ప్రాంతంలో ఒక విద్యా సంస్థ ఏర్పడటం ఆనాటికి అపురూపమే. ఫ్యూడల్ ప్రభువుల పాలనలో ఉన్న తెలంగాణ ఆర్థిక దోపిడీకి, రాజకీయ అణచివేతకు, సాంస్కృతిక వివక్షకు గురయింది. విద్య పట్ల, ప్రజల సాంస్కృతిక వికాసం పట్ల శ్రద్ధలేని పాలన అది. ప్రభువుల విలాసాలు, ప్రజల విలాపాలు. కనీసం ఫ్యూడల్ ప్రభువుల పిల్లలనైనా చదువుల వైపు ముఖ్యంగా ఆంగ్ల విద్య వైపు మళ్లించారా? అంటే అదీ లేదు. 'చదివి ఏం చేయాలి? మరొకరి కింద ఉద్యోగమే కదా! ఒకరి కింద పని చేయాల్సిన ఖర్మ మనకేమి పట్టింది. మనకిందే వందలమంది జీతగాళ్లు, పనిమనుషులు ఉంటారు' అనే లాలసత్వం ప్రభువర్గాలలో ఉండింది. అందుకే వాళ్లు కూడా చదువుల వైపు మళ్లలేదు. కనీసం వీళ్లైనా ఆధునిక ఆంగ్ల విద్యను అభ్యసించి ఉంటే ఆ విద్య ఇచ్చిన చైతన్యంతో జాతీయోద్యమం వలె తెలంగాణలో ఫ్యూడల్ వ్యతిరేక ఉద్యమం కొంత ముందే ప్రారంభమయ్యేది. ఆ నష్టం తెలంగాణ సమాజానికి జరిగింది. ఫ్యూడల్ ప్రభువుల, ధనికుల పిల్లల చదువులు కూడా ఎక్కాల పుస్తకాలు, పెద్ద బాలశిక్ష చదవటం వరకే పరిమితమయ్యాయి.

అందుకే హైదరాబాద్ సంస్థానం విద్యలో చాలా వెనకబడి ఉంది. జనాభాలో నూటికి ముగ్గురు లేదా నలుగురు విద్యావంతులు మాత్రమే ఉన్నారు. పద్నాలుగు శాతం మాత్రమే ఉర్దూ మాట్లాడే ప్రజలున్న ప్రాంతంలో 86 శాతం తెలుగు ఇతర భాషలు మాట్లాడే వారిని కాదని ఉర్దూ అధికార భాష అయింది. ఈ పరిస్థితులలోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడింది(1917 ఏప్రిల్ 26 ఫర్మాన్).

ఒక విద్యా కేంద్రం ఏర్పడటం వలన వివిధ ప్రాంతాలలోని విద్యార్థులు ఒక దగ్గర కూడుకొనే అవకాశం ఏర్పడింది. బ్రిటిష్‌వాళ్లు భారతదేశంలో విశ్వవిద్యాలయాలు నెలకొల్పడంతో(1857 నుంచి) దేశ వ్యాపితంగా ఉన్న ధనవంతుల పిల్లలు ఒకే దగ్గర చేరి చదువుకుంటున్న సందర్భంలో జాతీయ భావాలు ఏర్పడి బ్రిటిష్ వ్యతిరేక పోరాటాన్ని నడిపినట్లే, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకోవడానికి వచ్చిన ధనవంతుల పిల్లలు నిజాం వ్యతిరేక పోరాటానికి నాంది పలికారు.



ఎప్పుడైనా విద్యార్థులు ఒక సమూహంగా ఏర్పడి పోరాడటానికి విద్యాలయాలు ప్రధాన పాత్రను పోషిస్తాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం కూడా అదే పాత్రను నిర్వహించింది. ఆధునిక భావాలు పురుడు పోసుకొని పోరాడే చైతన్యాన్ని విద్య మాత్రమే అందించగలిగింది. సామాజిక మార్పులో విద్య ఆయుధంలా పని చేస్తుందని చెప్పటానికి ఎన్నో సందర్భాలను ఉటంకించవచ్చును. అయితే నిర్దిష్టంగా తెలంగాణ సమాజంలోనైతే జాతీయ భావాలు అందుకొని నిజాం వ్యతిరేక పోరాటాన్ని యువత చేపట్టటానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం అక్కడి విద్యా చైతన్యం పనిచేసింది.

ఓయూలో విద్యార్థి చలనం మూడు స్రవంతులలో జరిగింది. ఒకటి స్వామి రామానంద తీర్థ–ఆర్య సమాజికులు, రెండు ఆలంఖుంద్ మీరి నాయకత్వంలోని కామ్రేడ్స్ అసోసియేషన్–మూడు జాతీయ భావాలు కల్గిన వందేమాతరం ఉద్యమకారులు. వీరందరు సారాంశంలో నిజాం వ్యతిరేక పోరాటాన్ని బలపర్చేవారు. సూక్ష్మంగా చూసినప్పుడు 1925లో ఏర్పడిన ఆర్ఎస్ఎస్‌కు భావ సారూప్యత కలిగిన ఆర్య సమాజికులు అదే సంవత్సరంలో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) భావజాలం కలిగిన కామ్రేడ్స్ అసోసియేషన్. భారత జాతీయ కాంగ్రెస్‌కు దగ్గరగా ఉండే వందేమాతరం వాదులుగా చెప్పవచ్చు.

1930ల తర్వాత జాతీయోద్యమం పతాకస్థాయి నందుకొన్నది. భగత్‌సింగ్ అమరత్వం దేశ యువతను మేల్కొల్పింది. విద్యార్థి ఉద్యమాల నిర్మాణానికి మూలమైంది. 1936లో ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ అనే విద్యార్థి సంఘం ఈ నేపథ్యాన్ని కల్గివుంది. సామ్యవాదం, లౌకికవాదం, ఫాసిజం వ్యతిరేకత, స్వాతంత్ర్యం ఈ సంస్థ తన లక్ష్యాలుగా ప్రకటించు కున్నది. ఏఐఎస్ఎఫ్, సీపీఐ ఆలోచనాధారకు దగ్గరగా ఉండేది. హైదరాబాద్ సంస్థానంలో ఉండే విద్యార్థులు కూడా ఏఐఎస్ఎఫ్ సానుభూతిపరులు చాలామందే ఉండేవాళ్లు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వీరి సంఖ్య గణనీయంగా ఉండేది. కాని సీపీఐ మీద నిజాం సంస్థానంలో నిషేధం ఉండింది. అందువలన ఇక్కడి విద్యార్థులు, యువత ఏఐఎస్ఎఫ్‌లో చేరి పనిచేయటం కష్టం. అందుకే ఆలం ఖుంద్ మీరి, మగ్దూం మొహియుద్దీన్, రాజ్ బహదూర్ గౌడ్, జవాద్ హుస్సేన్ మొదలైన వాళ్లు కలిసి ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా కామ్రేడ్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసారు(1938 చివర్లో). సామ్రాజ్యవాద ఫాసిస్టు వ్యతిరేకత, సామ్యవాదం, లౌకికవాద పరిరక్షణ ఈ సంస్థ తన ఆశయాలుగా ప్రకటించుకున్నది.

నిజాంకు వ్యతిరేకంగా ఓయూ కేంద్రంగా విద్యార్థులు ఎ, బి హాస్టల్స్‌లో సమావేశాలు నిర్వహించారు. వీరిపై జాతీయోద్యమ చైతన్యం, గదర్ వీరుల త్యాగం ప్రభావం వేసింది. నిజాంకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని విద్యార్థులు నిర్ణయించుకున్నారు. ఇదే కాలంలో ఓయూలో విద్యార్థులు తప్పకుండా షేర్వాణి ధరించాలని, సూర్యచంద్రులు ఉన్నంతవరకు 'నిజాం వర్ధిల్లుగాక', 'లాంగ్ లివ్ ది కింగ్' అని కీర్తించాలని ప్రభుత్వం హుకుం జారీ చేసింది. ఈ నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ ఓయూలో విద్యార్థులు తమ నిరసనను తెల్పారు. అంతేకాకుండా ప్రత్యామ్నాయంగా వందేమాతర గీతాన్ని పాడటం మొదలుపెట్టారు. వందేమాతం ఆనాటి తరానికి నినాదమైంది. 1938లోనే స్టేట్ కాంగ్రెస్ 'సత్యాగ్రహం' ఉద్యమం విద్యార్థులకు మరింత నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వందేమాతరాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అంతటితో ఆగకుండా వందేమాతరం అని నినదించిన విద్యార్థులను సుమారు 1200 మందిని విద్యాలయాల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు (ది సివిల్ అండ్ మిలటరీ గెజిట్ జూలై 2,1939). ఓయూలో జరుగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావం తెల్పుతూ నాగపూర్ యూనివర్సిటీ విద్యార్థులు 'ది స్టూడెంట్ మార్చ్' పత్రికను ప్రచురించారు. ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్(1939), రాడికల్ స్టూడెంట్స్ లీగ్(1939) అనే మరో రెండు విద్యార్థి సంఘాలు కూడా ఈ కాలంలో ఏర్పడి పనిచేసాయి. హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ మొదటి సమావేశం రెడ్డి హాస్టల్‌లో జరిగింది. ఓయూలో జరిగిన ఎన్నికలలో ఈ సంస్థ విజయం సాధించింది. అలీఖాన్ అధ్యక్షుడిగా ఎన్నికైనాడు.

ఓయూలో ఈ విద్యార్థి చలనాలు ఒకవైపు జాతీయోద్యమానికి మద్దతునిస్తూనే నిజాం వ్యతిరేక పోరాటంలో భాగమయ్యాయి. క్విట్ ఇండియా ఉద్యమం, దొడ్డి కొమరయ్య అమరత్వం వీరిలో మరింత చైతన్యాన్ని పెంచింది. తెలంగాణ ప్రాంతంలో చదువుకొనే వీళ్లు అనివార్యంగా నిజాంకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న సాయుధ పోరాటానికి మద్దతుగా అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రజల విముక్తిలోనే తమ విముక్తిని చూసుకున్నారు. నిజాం వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటం విరమణ తర్వాత 1953లో ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో "నాన్ ముల్కీ గో బ్యాక్" ఉద్యమం నడిచింది. ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు(1956)కు ముందు నుంచే ఓయు విద్యార్థులు విశాలాంధ్రను వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని నడిపారు. విశాలాంధ్రను వ్యతిరేకించినందుకు ఏడుగురు

విద్యార్థులను పోలీసుల తుపాకి తూటాలకు బలిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు ఒప్పందాల ఉల్లంఘనల ఫలితంగా పదేళ్ల గడిచేసరికి ఓయు కేంద్రంగా అధ్యాపకులు, విద్యార్థులు 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు. ఆర్ట్స్ కాలేజీ వెనుక ఉండే జామై ఉస్మానియా రైల్వేస్టేషన్‌ను తగలబెట్టి మిలిటెంట్ ఉద్యమానికి నాంది పలికారు. లావా వలె ఎగజిమ్మిన ఉద్యమం అణచివేతకు గురై ఆగిపోయింది.

నక్సల్బరీ ఒక ఊరు కాదు. నామవాచకం కాదు. సర్వనామం. ఒకరి మీద కాదు దేశ ప్రజలందరి మీద ప్రభావం వేసింది. ముఖ్యంగా విద్యార్థి యువతరం మీద నక్సల్బరీ ప్రభావం ఎక్కువగా ఉంది. కలకత్తా, లక్నో, పంజాబ్ యూనివర్సిటీల విద్యార్థుల వలె ఓయు విద్యార్థులు నక్సల్బరీ రాజకీయ ప్రభావానికి గురయ్యారు. 'డెమొక్రటిక్ స్టూడెంట్స్' పేరు మీద జార్జిరెడ్డి మిత్రబృందం ఓయూలో పనిచేసింది. విద్యాలయాలలో మతోన్మాదాన్ని, గుండాగిరిని ప్రతిఘటిస్తూ ప్రజాస్వామిక భావాల వ్యాప్తి కోసం ఈ బృందం ఓయూలో పనిచేసింది. ప్రజాస్వామిక భావాలను జీర్ణించుకోలేని మతోన్మాదులు జార్జిరెడ్డిని హత్యచేసారు. ఆ తర్వాత దేశంలో ఎమర్జెన్సీ ఒకదాని తర్వాత ఒకటి చోటుచేసుకున్నాయి. ఎమర్జెన్సీలో ఎందరో విద్యార్థి నాయకులు బూటకపు ఎన్‌కౌంటర్‌లకు గురయ్యారు. ఎమర్జెన్సీకి ఏడాది ముందు(1974) రాడికల్ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యు) ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యు) ఆవిర్భవించాయి. ఈ రెండు విద్యార్థి సంఘాలు ఓయూ కేంద్రంగా పనిచేసాయి. సైన్స్ కాలేజీ, ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి సంఘం ఎన్నికలలో ఆర్ఎస్‌యు, పిడిఎస్‌యు అధ్యక్ష స్థానాలను కూడా గెలుపొందాయి. ఈ రెండు సంఘాలు విద్యార్థి ఉద్యమ చరిత్రలో మౌలిక మార్పును తీసుకొచ్చాయి. విద్యా రంగ సమస్యల కోసం మిలిటెంట్ పోరాటాలను నిర్మాణం చేసి పరిష్కరించాయి. స్కాలర్‌షిప్ పెంపు కోసం, విద్యాలయాలలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వాల మీద ఈ విద్యార్థి సంఘాలు పెట్టిన ఒత్తిడి ఫలితంగా ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం విద్యార్థి కేంద్రంగా పోరాటాలు చేయటం కాకుండా రైతాంగ, కార్మికుల, ప్రజల సమస్యల మీద పోరాటాలు నిర్మాణం చేసారు.

తొంభైయో దశకంలో వచ్చిన దళిత ఉద్యమ ప్రభావంతో ఓయూలో కొందరు విద్యార్థులు అంబేద్కర్ ఆలోచన విధానంలో విద్యార్థి కార్యక్రమాలను మొదలుపెట్టారు. ముఖ్యంగా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం 'దండోరా' ఉద్యమం మొదలయ్యాక మాదిగ విద్యార్థి సమాఖ్య(ఎంఎస్ఎఫ్) ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం, దళిత్ స్టూడెంట్స్ యూనియన్ బిఎస్పీ అవగాహనతో బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్(బీఎస్ఎఫ్) ఏర్పడి పనిచేసాయి. మతోన్మాదాన్ని ఎదుర్కొంటూ అంబేద్కర్ భావజాలాన్ని ప్రచారం చేసే కార్యక్రమాలను ఈ సంస్థలు తీసుకున్నాయి.

1996లో భువనగిరి, సూర్యాపేట సభ, వరంగల్ డిక్లరేషన్(1997) తర్వాత తెలంగాణ జనసభ ఏర్పడింది. జనసభ అవగాహనతో తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్(టీఎస్ఎఫ్) ఏర్పడి తెలంగాణ కోసం కార్యాచరణను రూపొందించుకున్నది. మలిదశ తెలంగాణ ఉద్యమం ఇట్లా మొదలైంది. వ్యక్తులు, సంస్థలు, సమూహాలు చేసిన కృషి ఫలితంగా మలిదశ తెలంగాణ ఉద్యమం జనసభ, తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ రూపంలో వ్యక్తమయ్యాయి. టీఎస్ఎఫ్ ఏర్పాటుకు కేంద్రం ఉస్మానియా విశ్వవిద్యాలయం. కార్యక్షేత్రం కూడా ఓయూనే. తెలంగాణ మీద విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం టీఎస్ఎఫ్ ఓయూలో అనేక సభలు నిర్వహించింది. పోరాట కార్యక్రమాలు తీసుకున్నది. 'స్థానికులకే సీట్లు, ఉద్యోగాలు' అనే నినాదంతో పనిచేసింది. ఇవాళ అందరూ మాట్లాడుతున్న ప్రజాస్వామిక తెలంగాణ నినాదాన్ని 1998లోనే జనసభ, టీఎస్ఎఫ్ ఇచ్చాయి. ఒకరకంగా ఓయూలో 2009 విద్యార్థి ఉద్యమం మొదలు కావటానికి టీఎస్ఎఫ్ పూర్వ నేపథ్యాన్ని రూపొందించింది.

ఓయూ కేంద్రంగా 2009 నవంబర్ 29న ఏర్పడిన విద్యార్థి జాక్‌కు ఆర్ట్స్‌కాలేజీ జీవం పోసింది. ఆర్ట్స్ కాలేజీ ముందు వెలసిన టెంట్ తెలంగాణ ఉద్యమాన్ని శాసించింది. తెలంగాణ ప్రజలందరు ఓయు వైపు చూసారు. చరిత్రలో కని విని ఎరుగని రీతిలో 2010 జనవరిలో 5 లక్షల మంది విద్యార్థులతో ఆర్ట్స్ కాలేజీ ముందు స్టూడెంట్ జాక్ సభ నిర్వహించింది. ఎన్నో మిలిటెంట్ కార్యక్రమాలను రూపొందించి ఆరిపోతున్న తెలంగాణ ఉద్యమాన్ని ఓయూ విద్యార్థులు నిలబెట్టారు. 2014 జూన్ 2న సాధించిన తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మౌనంగా నిలబడిన ఆర్ట్స్ కాలేజీ చెరగని ముద్ర వేసింది. వందేళ్లు నిండిన ఓయూ తన కీర్తి కిరీటంలో మరో వజ్రాన్ని పొదిగింది.

1930 నుంచి మొదలుపెట్టి ఈనాటి వరకు ఎన్నో విద్యార్థి ఉద్యమ చలనాలకు ఓయూ కేంద్రమయింది. చరిత్రను సృష్టించటమే కాకుండా ఓయూ ఈ దేశానికి అన్ని భావజాలాలు కలిగిన నాయకులను అందించింది. ప్రజా చలనంలో ఓయూ తన వంతు పాత్ర నిర్వహించింది. ఇప్పుడు విద్యార్థి చలనంలో కొంత స్తబ్దత, కెరీరిజం ప్రవేశించిన మాట వాస్తమైనప్పటికి చరిత్ర మళ్లీ ఉప్పొంగుతుంది. మంత్రసాని పాత్రకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలి.

8 ఏప్రిల్ 2017

వందేళ్ల ఓయూ..

# ఉద్యమాల ఉస్మానియా-అమరుల త్యాగాల మార్గం


వరవరరావు

1857 భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ముగిసీ ముగియగానే బ్రిటిష్ ఇండియాలో విశ్వవిద్యాలయాలు స్థాపించాలనే ఆలోచన బ్రిటిష్ ప్రభుత్వానికి మెకాలే అనే వలసవాద మేధావి సూచించాడు. ఆ విధంగా కలకత్తా, మద్రాస్, బొంబాయి రెసిడెన్సీలలో 1857లోనే విశ్వవిద్యాలయాలు వచ్చాయి. అంటే ఇంగ్లీష్ చదువులు మొదలయ్యాయి. వాటితోపాటు పాశ్చాత్య దేశాలలోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గురించి, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం వంటి సామాజిక శాస్త్రాల ద్వారా తెలుసుకున్నాం. ఆ చదువుల ద్వారానే మన మీద అమలవుతున్నది సామ్రాజ్యవాద వలస విధానమనే అవగాహన కూడా వచ్చింది. మెకాలే చాలా స్పష్టంగా భారతీయుల మానసికతను వలసీకరించాలని సూచించాడు.

ఈ మానసిక వలసీకరణను వ్యతిరేకించి సామ్రాజ్యవాద వలసవాద వ్యతిరేక పోరాటాలను చేపట్టే మొట్టమొదటి పిలుపు ఒక విద్యార్థి నాయకుడి నుంచే వచ్చింది. అతడే షహీద్ భగత్‌సింగ్. 1907లో జన్మించిన భగత్‌సింగ్ లాహోర్ నేషనల్ కాలేజీలో చదువుతున్న రోజుల్లో తన సహచర విద్యార్థులను కూడగట్టి విప్లవ భావాల ప్రచారానికి పూనుకున్నాడు. 'ఇంక్విలాబ్ జిందాబాద్' దేశంలో కార్మిక, కర్షక రాజ్యం నెలకొల్పాలనే నినాదాలు, కార్యక్రమం ఆయన రూపొందించినవే. 1931లో ఆయన, ఆయనతో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు ఉరికంబం ఎక్కే నాటికి ఒక ఆరు సంవత్సరాల ముందే 1925లో మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం జరిగింది. 1925 నుంచి మొదలుకొని 1936 వరకు దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో వందల సంఖ్యలో అధ్యాపకులు, వేల సంఖ్యలో విద్యార్థులు కమ్యూనిస్టు భావజాలంతో ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు. వాటిన్నిటిలోనూ సామ్రాజ్యవాద, వలసవాద, భూస్వామ్య స్వభావం ఉంది. ఆ కాలమంతా ప్రధానంగా బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక, వలసవాద వ్యతిరేక, స్వాతంత్ర్యేచ్ఛతో కూడిన భావజాలం విశ్వవిద్యాలయాలను ఆవరించి ఉండేది.

1933-36 స్పెయిన్ అంతర్యుద్ధ కాలంలో ఇది ఒక విశ్వజనీన రూపాన్ని తీసుకున్నది. స్పెయిన్‌లోని ఫ్రాంకో నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా బుద్ధిజీవులు, కవులు, కళాకారులు ఇంటర్నేషనల్ బ్రిగేడ్ ఏర్పాటు చేసి సాయుధ పోరాటానికి పూనుకున్నారు. వీరిలో చాలామందికి పాశ్చాత్య విశ్వవిద్యాలయాల ఉన్నత విద్యలున్నాయి. ఇంటర్నేషనల్ బ్రిగేడ్‌లో పాల్గొన్న ముల్క్‌రాజ్ ఆనంద్ స్వయంగా భారతదేశంలో ఒక రచయిత, ఒక విద్యావేత్త.

1936 నుంచి 1945 వరకు ఈ విశ్వవిద్యాలయాలు, కవులు, కళాకారులు, బుద్ధిజీవులు ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో భాగం కావాల్సి వచ్చింది. ఎందుకంటే జర్మనీ, ఇటలీ, జపాన్‌లలో నాజీజం, ఫాసిజం ప్రబలిన కాలం అది. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లలో ఉన్నటువంటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కూడా బతికి బట్టకట్టలేని కాలం. కమ్యూనిస్టు పార్టీ భావజాలం కలిగిన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, విద్యార్థులు, బయట ఉన్న కవులూ,



కళాకారులూ అందరూ ఈ ఫాసిస్టు వ్యతిరేక మహత్తర పోరాటంలో ప్రేంచంద్, సజ్జాద్ జహీర్‌ల నాయకత్వంలో పాల్గొన్నారు. అపూర్వమైన పోరాటాలు, త్యాగాలు చేశారు.

అప్పటికే 1917లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడింది. అధికారంలో ఉన్న ప్రభువు భాష అయినప్పటికీ ప్రాంతీయ ప్రజల భాష అయినటువంటి ఉర్దూ మాధ్యమంలో బోధన జరగడం ఇక్కడ ఒక విశేషం.

1930లలో ఇక్కడ పనిచేసిన ప్రొఫెసర్ల పూనికతో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పడింది. 1939-44 వరకు అది క్రియాశీలమైన కార్యక్రమాలు చేపట్టింది. దీని సంస్థాపకులలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆలం కుంద్‌మీరి, అక్కడి విద్యార్థి ఉద్యమాన్ని నిర్మాణం చేసిన ఎస్.ఎం.జవాద్ రజ్వీ, సిటీ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేసిన మగ్దూం మొహియుద్దీన్ ఉన్నారు. వీరిలో మగ్దూం మొహియుద్దీన్ చదువుకున్నది అలీఘడ్ యూనివర్సిటీలో అయినప్పటికీ ఆయన ఉద్యమ జీవితమంతా ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ నగరం, తెలంగాణ, సాహిత్య, కళా, సాంస్కృతిక, కార్మిక రంగాలతో ముడిపడి ఉన్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయం శతజయంతి జరుపుకుంటున్న సందర్భంలో మొట్టమొదట స్మరించుకోవలసిన మహనీయులు వీళ్లు. వీళ్లతో పాటు డా.రాజ్‌బహదూర్ గౌడ్.


భారతదేశంలో మిగిలిన ప్రాంతాలకు, తెలంగాణకు అట్లాగే మిగిలిన విశ్వవిద్యాలయాలకు, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఉన్న గుణాత్మకమైన తేడా ఎక్కడంటే మిగిలిన ప్రాంతాలన్నీ ఉజ్జ్వలమైన ఫాసిస్టు వ్యతిరేక పోరాటాల దగ్గర 1945లో ఆగిపోతే ఒక్క తెలంగాణ, ఒక్క ఉస్మానియా విశ్వవిద్యాలయం నాయకత్వం వర్గపోరాటం దాకా కూడా కొనసాగింది. ఆ విధంగా వర్గపోరాటంలో ఉస్మానియా బుద్ధిజీవులను ప్రవేశపెట్టిన తొలి వైతాళికుడు మగ్దూం మొహియొద్దీన్. కామ్రేడ్స్ అసోసియేషన్ వంటి ఒక చర్చా వేదిక దగ్గర ఆగకుండా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాట పిలుపు ఇవ్వడంలో ఆయన పాల్గొన్నాడు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో పాల్గొని, ఆ తరువాత కాలంలో ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ ప్రొఫెసర్లుగా కొనసాగిన వాళ్లలో సి.ఎచ్.హన్మంతరావు, కె.యాదవరెడ్డి (ఎకనామిక్స్), కె. యాదగిరి రెడ్డి (సైకాలజీ) ఉన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి గుండెకాయ వంటిది నల్లగొండ జిల్లా. దానితో పాటు ఒక విద్యా కేంద్రంగా ఆ పోరాట రాజకీయాలతో మమేకమైంది వరంగల్ జిల్లా. ఆంధ్ర మహాసభ కాలం నుంచి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలం దాకా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువు చెప్పిన వాళ్లు, చదువుకున్న వాళ్లు ఈ రెండు జిల్లాల నుంచి వచ్చిన వాళ్లు ఎందరో ఉన్నారు. కరీంనగర్ జిల్లాలో అనభేరి ప్రభాకరరావు ప్రభావంలో నిర్మాణం అయిన కమ్యూనిస్టు పార్టీలో గట్టుపల్లి మురళితో పాటు చెన్నమనేని రాజేశ్వరరావు, చెన్నమనేని హన్మంతరావు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట విరమణ తరువాత మగ్దూం అవిభక్త కమ్యూనిస్టు పార్టీలోకి, ఆ తరువాత సిపిఐలోకి వెళ్లి 1965లో మరణించాడు. ఆ తరువాత రెండు సంవత్సరాలకే మళ్లీ నక్సల్బరీ పంథాలో శ్రీకాకుళ రైతాంగ పోరాటం తెలుగు నేల మీద విశ్వవిద్యాలయాలను ప్రభావితం చేసింది. కలకత్తా, జాదవ్‌పూర్, పంజాబ్ యూనివర్సిటీల లాగా మళ్లీ అటువంటి విప్లవోద్యమ ప్రభావంలోకి వచ్చినవి ఉస్మానియా, ఆంధ్రా, ఎస్.వి. యూనివర్సిటీలు.

1976 దాకా తెలంగాణ ప్రాంతానికంతా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒక్కటే ఉన్నత విద్యా సంస్థ. హైదరాబాద్ ఓయు క్యాంపస్‌లోని కాలేజీలే కాకుండా కోఠిలోని మహిళా కళాశాల, సైఫాబాద్ సైన్స్ కళాశాల, సికింద్రాబాద్ కళాశాల, వరంగల్ ఆర్ట్స్&సైన్స్ కాలేజి దాని అనుబంధ (కాన్‌స్టిట్యూయంట్) కళాశాలలు. తెలంగాణలోని అఫిలియేటెడ్ కాలేజీలు అన్నీ కూడా ఉస్మానియా



కా॥ సంతోష్ రెడ్డి కా॥ పటేల్ సుధాకర్ రెడ్డి కా॥ రంగవల్లి

విశ్వవిద్యాలయం పరిధిలోకే వచ్చేవి. 1976లో కాకతీయ యూనివర్సిటీ ఏర్పడింది. ఆర్ట్స్&సైన్స్ కాలేజీలే కాకుండా జెఎన్‌టియు ఏర్పడేదాకా ఓయు క్యాంపస్ బయట ఉన్న ఇంజినీరింగ్ కాలేజీలు, వైద్య, ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పడేదాకా వైద్య కళాశాలలు కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోనే ఉండేవి. కనుక 1972 కంటే ముందు తెలంగాణ ప్రాంతంలో జరిగిన విద్యార్థి ఉద్యమాలన్నిటికీ కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయమే కేంద్రం. అవి ఏర్పడినాక కూడా ముఖ్యంగా ప్రత్యేక తెలంగాణ తొలి, మలి ఉద్యమాలకైతే గుండెకాయ వంటిది ఉస్మానియా విశ్వవిద్యాలయం.

అటు శ్రీకాకుళ రైతాంగ పోరాటం, ఇటు గోదావరి రైతాంగ పోరాటంతో జమిలిగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 1968లో ప్రారంభమైంది. ప్రచలితంగా పిలుచుకునే నక్సలైట్ ఉద్యమంలోనూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ అమరులైన ఎందరిలోనో ఉస్మానియా విద్యార్థులున్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో శ్రీకాకుళ రైతాంగ పోరాటంలో వలెనే 370 మంది అమరులయ్యారు. అందులో అత్యధిక సంఖ్యాకులు విద్యార్థులు. ఆ విద్యార్థులలో కళాశాల విద్యార్థులందరూ ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోకి వచ్చే వాళ్లే. ఈ కాలమే క్యాంపస్‌లలోకి నక్సల్బరీ రాజకీయాలు, ఫ్రెంచ్ విప్లవ విద్యార్థి ఉద్యమ రాజకీయాలు, చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ ప్రభావం విస్తృతంగా ప్రవేశించాయి.

ఈ నేపథ్యం నుంచి వచ్చిన వాడే అమరుడు జార్జిరెడ్డి. 1972 నాటికే వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజ్ జెఎన్‌టియు పరిధిలోకి వెళ్లినప్పటికీ వరంగల్ కేంద్రంగా సూరపనేని జనార్ధన్ సూటిగాను, ఉస్మానియా కేంద్రం జార్జిరెడ్డి ఎన్ఎస్‌యుఐ నిర్మాణంలోను, సారాంశంలో నిర్మాణం చేసింది మాత్రం విప్లవ రాజకీయాలనే. అందుకే ఇటు ఉస్మానియా విశ్వవిద్యాలయం, అటు రీజినల్ ఇంజినీరింగ్ కాలేజ్ విప్లవ విద్యార్థి శక్తులకు, ఎబివిపి, ఆర్ఎస్ఎస్ వంటి సంఘ పరివార్ వంటి శక్తులకు మధ్యన యుద్ధ క్షేత్రాలైనవి. పాలక పార్టీలన్నీ క్యాంపస్‌లలో ఒక మిలిటెంట్ సంస్థగా ఎబివిపిని ఆశ్రయించినవి. పీడిత పక్షాలన్నీ విప్లవ విద్యార్థి ఉద్యమాల వెనుక నిలిచినవి. అందుకే ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి రోజును ఎంచుకొని 1972లో ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజ్ ప్రవేశ ద్వారం దగ్గర మెట్ల మీద ఆర్ఎస్ఎస్, ఎబివిపి గుండాలు జార్జిరెడ్డిని కత్తులతో పొడిచి చంపారు. ఆ విధంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం విప్లవ విద్యార్థి ఉద్యమానికి తొలి అమరుడు జార్జిరెడ్డి అయ్యాడు. ఆ తరువాత కాలపు విప్లవ విద్యార్థి నిర్మాణాలన్నిటికీ ఆయన వేగుచుక్క అయ్యాడు.

జార్జిరెడ్డి ఎమ్మెస్సీ ఫిజిక్స్ గోల్డ్ మెడలిస్ట్. నిరంతర అధ్యయనశీలి. చదువుకే పరిమితం కాకుండా మార్క్సిజం ఒక ఆచరణ శాస్త్రం గనుక మిలిటెంట్ పోరాటాలు చేయాలని ఎంచుకున్నవాడు. మార్క్సిజంతో పాటు చేగువేరా వ్యక్తిత్వంతో, రచనలతో ప్రభావితుడై ఆయన మోటర్ సైకిల్ యాత్ర లాగా తాను సైకిల్‌పై తెలంగాణ అంతా తిరగాలనుకున్నాడు. కాజీపేట ఫాతిమా నగర్‌లో ఉండే కొండపల్లి సీతారామయ్యను, కెజి సత్యమూర్తిని కలవడానికి ఆయన వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కాలేజి జనార్ధన్ దగ్గరకి సైకిల్ మీద వెళ్లాడని ఆయన సమకాలీనుడు తుషార్ కాంత్ భట్టాచార్య ఇటీవలనే అరుణతారలో రాసాడు.

నక్సల్బరీ రాజకీయాలతో శాసనసభకు రాజీనామా చేసిన తరిమెల నాగిరెడ్డితో పాటు ఆయన రాజకీయ పంథా సిద్ధాంతకర్త దేవులపల్లి వెంకటేశ్వరరావు విద్యార్థి, బుద్ధిజీవుల ఉద్యమ నిర్మాణం చేసే తొలి ప్రయత్నం చేశాడు. ముఖ్యంగా అప్పటికే డి.వి. హైదరాబాద్‌లో ఉంటుండడం వల్ల నవోదయ వంటి సంస్థలు, జీవనాడి వంటి పత్రికలు, డెమోక్రటిక్ స్టూడెంట్స్ (డి.ఎస్.) వంటి విద్యార్థి సంస్థలను నిర్మాణం చేయడం ప్రారంభించాడు. డి.ఎస్.కు వ్యవసాయ విద్యాలయం కేంద్రంగా ఉన్నప్పటికీ ఓయులోను, మిగతా కళాశాలలోను దాని ప్రభావం ఉండేది. అందులో నుంచే పీడీఎస్‌యు వచ్చి జంటనగరాల శాఖ ఏర్పడింది.

స్పష్టంగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, సాయుధ పోరాట పంథాను బలపరచాలనే అవగాహన కలిగినటువంటి విద్యార్థులు 1974 అక్టోబర్‌లో రాడికల్ విద్యార్థి సంఘాన్ని (ఆర్ఎస్‌యు)ను ఏర్పాటు చేసుకున్నారు. అన్ని రాజకీయ ధోరణులకు ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర స్థాయి విద్యార్థి సంస్థలు ఏర్పడడం అనేది 1974 ముగిసే కాలానికి పూర్తి అయింది.

1975 మార్చ్‌లో ఆర్ఎస్‌యు ప్రథమ మహాసభ జరుపుకున్నది. మూడు నెలల్లో దేశంలో ఎమర్జెన్సీ వచ్చింది. ఆర్ఎస్‌యు నిర్మాణంలో సూరపనేని జనార్ధన్, మల్లోజుల కోటేశ్వర్ వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి ఎక్కువ పూనిక వహించారు. హైదరాబాద్ నగరంలో ఆర్ఎస్‌యు నిర్మాణం చేసిన ముఖ్యుల్లో నరేశ్(సత్యం), వెంకట్‌రమణి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన వాళ్లు. శ్రీనివాస్, బాబూరావు ఉస్మానియా వైద్య కళాశాలకు చెందిన వాళ్లు. అధ్యక్ష, కార్యదర్శులు అయిన రమణి, జగన్ మోహన్‌రెడ్డిలలో.. జగన్ మోహన్‌రెడ్డి కాకతీయ వైద్య కళాశాలకు చెందిన వాడు.

ఎమర్జెన్సీ కాలంలో ఆర్ఎస్‌యు నాయకత్వంలో చాలా మంది అజ్ఞాత జీవితంలోకి వెళ్లిపోయారు. అట్లాగే పీడీఎస్‌యు నాయకత్వంలో కూడా జంపాల ప్రసాద్, శ్రీహరి వంటి వాళ్లు అజ్ఞాత జీవితానికి వెళ్లిపోయారు. అప్పటి వరకు క్యాంపస్‌లో

పీడీఎస్‌యు నాయకత్వంలో విప్లవ రాజకీయ నిర్మాణం చేసిన వాళ్లలో ప్రముఖులు జంపాల ప్రసాద్, మధుసూదన్‌రాజ్ యాదవ్.

కరీంనగర్ జిల్లాలో నిర్మాణం అవుతున్న సిరిసిల్ల పోరాటంలో ముఖ్యపాత్ర వహించిన చాంద్‌పాషాను ఏబీవీపీ గుండాలు చంపేశారు. ఆర్ఎస్‌యు నిర్మాణంలో కీలకపాత్ర నిర్వహించిన సూరపనేని జనార్దన్, మురళీమోహన్, ఆనంద్‌రావు ముగ్గురు విద్యార్థులు, సుధాకర్ అనే మరో దళ సభ్యుడితో పాటు 1975 జూలై 25న గిరాయిపల్లిలో ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. అప్పటి నుంచి 1980లో పీపుల్స్‌వార్ ఏర్పడి జూలై 28 చారు మజుందార్ వర్ధంతిని అమరుల అందరి స్మృతి దినంగా నిర్వహించుకునే దాకా రాష్ట్ర వ్యాప్తంగా జులై 25ను విద్యార్థి అమరుల సంస్మరణ దినంగా జరుపుకునేవాళ్లు. అంతటి ప్రభావం గిరాయిపల్లి అమరులది.

అట్లాగే ప్రతి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వలెనే 1972 నుంచి జార్జిరెడ్డి అమరత్వ దినం కూడా విద్యార్థులు నిర్వహించుకుంటున్నారు.

1975 నవంబర్ 5ను గుంటూరులో నీలం రామచంద్రయ్యతోపాటు అరెస్టై జంపాల ప్రసాద్, ఆయనతో పాటు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు.

తరిమెల నాగిరెడ్డి నాయకత్వం నుంచి విడిపోయి చంద్రపుల్లారెడ్డి సీపీఐ(ఎంఎల్) నిర్మాణం చేసిన తరువాత హైదరాబాద్‌లో ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులను, విద్యార్థులను విప్లవ రాజకీయాల వైపు తీసుకొచ్చే కృషి ఈ నీలం రామచంద్రయ్యదే. ఆ పార్టీకి సంబంధించిన అన్ని అనుబంధ ప్రజా సంఘాల మీద కూడా నీలం రామచంద్రయ్య, వై.కాశీపతిల ప్రభావం చాలా ప్రగాఢమైనది. కాశీపతి స్వయంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ జర్నలిజం విద్యార్థిగా గోల్డ్ మెడల్ కూడా తీసుకున్నాడు.

1976 నవంబర్ నెలలోనే చంచల్‌గూడలో సీపీఐ (ఎంఎల్) కార్యదర్శి పి. రామనర్సయ్యతో పాటు అరెస్టయిన శ్రీహరి పీడీఎస్‌యు విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో జంపాల ప్రసాద్ తరువాత పేర్కొనదగిన నాయకత్వం. రామనర్సయ్య, శ్రీహరిలను వరంగల్ జిల్లా పాకాల చెరువు వెనుక బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు.

ఈ విధంగా ఎమర్జెన్సీ కాలంలో తార్కుండే కమిటీ నిజనిర్ధారణ చేసి జస్టిస్ భార్గవ కమిషన్‌ను హత్యా నేరాలుగా ఒప్పించగలిగిన నాలుగింటిలోని మూడు సంఘటనలలో కూడా విద్యార్థి నాయకులు ఉన్నారు. రెండింటిలోనైతే ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి నాయకులు ఉన్నారు.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన దగ్గర నుంచి ముఖ్యంగా 1978 ఫిబ్రవరిలో వరంగల్‌లో జరిగిన ఆర్ఎస్‌యు రెండవ మహాసభల్లో 'గ్రామాలకు తరలండి' పిలుపునిచ్చిన దగ్గర నుంచి చరిత్రంతా రాడికల్ విద్యార్థులది. ఎందుకంటే గ్రామాల్లోకి వెళ్లి భూసంబంధాల అధ్యయనం, రైతుకూలీ సంఘాల నిర్మాణం, భూస్వాధీన పోరాటం చేయడం మొదలు రాజ్యాధికారం లక్ష్యంగా పోరాడాల్సి ఉంటుందనే స్పష్టమైన పిలుపునిచ్చింది. ఎమర్జెన్సీలో చేసిన భూసంబంధాల అధ్యయనం, ఈ పిలుపు ఫలితమే జగిత్యాల జైత్రయాత్ర. జగిత్యాల, సిరిసిల్ల రైతాంగ పోరాటాలకు విద్యార్థులు చేసిన సృజనాత్మక విప్లవ దోహదమిది.


అప్పటికే ఉస్మానియా న్యాయ కళాశాలలో చదివిన మల్లోజుల కోటేశ్వర్ కరీంనగర్ విప్లవోద్యమంలోకి వెళ్లాడు. రాంచందర్ నిజామాబాద్ విప్లవోద్యమంలోకి వెళ్లిపోయాడు. గద్వాలకు చెందిన సుదర్శన్, సుధాకర్‌లు పాలమూరు విప్లవోద్యమ నిర్మాణంలోకి వెళ్లిపోయారు. పటేల్ సుధాకర్‌రెడ్డి ఆ తరువాత బెంగళూరులో అరెస్టయ్యాడు.

1980ల నాటికే క్యాంపస్‌లో విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణం చేసి విస్తరింపచేసిన వాళ్లలో ముఖ్యంగా పేర్కొనదగిన పేర్లు ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, రంగవల్లి. రాడికల్ విద్యార్థి సంఘం నిర్మాణంలో మాత్రమే కాకుండా హైదరాబాద్‌లోని ప్రజాసంఘాల నిర్మాణంలోనూ, సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాల నిర్మాణంలోనూ కీలక పాత్ర నిర్వహించినవాడు ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి. ఆయన ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడుగా కూడా పనిచేశాడు.

ఎమర్జెన్సీ కన్న ముందే నిర్మాణమైన ప్రగతిశీల మహిళా సంఘం నాయకత్వమంతా క్యాంపస్ నుంచే వచ్చింది. లలిత, రుక్మిణీ మీనన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పీఓడబ్ల్యు నిర్మాణం అయింది. రుక్మిణీ మీనన్ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా కూడా పనిచేసింది.

ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి ముందు అటమిక్ ఎనర్జీలో బీఎస్సీ ఆనర్స్ చేసి, అది పరీక్ష రాస్తే ముంబాయి బాబా అటమిక్ రిసెర్చ్ సెంటర్(బార్క్)లో ఉద్యోగం వస్తుంది గనుక వదిలేసి విప్లవ విద్యార్థి ఉద్యమం నిర్మాణం చేయడం కోసమే ఎం.ఎ. ఫిలాసఫీలో చేరాడు. ఆయన అక్కడ నుంచి విప్లవోద్యమ నిర్మాణంలో హైదరాబాద్ నగరం నుంచి పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ దాకా చేసిన ప్రయాణం ఇప్పుడు అందరికీ తెలుసు. దేశంలోనే పేర్కొనదగిన అరుదైన విప్లవ మేధావులలో మహేశ్‌గా అందరికి తెలిసిన ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి కడివెండి దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వానికి చెందిన వాడు.

అట్లాగే విప్లవ మహిళా విద్యార్థి ఉద్యమం నుంచి అజ్ఞాత జీవితంలోకి వెళ్లి సాయుధ విప్లవోద్యమంలో భాగంగా రంగవల్లి ములుగు అడవుల్లో అమరురాలైంది.



కా॥ మల్లోజుల కోటేశ్వర రావు (కిషన్ జీ)　కామ్రేడ్ మారోజు వీరన్న　టి.ఎస్.ఎఫ్. ప్రసాద్

నల్గొండ సాయం కళాశాలలో బి.ఎ. చేస్తూ ఉదయం పత్రికలు అమ్ముకునే ఆర్ఎస్‌యు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేషయ్యను నల్గొండలో ఏబీవీపీ గుండాలు పట్టపగలు చంపేశారు. నల్గొండ జిల్లాలో ఆర్ఎస్‌యు నిర్మాణంలో విశేషమైన కృషి చేసిన ఈ శేషయ్యకు ఎన్.కె. తన 'లాల్‌బనో' రెండవ ముద్రణను అంకితం చేశాడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆర్ఎస్‌యు విద్యార్థి ఉద్యమ నిర్మాణానికి, వరంగల్ జిల్లాలో విప్లవోద్యమ నిర్మాణానికి జీవనాడి అయిన పులి అంజయ్య(సాగర్) పూనికతో 1983లో 'లాల్‌బనో' ఆర్ఎస్‌యు ప్రచురణగా వెలువడింది.

ఎర్రంరెడ్డి సంతోష్ తరువాత క్యాంపస్‌లో ఐదారేళ్ల పాటు విప్లవ విద్యార్థి ఉద్యమం నిర్మాణం చేసిన వాళ్లు మేకల దామోదర్‌రెడ్డి, రామేశ్వర్, విజయ్‌కుమార్‌లు.

విజయ్‌కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి. ఉస్మానియా క్యాంపస్‌లోనూ, సిటీ కాలేజ్‌లోనూ ఏబీవీపీ మీద మిలిటెంట్ దాడులు చేసినవాడు. ఆర్ఎస్‌యు సిటీ ప్రెసిడెంట్‌గా పనిచేశాడు. 1986లో అరెస్టయి విడుదలయ్యాక తూర్పు గోదావరి జిల్లా అడవుల్లోకి వెళ్లి అజ్ఞాత జీవితంలో ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు.

దామోదర్‌రెడ్డి, రామేశ్వర్‌లు విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణమే కాకుండా నగరంలో పీపుల్స్‌వార్ నిర్మాణం కూడా పటిష్ఠంగా చేసినవాళ్లు. రామేశ్వర్ సురేశ్ అనే పేరుతో సిటీ కార్యదర్శిగా, దామోదర్ సంజీవ్ పేరుతో దక్షిణ తెలంగాణ కార్యదర్శిగా బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు.

1985కే ఎన్‌టీఆర్ ఆట, పాట, మాట బంద్ కాలానికే ఆర్ఎస్‌యు అప్రకటిత నిషేధానికి గురయ్యింది. అయినప్పటికీ 1992 దాకా కూడా దామోదర్ నాయకత్వంలో రూపొందిన ఆర్ఎస్‌యు విద్యార్థులు క్యాంపస్‌లో విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణం చేస్తూనే ఉన్నారు. నిజాం కాలేజ్‌లో చంద్రశేఖర్, ఇంజనీరింగ్ కాలేజీలో ఎంఎస్ఆర్, మొత్తంగా మహేందర్‌గా అందరికి తెలిసిన రమణారెడ్డి ఇట్లా ఎందరో ఆ కృషి చేస్తూనే పోయారు. క్యాంపస్‌ల మీదనే కేంద్రీకరించిన వాళ్లు అందరికీ మంజీర పేరుతో తెలిసిన రవి, ఉస్మానియా సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులను సంఘటితపరచిన వీరన్నగా తెలిసిన వీరారెడ్డి.

ఈ వీరన్న సీపీఐ (ఎంఎల్) జనశక్తి పార్టీ నుంచి వేరై తరువాత కాలంలో తానే పార్టీ రూపొందించిన సుప్రసిద్ధుడైన మారోజు వీరన్నతో కలిసి మండల్ కమిషన్ నేపథ్యంలో క్యాంపస్‌లో అపూర్వమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మాణం చేశాడు.

1986లో ఎన్‌టీ రామారావు బీసీలకు 40 శాతం రిజర్వేషన్ ప్రకటించినప్పుడు నిర్ద్వంద్వంగా దాన్ని బలపరిచింది రాడికల్ విద్యార్థి సంఘం. అప్పట్నుంచి దామోదర్, రామేశ్వర్, వీరన్నల నాయకత్వంలో విద్యార్థి ఐక్య సంఘటనలు నిర్మాణం చేస్తూ మండల్ కమిషన్ రిపోర్టు వచ్చి రిజర్వేషన్ వ్యతిరేక ప్రతీఘాతుక ఉద్యమం మొదలైనప్పుడు దాన్ని ఎదుర్కొన్న విశాల ఐక్య సంఘటన నిర్మాణం చేసినవాళ్లు ఆర్ఎస్‌యుకు చెందిన వీరన్న, పిడిఎస్‌యుకు చెందిన వీరన్న.

ఈ ఇద్దరి నాయకత్వంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మాత్రమే కాకుండా నగరమంతా దళిత, బడుగువర్గాల విద్యార్థి సంఘాలు రిజర్వేషన్‌లకు అనుకూలంగా చేసిన పోరాటం ఎంతో ప్రభావం వేసింది. దీని ఫలితంగానే 1992లో ముఖ్యమంత్రిగా వచ్చిన నేదురుమల్లి జనార్ధనరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలను ప్రైవేట్ చేయడానికి ప్రయత్నించినప్పుడు హైకోర్టు అది కొట్టివేసి చేసిన వ్యాఖ్యానాల ఫలితంగా ఆయన రాజీనామా ఇవ్వాల్సి వచ్చింది. తామరతంపరగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు వస్తున్న నేపథ్యంలో ఈ పోరాటం ఎంత విలువైందో మనం ఊహించుకోవచ్చు.

ఇద్దరు వీరన్నలు కూడా 1990ల ప్రథమార్థంలోనే బూటకపు ఎన్‌కౌంటర్‌లలో అమరులయ్యారు.

1990లలో ఏబీవీపీ దాడులకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడి చంద్రారెడ్డి వంటి ఏబీవీపీ రౌడీ

నాయకులపై చర్య తీసుకున్న వెంకటయ్య ఉస్మానియా క్యాంపస్ విద్యార్థి నాయకుడే. నర్సాపూర్ తిగుళ్లలో మెదక్ జిల్లాలో వరుసగా జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆయన అమరుడయ్యాడు.

ఈ విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో అమరుడైన క్యాంపస్ విద్యార్థి నాగప్రసాద్. ఇతను ఎంఎస్‌సి మాథమెటిక్స్ విద్యార్థిగా క్యాంపస్‌లో తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ నిర్మాణం చేస్తూ విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వెళ్లి పనిచేస్తున్న క్రమంలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు.

ఆర్ఎస్‌యు నిర్మాణంగా చూసినప్పుడు ఉస్మానియా క్యాంపస్ అనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాల విద్యార్థులు కూడా ఒక భావధారకు, ఒక నిర్మాణానికి చెందిన వాళ్లు. ఆ విధంగా వీళ్లందరికీ ఆదర్శంగా మొదట జనార్దన్, మురళీమోహన్, ఆనంద్‌రావులను ఎట్లా పేర్కొనవచ్చునో, అట్లా పేర్కొనదగిన నాయకత్వంలో ఆర్ఎస్‌యు రెండవ మహాసభలోను, మూడవ మహాసభ (గుంటూరు)లోను అధ్యక్షుడుగా ఎన్నికైన చెరుకూరి రాజ్‌కుమార్ పరిధి రీత్యా జేఎన్‌టీయు, ఆంధ్రా విశ్వవిద్యాలయాలకు చెందిన వాడైనప్పటికీ విద్యార్థి ఉద్యమం మొదలు విప్లవోద్యమం వరకు మేధో రంగం మీద కూడా చెరగని ముద్రవేసినవాడు. అట్లాగే ఆర్ఎస్‌యు ఉపాధ్యక్షుడుగా, సీకేఎం కాలేజ్ విద్యార్థి సంఘం కార్యదర్శిగా కూడా పనిచేసిన నాగేశ్వరరావు రాష్ట్రవ్యాప్త ఆర్ఎస్‌యు నిర్మాణంలో భాగంగానే రామకృష్ణతో పాటు హనుమకొండ హంటర్ రోడ్డులో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు.

ఆర్ఎస్‌యు నిషేధం (1992) తరువాత పేర్కొన్నదగిన వాళ్లు ఎర్రోళ్ల వీరస్వామి, భుజంగరెడ్డి. ఎర్రోళ్ల వీరస్వామి నాగార్జున సాగర్ రెసిడెన్షియల్ కాలేజీలో డిగ్రీ చేసి, సెంట్రల్ యనివర్సిటీలో ఎం.ఎ., ఎం.ఫిల్. పీహెచ్‌డీ చేస్తూ రాష్ట్ర ఆర్ఎస్‌యు అధ్యక్షుడుగా మంత్రాలయం దగ్గర జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. ఉస్మానియా నుంచే అనంతపురంలో ఎస్‌కే యూనివర్సిటీలో ఆర్ఎస్‌యు నిర్మాణానికి వెళ్లిన భుజంగరెడ్డి కూడా వీరాస్వామితో పాటు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు.

1997లో వరంగల్‌లో ఏఐఆర్‌పీఎఫ్ నిర్వహించిన ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ సదస్సుతో మలి తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అంతకు ముందే బోనగిరి, వీవీ ఫంక్షన్ హాల్, సూర్యాపేటలలో ప్రత్యేక తెలంగాణ కోసం, జన తెలంగాణ కోసం సదస్సులు జరిగినప్పటికీ వరంగల్ డిక్లరేషన్ నేపథ్యంలో ఒక నిర్మాణ రూపం వచ్చింది అక్కడి నుంచే. ఆ నిర్మాణ రూపానికి ఏ పేరు ఉన్నా ఆఖరిశ్వాస వరకు దానికి నాయకత్వం వహించింది ఆకుల భూమయ్య. ఇతను ఒక టీచర్. కరీంనగర్ కాలేజీ నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి.

చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనా పరిపాలనకు ప్రతిఘటనగా, ప్రత్యామ్నాయంగా ఒక స్వావలంబన పోరాటంగా ప్రారంభమైన ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమానికి ఒక నేపథ్యాన్ని కల్పించింది విప్లవోద్యమం. ఆ ఆలోచన చేసిన నాయకత్వంలో శ్యాం, మహేశ్, మురళి, ఆర్‌కెలు ఉన్నారు. ఆర్‌కె లాల్‌బహదూర్ కళాశాల విద్యార్థి.

దేశంలో ప్రజాస్వామిక ప్రత్యామ్నాయ ఆలోచనల్లోనూ మహేశ్ ఉన్నాడు. అది ఉత్తర తెలంగాణలో కావచ్చు, ఇవాళ దండకారణ్యంలో కావచ్చు. ఇవాళ అమలవుతున్న గ్రామ రాజ్యాలు మొదలు జనతన సర్కార్ వరకు రూపకల్పన చేసిన ముగ్గురూ విద్యారంగం నుంచి వచ్చినవాళ్లే. నల్లా ఆదిరెడ్డి, సాహుతో పాటు జమ్మికుంట కాలేజీ విద్యార్థిగా ఉస్మానియా విద్యార్థి కిందనే లెక్క. అట్లాగే శీలం నరేశ్ విద్యారంగానికి మార్గదర్శకత్వం వహించిన వాడు. ఆయనది జగిత్యాల. మహేశ్ గురించి చెప్పనక్కరలేదు.

మలి తెలంగాణ ఉద్యమంలో 1996-2014 మధ్యన 1400 మంది విద్యార్థులైనా ఆత్మహత్యలు చేసుకుని ఉంటారు. క్యాంపస్‌లో తనకు తాను ఒక జ్వాలగా వెలిగించుకొని దాడి చేయడానికి వస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ముందు ఒక పరుగెత్తుతున్న మంటగా ఆత్మాహుతి చేసుకున్న యాదయ్య, ఢిల్లీ నుంచి వస్తున్న ఏపీ ఎక్స్‌ప్రెస్‌కు ఎదురు వెళ్లి ప్రాణత్యాగం చేసుకున్న విద్యార్థి పాలస్తీనా ఆత్మాహుతి దాడి వంటి పోరాట రూపం ఎంచుకున్న వాళ్లుగా చెప్పదగిన వాళ్లు.

2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు పది రోజులు ఉస్మానియా క్యాంపస్‌లో విద్యార్థులు ప్రత్యేక తెలంగాణ కోసం చేసిన పోరాటం దానికదే ఒక చరిత్ర. ఎన్నో సందర్భాలలో దీన్ని రష్యా బోల్షివిక్ విప్లవంలో ప్రపంచాన్ని ఊపేసిన పదిరోజులతో పోల్చి ఉన్నాను.

కామ్రేడ్స్ అసోసియేషన్‌తో ప్రారంభమై ప్రత్యామ్నాయ రాజకీయాల నూతన ప్రజాస్వామిక స్వప్నం ఆచరణగా రుజువవుతున్న వర్తమానంలో ఎందరో జ్ఞాత, అజ్ఞాత ఉస్మానియా విద్యార్థుల పోరాట భూమిక ఉన్నది. అసంఖ్యాక విద్యార్థులు నిర్వహించిన ఆ పోరాటాలలో నాకు తెలిసిన, నాకు తెలియని ఇంకెందరో విద్యార్థుల ప్రాణత్యాగాల ఫలితాలు ఉన్నాయి.

నూరేళ్ల ఉస్మానియా నూరు పూలు పూసి, నూరు ఆలోచనలు ఘర్షణ పడే ఒక నిజమైన విశ్వవిద్యాలయంగా రూపొందే ఆకాంక్షతోనే ఈ విద్యార్థి అమరులందరూ తమ ప్రాణత్యాగాలు చేశారు. త్యాగాలు ఎప్పుడూ వృథా కావు.

22 మార్చ్, 2017

వందేళ్ల ఓయూ..

# భావోద్వేగాల కూడలి - ఉస్మానియా యూనివర్సిటీ

నందిని సిధారెడ్డి

తెలంగాణ సమాజం జాగృతమవుతున్న సందర్భంలో నెలకొల్పిన యూనివర్సిటీ గనుక కాలం తన మీద మోపిన బాధ్యతను నిరంతరం నిర్వర్తిస్తూ వచ్చింది ఉస్మానియా విశ్వవిద్యాలయం. క్రమక్రమంగా ఉధృతమవుతున్న గ్రంథాలయ స్థాపనలు, చైతన్యాన్ని పంచే విద్యాభావనలు వికసిస్తున్న నేపథ్యంలో వెలసినందువల్ల తెలంగాణ చరిత్ర మలుపుల్లో క్రియాశీలక పాత్ర పోషించి తన ప్రత్యేకతను చాటుకుంటున్నదీ విద్యాలయం. సాధారణంగా చాలా విశ్వవిద్యాలయాలు విద్యా బోధనల వరకే పరిమితమవుతుంటాయి. కొన్ని ప్రత్యేక విశ్వవిద్యాలయాలు మాత్రమే జ్ఞాన విస్తరణతో పాటు జాతి సామాజిక రాజకీయ చరిత్రలకు అధ్యాయాలుగా నిలుస్తయి. తెలంగాణ విమోచనోద్యమంలో, భారత స్వాతంత్రోద్యమంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల్లో, జాతీయవాద చైతన్యంలో, విప్లవ ఉద్యమ విస్తృతిలో, అస్తిత్వ ఉద్యమాల ఆరాటాల్లో, హక్కుల ఉద్యమాల్లో, వర్గీకరణ వంటి న్యాయ పోరాటాల్లో సైతం కీలకమైన బాధ్యతాయుత భాగస్వామ్యంతో విరాజిల్లిన విశిష్టత ఉస్మానియా విశ్వవిద్యాలయానిది. ప్రజా చైతన్యంతో పెనవేసుకపోయిన సజీవ సాహిత్య సృష్టిలో, జన కళావికాసంలో ఈ విశ్వవిద్యాలయానిది వినూత్న ఒరవడి.

నేను క్యాంపస్‌లో 1976లో ప్రవేశించిన. సాహిత్యం మీద తీవ్రమైన ఉద్వేగంతో ఎమ్మే తెలుగులో చేరిన. అప్పటికే సుమారు ఆరు దశాబ్దాల చరిత్ర, అనుభవం, చైతన్యంతో పండి ఉన్నది. తరచుగా జార్జిరెడ్డి పేరు వినబడుతుండేది. ఎమర్జెన్సీ చీకటి నిర్బంధం, వీసీ జగన్మోహన్‌రెడ్డి కఠిన పాలన క్యాంపస్ నిండా కనబడుతుండేది. అయినా జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో రాజకీయ ప్రజాతంత్ర చైతన్యాలు బాహాటంగానే గోచరించేవి. 'జీవనాడి' పత్రిక క్యాంపస్ విద్యార్థుల గుండెల సవ్వడి బలంగా వినిపించి ఉన్నది. మెడికల్ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రజాస్వామిక భావనలను ఫ్యాషన్‌గా చెప్పేటంతగా ఆకర్షణ ఉన్న సమయం. కవిత్వ పంక్తులు ప్రసంగాల్లో వ్యక్తమవుతూ బ్యానర్ల మీద, గోడల మీద రాతలుగా విస్తరించుతున్న చైతన్యకాలం. నీలి నీడల నుంచి వెలుగు వెల్లువలోకి పురోగమిస్తున్న గొప్ప సందర్భంలో క్యాంపస్‌లో జీవించినందుకు గర్వంగా, హుషారుగా ఉంటది.

ఆర్ట్స్ కళాశాల మెట్లెక్కి కారిడార్‌లో ప్రవేశించటమే గొప్ప ఉత్సాహం. తరగతి గదిలో పరిచయమైంది గుడిహాళం రఘునాథం. డిగ్రీలో మాథ్స్ ఫిజిక్స్ చదువుకున్నప్పటికీ నాలాగే సాహిత్యం మీద వల్లమాలిన మమకారంతో తెలుగు సాహిత్యంలో చేరిండు. రామ్మోహనశర్మ మొదట పరిచయమైనా హృదయానికి దగ్గరగా వచ్చింది రఘునాథమే. గల గల మాట్లాడుతూ ముసిముసి నవ్వులతో మృణాళిని మా క్లాసే. మా సీనియర్స్‌లో చిమనగుంట జగదీశ్వర్ అనే ఒక కవి, హనుమయాచారి అనే చిత్రకారుడు, నాగుల రాజేశంగౌడ్ అనే గాయకుడు, శివరామశర్మ పండితుడు సాహిత్యం పట్ల మక్కువ కలిగి ఉండి నాకు దగ్గరయిండ్రు. వీళ్లందరి బలంతో మొదటి సంవత్సరం మొదటినెలలోనే రూం నెం.57లో సి.నారాయణరెడ్డి అతిథిగా కవి సమ్మేళనం ఏర్పాటు చేసిన. చాలా బాగా జరిగింది. బీఈడీ విద్యార్థిగా పాల్గొన్న నలిమెల భాస్కర్ తొలి పరిచయం ఆ సభలోనే. నిర్బంధపు చివరి దశలో ఎలుగెత్తిన కవిత్వ చైతన్యం గమనించి సినారె ప్రశంసించటం విద్యార్థులమైన మాకెంతో స్ఫూర్తి. రఘునాథం తొలుత పద్యాలు రాసేవాడు. వచన కవిత్వ విశేషాలు, అవసరాలు, నైపుణ్యాలు చెప్పి చర్చిస్తుంటే ఇటువైపు వచ్చిండు. ఇద్దరం కలిసి కె.శివారెడ్డి నగ్నముని, గుంటూరు నాగేంద్రశర్మ, అరిపిరాల విశ్వం, కుందుర్తి ఆంజనేయులు, దేవిప్రియ వంటి ప్రసిద్ధ కవుల దగ్గరి వాళ్ల అనుభవాలు, భావాలు తెలుసుకునేవాళ్లం. నగరంలో జరిగే సాహిత్య సభలకు తరచుగా హాజరయ్యేవాళ్లం. కవిత్వం రాయటం, పత్రికలకు పంపటం మాకు నిత్యకృత్యం. పత్రికల్లో ప్రతివారం పేరుండాలని పోటీపడేవాళ్లం.

నేను ఓల్డ్ పీజీ హాస్టల్‌లో రూం.నెం.72లో ఉండేవాడిని. ప్రతి ఆదివారం ఉదయం హాస్టల్‌లో సాహిత్య కార్యక్రమాలు చేసేవాళ్లం. ప్రముఖ రచయితలను వక్తలుగా ఆహ్వానించి చర్చలు నిర్వహించేది. అక్కడ జరిగిన చర్చలు స్పందనలు సాహిత్య సృష్టికి అన్వయించుకొని దిద్దుకునేవాళ్లు. సెమినార్ లైబ్రరీ, యూనివర్సిటీ లైబ్రరీలో సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యటంలో ఎక్కువ కాలం గడిచేది. మా పక్కన 'బీ' హాస్టల్‌లో దేవరాజు మహారాజు జువాలజీలో పరిశోధకుడుగా ఉండేది. ఎదురు రూం కె.బి.గోపాలం. ఇద్దరితో సాహిత్య చర్చలు. మహారాజు అప్పటికే

'గుడిసె-గుండె' తెలంగాణ భాషలో కవితా సంపుటి ప్రచురించి ఉన్నడు. మహోరాజుతో స్నేహం గాఢమై సాహిత్యంలో అవాంఛనీయ ధోరణులను ఎండగట్టాలనుకున్నం. రఘు, నేను మహోరాజు కలిసి అప్పటి సాహిత్య స్థితి అవకతవకలు నిరసిస్తూ "దాడి" కరపత్రిక తెచ్చినవి. కవి కాకుండా కవిగా చెలామణీ 'ఎల్లోరా' మీద, వైరుధ్యాలెన్నో ఉన్నా తానే అసలైన కవినని విర్రవీగే 'శేషేంద్ర' మీద, జీవితానికి దూరమైన వ్యాపార సాహిత్యంతో వెలిగే 'ఆనందరామం' మీద, అకాడమీల మీద పరుషమైన వ్యంగ్య దూషణ ఛలోక్తులతో 'దాడి' వ్యాసాలు సంచలనం కలిగించినయి. కొందరు రచయితలు తడుము కున్నరు. కొందరు రచయితలు సర్దుకున్నరు.

మాకంటే ముందు యూనివర్సిటీలో చదివే విద్యార్థి రచయితలకు సంఘం ఉండేదట. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి రచయితల సంఘం. వాళ్లు కొన్ని సాహిత్య కార్యక్రమాలు చేసేదట. పాలకోడేటి సత్యనారాయణరావు, దేవరాజు మహోరాజు, రఘుశ్రీ తదితరులు. వీళ్లు రాసిన కథలను ఎమెస్కో 'ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి రచయితల కథలు' పేరుతో ప్రచురించారు. ఆ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఇట్లాంటి ప్రయత్నం మరొకసారి చేస్తే బాగుండుననిపించేది. మా తర్వాత ఎమ్మే జూనియర్స్ బ్యాచ్ కూడా మంచి బ్యాచ్. చాలా మంది చాలా మంది రచయితలు చేరింద్రు. నాళేశ్వరం శంకరం, వసంతరావు దేశపాండే, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, మర్రి విజయరావు, ఎస్వీ సత్యనారాయణ తదితరులు. తర్వాత కందుకూరి శ్రీరాములు బ్యాచ్. రోజూ కలుసుకునేది. ఎద్యుకేషన్‌లో జీన, అరుణ్(సమ్మయ్య)లు ఉండేది. సీ హాస్టల్‌లో సలంద్ర, అల్లం నారాయణ ఉండేది. ఎటు వెళ్లినా మా కవి బృందం ముచ్చట్లతో, చర్చలతో నిండుగా, చూడ ఆకర్షణగా ఉండేది. విశాలమైన క్రీడా ప్రాంగణంలో వెన్నెల్లో, కొన్నిసార్లు క్యాంపస్ లోపలి రోడ్ల మీదే చెట్ల క్రీనీడల్లో, సన్నని వెలుతురు దాగుడు మూతల్లో నగ్నముని కొయ్యగుర్రం, శివారెడ్డి 'ఆసుపత్రి గీతం' శివసాగర్ కవిత్వాలు చదువుకునే వాళ్లం. బయటకు ఒకరు చదివితే అందరూ వినేది. మాలో ఎవరైనా రాసిన కవితలు కూడా చదివేవాళ్లు. హాస్టల్‌లో ఉండకపోయినా మాతో ఉండే గుడిహాళం పాటలు, నకులుడు పద్యాలు పెద్ద సందడిగా ఉండేది. క్యాంటీన్‌లో మల్లయ్య, బషీర్ హోటళ్లలో మా చర్చలు ఆసక్తిగా వినేవాళ్లు. మా గుంపు చూసి 'సలంద్ర'(వేడిగాలి రచయిత, విరసం కార్యకర్త) సంఘం పెట్టమని సలహా ఇచ్చిండు. దాని ఫలితమే ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్. నియమావళి, కార్యక్రమాలు పక్కాగా రూపొందించుకున్నాం. సన్నాహక సమావేశాలు హాస్టల్ పై భాగంలో సభలు ఆర్ట్స్ కళాశాలలో చిన్న కారణాలతో నేను మౌనంగా ఉండిపోయినా రైటర్స్ సర్కిల్ కార్యక్రమాలు చురుగ్గా జరిగేవి. ఆర్ట్స్ కాలేజీ ఎంట్రెన్స్‌లో రోజూ 'కవిత' పోస్టర్ పెట్టేవారు. సుంకిరెడ్డి, లక్ష్మారెడ్డి ముఖ్యులు. పెరుగుతున్న ఆదరణ క్యాంపస్ బయట నగరంలో కూడా సాహిత్య సభలు పెట్టే దాకా విస్తరించింది. ఆ మధ్యలోనే విరసం దశాబ్ది ఉత్సవాలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగినయి. ఆ ఊపులోనే రైటర్స్ సర్కిల్ 'ఈ తరం యుద్ధకవిత' ప్రచురించింది. విద్యార్థి విప్లవోత్సాహాలకు పొంగిన కవిత్వ కెరటమది.

క్యాంపస్ బయట ఉన్న అనేకమంది ప్రముఖులతో సాహిత్య సంబంధాలుండేవి. రంగనాథాచార్యులు, చేరా, శివారెడ్డి, చెరబండరాజు, శ్రీకంఠమూర్తి, డి.వెంకట్రామయ్య వంటి ముఖ్యులతో పాటు అసురా, కె.శ్రీనివాస్, కేశవరెడ్డి, స్వయంప్రభ, జయప్రభ యువ ఉత్సాహ సాహిత్యకారుల దాకా సన్నిహిత సంబంధాలుండేటివి. ఎంతో గొప్ప సాహిత్య వాతావరణంతో సజీవంగా ఉండే 'కవి సమయాన్ని' కల్పించి ఇచ్చింది ఉస్మానియా విశ్వవిద్యాలయం.

రాజకీయ వాతావరణం మహత్తరం. మాటల్లో ఇముడ్చలేనంత గొప్ప అనుభవం. చర్చలకు, చైతన్యాలకు, ఉద్యమ హోరుకు క్యాంపసే పెట్టింది పేరు. నూరు భావాలు వికసించిన స్థలం.. వేయి ఆలోచనలు సంఘర్షించిన బలం. ఉస్మానియా యూనివర్సిటీ భారతదేశ భావజాలాలన్నింటిని ప్రపంచ ఉద్యమ స్ఫూర్తి భావోద్వేగాలన్నింటిని పుక్కిట, పిడికిట పట్టిన చైతన్య కేంద్రం. పుస్తకాల నుంచి వచ్చిన జ్ఞానం, ఊర్ల నుంచి వచ్చిన ఉద్వేగం స్పష్టమైన రాజకీయ మలుపు తీసుకునేదిక్కడే. జీవన గమనాలకు దిశా నిర్దేశం చేసి గమ్యాలు స్థిరపర్చేదిక్కడే. పోటీలు, పరీక్షలు, స్వప్నాలు, విజయాలు రూపుదిద్దుకునే కీలక ప్రదేశం ఇదే.

జాతీయవాద, దేశక్తి భావనల ప్రతినిధిగా అఖిల భారత విద్యార్థి పరిషత్తు(ఏబీవీపీ), కాంగ్రెస్ పక్ష విద్యార్థి విభాగం భారత జాతీయ విద్యార్థి సంఘం(ఎన్ఎస్‌యుఐ), వామపక్ష చైతన్యాలను విస్తరింపజేసే విద్యార్థి సంఘాలు, అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్), భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ), విప్లవ పక్ష భావజాల స్ఫూర్తి విస్తరించే ప్రగతిశీల ప్రజాతంత్ర విద్యార్థి సంఘం(పీడీఎస్‌యు), రాడికల్ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యు), రాడికల్ విద్యార్థి సంస్థ(ఆర్ఎస్ఓ) ప్రజాతంత్ర విద్యార్థి సంఘం(డీఎస్ఓ) మొదలైన విద్యార్థి సంఘాలు క్యాంపస్‌లో అప్పట్లో ప్రధానంగా కార్యకలాపాలు నిర్వహించేటివి.

విప్లవ విద్యార్థి సంఘాల గురించి విని ఉన్నప్పటికీ నేను ప్రవేశించేటప్పటికి ఎమర్జెన్సీ వల్ల ఎన్ఎస్‌యుఐ, ఏఐఎస్ఎఫ్,

ఎస్ఎఫ్ఐ మాత్రమే కనిపించేవి. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత అన్ని విద్యార్థి సంఘాలు వినూత్న చైతన్యంతో విస్తరించినయి. ఒకపక్క ఏబీవీపీ, మరోపక్క పీడీఎస్‌యు ప్రధానంగా వెల్లువెత్తినాయి. కొద్ది కాలంలోనే ఆర్ఎస్‌యు కూడా క్యాంపస్‌ను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నది. కొంతమందితోనే ఉన్న డీఎస్ఓ రెగ్యులర్ కార్యక్రమాలు నిర్వహించేది. ఎన్ని కళాశాలలు క్యాంపస్‌లో ఉన్న 'ఆర్ట్స్ కాలేజీ' ప్రత్యేకం. ఉన్న సంఘాలన్నీ అక్కడే సందడి చేసేవి. 1977 విద్యార్థి సంఘం ఎన్నికల్లో పీడీఎస్‌యు ఘనవిజయం సాధించింది. ఒక్క ప్రధాన కార్యదర్శి పదవికి ఏఐఎస్ఎఫ్‌కు అవకాశం దక్కింది. అరుణోదయ రామారావు, అంబిక పాటలు, కాశీపతి ఉపన్యాసం అప్పట్లో పెద్ద ఆకర్షణ. ఇంజనీరింగ్ కాలేజీ భావోద్వేగాలకు కూడలిగా ఉండేది. 'కాలేజీ డే'లు, 'హాస్టల్ డే'లు విద్యార్థి రాజకీయాల ప్రకటనలు సాగేటివి. అతిథులను వక్తలుగా పిలిచే దగ్గర నుంచి సంఘర్షణలు ప్రారంభమయ్యేవి. అత్యుత్సాహంగా, ఉద్రిక్తంగా జరిగిన సందర్భాలెన్నో మెదులుతుంటాయి.

బీ హాస్టల్ డేకు దాశరథి రంగాచార్య వక్తగా వచ్చిండు. సంచలన విషయాలు ప్రస్తావించినా సాఫీగానే ఉత్సాహంగా సాగిపోయింది. కానీ 'ఏ' హాస్టల్ డేకు శివారెడ్డి వక్త. ఉద్వేగంగా నడిచిన ప్రసంగంలో దేవుడినీ, బొట్టును తక్కువ చేసి మాట్లాడిండు. వెంటనే అక్కడే ఘర్షణ మొదలైంది. పీడీఎస్‌యు విద్యార్థులు సంఖ్య ఎక్కువ ఉండటం వల్ల దేశభక్తి కార్యకర్తను కంట్రోలు చేసిండ్రు. కానీ రాత్రి తొమ్మిది గంటల సమయంలో అకస్మాత్తుగా హాస్టళ్లన్నీ కకావికలమైనాయి. క్యాంపస్ బయటి కార్యకర్తలతో సీ హాస్టల్, ఏ హాస్టల్ మీద దాడి జరిగింది. భయానకం. చీకటి చిమ్మింది. లైట్లు పగిలినయి. కొందరి తలలు పగిలిన గుర్తు. దృశ్యం ఘోరంగా ఉంది. వాళ్లు వెళ్లేంత వరకు అరుపులు, కేకలు, ఏడుపులు తప్ప మరేమీ వినబడని స్థితి. మాట్లాడిన వక్త శివారెడ్డి నా రూంలో ఉన్నాడు.

క్యాంపస్‌లో ప్రతి సందర్భంలోనూ బ్యానర్లు బారులు తీరేవి. నడువటానికి వీలులేనంతగా కార్యకర్తల కలకలం. గోడల మీద నినాదాలు పూసేవి. "లాల్‌గులామీ చోడో బోలో వందేమాతరం" అని దేశభక్తులు రాస్తే "జీనాహైతో మర్‌నా సీఖో, కదం కదం పర్ లడ్‌నా సీఖో" అని విప్లవ కార్యకర్తలు రాసేవాళ్లు. 'ఈ వ్యవస్థ ప్లాస్టిక్ పువ్వు. వేడి చేస్తే కరిగిపోతుంది' అనే నినాదం నన్నాకర్షించేది. ఆర్ట్స్ కాలేజీలో 'ఫోకస్' రాతపత్రిక ప్రతి రోజు పెట్టేవారు. స్థానిక, ప్రపంచ విషయాలెన్నింటి మీదనో విశ్లేషణలుండేటివి. అక్కడ నిలబడి చదవటం నిజంగా గొప్ప జ్ఞానం. నా రైటింగ్ అందంగా ఉండటం వల్ల పోస్టర్స్ రాయించేవాళ్లు. బీడీలతో రాయటం అప్పుడే నేర్చుకున్న. ఒక్కోరోజు పోస్టర్ అతికించటానికి, వాల్‌రైటింగ్‌కు వెళ్లేది. రోజువారీ సమస్యల మీద పోస్టర్లు వేస్తే పోలీసులు వెంబడించేవారు. ఒకరోజు వాల్‌రైటింగ్ చేస్తున్న మమ్మల్ని అరెస్ట్ చేసి క్యాంపస్ పోలీస్‌స్టేషన్లో బంధించిండ్రు. క్షణాల్లో హాస్టళ్ల నుంచి వందల మంది విద్యార్థులు వచ్చి ధర్నా చేసి మమ్ముల విడిపించిండ్రు.

కాలేజీ ఫీజుల, మెస్ చార్జీల విషయంగా ఒకరోజు సెక్రటేరియట్ ముందు రాస్తారోకో జరిపారు. ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోయినాయి. పోలీస్‌లొచ్చి లాఠీచార్జి చేసిండ్రు. అప్పటి ఆర్ట్స్ కళాశాల అధ్యక్షుడు మల్లారెడ్డి లాఠీ దెబ్బలకు స్పృహతప్పి పడిపోయాడు. అందరం చెల్లా చెదురుగా పరుగో పరుగు. ఎదురుగా ఇరానీ హోటల్‌లో దాక్కుని చూస్తున్న. ఎవరూ రోడ్డు మీదికి వెళ్లలేని స్థితిలో మల్లారెడ్డి పీడీఎస్‌యు విద్యార్థి అయినప్పటికీ డీఎస్ఓ విద్యార్థిని 'జయలక్ష్మి' వచ్చి నీళ్లు తీసుకెళ్లి తాగించి సపర్యలు చేసింది. అట్లా విద్యార్థుల మధ్య ఒక స్ఫూర్తి ఉండేది. ఆమె చొరవ, ధైర్యం నన్ను అబ్బుర పరిచింది.

ఆ తర్వాత కొద్ది రోజులకే రమీజాబీ సంఘటన జరిగింది. అడిక్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు రమీజాబీ, ఆమె భర్త న్యాయం కోసం వచ్చిండ్రు. భర్త ముందే పోలీస్‌స్టేషన్‌లో రమీజాబీపై అత్యాచారం జరిగింది. చెన్నారెడ్డి ముఖ్యమంత్రి. ఆ సంఘటన మీద పెద్ద నిరసన. విద్యార్థులు, విప్లవ దాదులు రోడ్డు మీదికొచ్చిండ్రు. అటు పోలీసులు, ఇటు విద్యార్థులు విద్యానగర్‌లో ఒక యుద్ధంలాగా జరిగింది. బాష్పవాయు గోళాలు విసురుతుంటే ప్రతిఘటించి పోరుతున్నరు. కొందరు అవి అందుకొని తిరిగి విసిరిన దృశ్యం అపుడే చూసిన. కళ్లు పొగలు, మంటలు. మేం అప్పటికే ఉల్లిపాయలు వెంట ఉంచుకున్నం గనుక వాటి ద్వారా ఇబ్బంది పడకుండా నిల్చున్నం. కాల్పుల దాకా వచ్చేసరికి పరిగెత్తినం. తెల్లవారి పోలీస్‌స్టేషన్ ముందు నడుచుకుంటూ వెళ్లి కరపత్రాలు పంచి, నినాదాలు చేసి తప్పించుకొచ్చినం. ఒక పక్క భయం వేస్తున్నా మరొక పక్క ఉత్సాహం ఉరకలు వేసే అనుభవం. అట్లాంటి ఉత్సాహంతోనే సత్తుపల్లిలో వెంగళరావుపై పోటీకి నిలబడి కాళోజీ ఎన్నికల ప్రచారానికి గుంపుగా వెళ్లినం.

మేం సాయంత్రాలు తార్నాక హోటల్‌లో చాయ్‌తాగి నడుచుకుంటూ తిరిగి హాస్టల్‌కొచ్చేది. ఒకరోజు అట్లా వస్తున్నప్పుడు కొందరు పోలీసులు, కొందరు బాటసారులు గుమిగూడి ఉన్నరు. కొద్ది నిమిషాల కిందే సంఘటన జరిగిన

కదలికలు. కొంచెం ముందు నడిస్తే నెత్తుటి పచ్చిచుక్కల గుర్తులు. విద్యార్థి మీద దాడి, కత్తి పోట్లు జరిగినట్లు భయం భయంగా చెప్పుకుంటున్నరు. తెలుసుకుంటే అతను రామకృష్ణ. సైన్సు కళాశాల కార్యదర్శి. రాడికల్ విద్యార్థి సంఘ నాయకుడు. క్యాంపస్ అంతా భయంతో వణికింది. తెల్లారి లేచేసరికి ఎన్ఆర్ఎస్ హెచ్ ఎంట్రెన్స్ గోడకు పోస్టర్. నిలబడి చూస్తున్నారు కొందరు. "మా మౌనం మూగతనం కాదు. నీకు తెలుసో లేదో గోడకు వేలాడే తుపాకీ కూడా మౌనంగా ఉంటుంది" అని ఎర్రటి అక్షరాలు. ఆ కవిత నాదే. అట్లా ఉపయోగపడినంతుకు కవిగా ఉత్సాహం. ఉద్యమ విద్యార్థులు కవిత్వం చదివి అన్వయిస్తున్నందుకు సంతోషం కలిగింది.

టాగోర్ ఆడిటోరియం నిత్య నినాదాల్తో పులకించేది. బహిరంగసభలు, విద్యార్థి సంఘాల ఉత్తేజ భావోద్వేగాలకది కూడలి. ఎన్ని కదలికలకో అది పునాది. ఎందరి రక్తమో ఉడుకెత్తి బిగుసుకున్న పిడికిలి. నడుమ ల్యాండ్‌స్కేప్ గార్డెన్ కూడా లావా చిమ్ముతున్నట్లుండేది. చిన్న బ్రిడ్జి మీద వరుసగా నడుస్తుంటే సైన్యం నడిచినట్టే. ప్లెకార్డులు రాసి, పట్టుకొని ఎన్నిరోడ్లు, ఎన్ని గల్లీఉ, ఎన్ని కార్యాలయాలు నడిచామో. గుర్తొచ్చినప్పుడల్లా గుండె బరువెక్కుతుంది. నాకు అన్ని వామపక్ష విద్యార్థి సంఘాలతో సంబంధాలుండేవి. అప్పుడప్పుడయినా అవన్నీ కలవాలనీ కోరిక ఉండేది. చంద్ర టీసిన అట్లాంటి ఒక బొమ్మ నా గదిలో అంటించుకున్న. చైతన్యాలకు, సంఘటనలకు సంకేతంగా భాసించే ఉస్మానియా క్యాంపసే సంఘటిత స్ఫూర్తికి శక్తినిచ్చింది. విజయాలకు, విఫలాలకు ఇప్పటి చిహ్నంగా ఇబ్బంది పడుతున్న క్యాంపస్ శతవసంతాల తేజస్సు వినూత్న ఉద్యమాలకు పతాకమెత్తాలి. జాతిని, సమాజాన్ని ముందుకు నడిపే సరికొత్త నాయకత్వాన్ని ఇవ్వగలగాలి.

★ **రచయిత: ప్రముఖకవి** T

# ఉస్మానియా 'హార్ట్స్' కాలేజి

**ఎనిశెట్టి శంకర్**

ఒళ్లు జలదరిస్తుంది
మనసు ఉరకలేస్తుంది
ఒక్కరిదా ఈ కల!
ఒక్కనాటిదా ఈ ఊహ
సకల చరాచరాలు ఈ సృష్టిలోకే
సకల ఆలోచనాలోచనలు ఇక్కడే ప్రభవించినట్లు
కొందరి కలలు సాకారం
మరికొందరి ఊహలు నిజాలు
ఉద్యమాల పురిటిగడ్డ
దౌర్జన్యాలనే గడగడలాడించి
పేరు చెబితేనే ముచ్చెమటలు పోసే
పులిబిడ్డల ఆవాసం
అవునా...! అంతేనా...!
సాహిత్యంలో అ,ఆలు నేర్పించి
సాహితీవనాలమణులను పూయించి
మకుటాయమానమై
సాహితీ స్రష్టలుగా
సాహితీ దిగ్గజాలుగా
పురుడుబోసినచోటు
ఈ స్ఫూర్తే, ఈ చైతన్యమే
అది 'సి' హాస్టల్ కావొచ్చు
అది 'ఈ' హాస్టల్ కావొచ్చు
అది 'ఏ' హాస్టల్ అయినా
ఆర్ట్స్ కాలేజ్ ఔన్నత్యాన్ని
మరెంతో పెంచే
విద్యార్థి వీరకిశోరాలను ఎందరినో
అందించే చోటు
ఈ ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీయే
నిలువెత్తు ఉద్యమాలకు చరిత్రకు సాక్షి

ఆనాటి మతోన్మాదుల సింహస్వప్నం
ఆనాటి సామ్రాజ్యవాదుల గుండెల పులిగాండ్రింపు
పురిటినొప్పులతో బాటు వాళ్ల ఆశయాల్ని కన్నది
నాణానికి ఇంకో రూపం
భాషకే భావనల్ని పూయించి
ఆటకు, మాటకు, పాటకు
కొత్త భాష్యాలు చెప్పినదీ
ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్

ఈ మహా వృక్షం కింద
సేదతీరి ఊరటపొందిన
ఎందరో విద్యావేత్తలు, విజ్ఞానదాతలు
అందుకే
ఈ మా ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్
ఎందరెందరో హృదయాలను కొల్లగొట్టిన
'హార్ట్స్ కాలేజ్'

1973-75 ఆర్ట్స్ కాలేజి విద్యార్థి

# ఓయూ కథ

డేవిడ్

1917లో ఉస్మానియా యూనివర్శిటీని స్థాపించినప్పటికీ ఆలోచన మాత్రం చాలా పాతది. దీని వెనుక అనేక మంది ప్రముఖుల ఆలోచనలు, ప్రతిపాదనలు, దశాబ్దాల నిరీక్షణ ఉంది. యూనివర్సిటీ ఆలోచన వెనుక అనేక మంది ఉన్నప్పటికీ ముందుగా చెప్పుకోవాల్సిన వ్యక్తులు మాత్రం కైరో అల్ అజర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ మౌల్వీ జమాలుద్దీన్ అఫ్ఘానీ, డబ్ల్యు.ఎస్.బ్లంట్ అనే బ్రిటీష్ విద్యావేత్త. వీరిద్దరి పాత్ర మరువలేనిది.

1879లో హైదరాబాద్ సందర్శించిన ప్రొఫెసర్ మౌల్వీ జమాలుద్దీన్ అఫ్ఘానీ 'యూనివర్సిటీ ప్రతిపాదన'ను తీసుకొచ్చిన మొదటి వ్యక్తి. ప్రొ॥జమాలుద్దీన్ అఫ్ఘనీ జన్మరీత్యా అఫ్ఘనిస్థాన్‌కు చెందిన వ్యక్తి. అతనికి దుందుడుకుతనం మెండు అంటారు. బ్రిటీష్ వారి ఎదుటే బ్రిటీష్ వ్యతిరేక అభిప్రాయాలను వ్యక్తం చేయగలనేర్పరి. తరచూ ఇదే వైఖరిని అవలంబించి ఈజిప్టు నుంచి తరిమివేయబడి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇతను హైదరాబాద్‌లో ఉన్న కాలంలో సాలార్‌జంగ్ ఇతన్ని నిజాం ప్రభుత్వంలో అధికారిగా పనిచేయమని కోరినప్పటికీ అతను సున్నితంగా దాన్ని తిరస్కరించి తన ఆలోచనను వివిధ వేదికల ద్వారా పంచుకొని తక్కువకాలంలోనే హైదరాబాద్‌లోని ప్రముఖుల దృష్టిని ఆకర్షించాడు. ఇతనికి విద్యారంగమన్నా ప్రత్యేకించి ఇస్లామిక్ విద్య అన్నా ఎంతో మక్కువ. హైదరాబాద్‌లో వున్న కాలంలోనే స్థానిక ఉర్దూ పత్రికల్లో మతం, తత్వ శాస్త్రం, విద్యారంగం, సామాజిక సంస్కరణలు మొదలైన అనేక విషయాలపై విరివిగా వ్యాసాలు రాశాడు. సంప్రదాయ ముస్లిం విద్యావిధానాన్ని నిరసించాడు. ప్రకృతి శాస్త్రాలను, మానవీయ శాస్త్రాలను అలాగే వృత్తివిద్య కోర్సులను ఆధునీకరించినప్పుడు మాత్రమే ముస్లిం విద్యార్థుల అభివృద్ధి సాధ్యపడుతుందనే సంస్కరణలను సూచించాడు. "ఆ దేశ భాషల్లో బోధన చేసినప్పుడే ప్రగతి సాధ్యం" అని కన్పించిన ప్రతివారికి చెప్పేవాడు."ఆధునిక భాషల్లోని పుస్తకాలను ఉర్దూలోకి ఎందుకు అనువాదం చేయకూడదు?" అని అధికారులను ప్రశ్నిస్తూ "ముస్లిం విద్యా విధానం ప్రాశ్చాత్యుల చేతుల్లో వున్నంత కాలం వాళ్ళు తమ మత విశ్వాసాలను కోల్పోక తప్పదని, దానికి విరుగుడు ముస్లిం విద్యను ఆధునికరించడమే" అని ప్రతిపాదించాడు. అందుకు ఆధునిక ప్రమాణాలతో కూడిన మాతృభాషలోని "ముస్లిం విద్యావిధానమే పరిష్కార"మని సూచించాడు.

"దేశ భాషలో రాసిన ఒక్క పుస్తకం కూడా లేకుండా విదేశీ భాషల్లో రాసిన వేలాది పుస్తకాలున్న గ్రంథాలయం గురించి గర్వంగా ఎలా చెప్పుకోగలుగుతా"రని నిలదీసేవాడు. హైదరాబాద్‌లో వున్న రెండేళ్ల కాలంలో మౌల్వీ ఇలాగే వాదనలు కొనసాగించినప్పటికీ అతని ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత అతను కలకత్తాకు అక్కడి నుంచి అఫ్ఘనిస్తాన్‌కు, చివరకు పారిస్‌కు వెళ్లి తలదాచుకున్నాడు.

ప్రొ॥జమాలుద్దీన్ అఫ్ఘనీ హైదరాబాద్‌ను వదిలి వెళ్ళిపోయినప్పటికీ అతని ఆలోచన మాత్రం తర్వాత కూడా కొనసాగింది. ఈసారి అతని ఆలోచన 'దేశీయ విద్యను సమర్థించే' డబ్ల్యు.ఎస్.బ్లంట్ రూపంలో తెరపైకి వచ్చింది. బ్లంట్ బ్రిటీష్ పార్లమెంట్‌లో సభ్యుడు. విద్యావేత్త. ప్రాశ్చ్య సంస్కృతి పరిరక్షకుడిగా తనకు తాను చెప్పుకునే బ్లంట్‌ని "సమున్నత భావాలు గల బ్రిటీష్ వ్యక్తిగా, తూర్పు దేశాల్లో బ్రిటీష్ వారి సామ్రాజ్యవాద కుయుక్తులను నిరంతరం వ్యతిరేకించే వ్యక్తిగా" అభివర్ణించేవారు. ఇతను కూడా ముస్లిం విద్యార్థులకు బోధించే విద్యను ఇస్లాం సంప్రదాయాలకు అనుగుణంగా ఆధునీకరించాలని ప్రగాఢంగా నమ్మాడు. బ్లంట్, జమాలుద్దీన్‌లు ప్యారిస్‌లో ఒకసారి కలుసుకొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు కూడా. ఇండియా సందర్శనలో హైదరాబాద్‌కు చేరుకునప్పుడు యూనివర్సిటీ ప్రతిపాదనను నిజాం ముందు మళ్లీ ఒసారి ఉంచాలని బ్లంట్‌కు గుర్తుచేశాడు జమాలుద్దీన్. ఇద్దరి అభిప్రాయాల్లో సారూప్యత ఉంది. దీంతో బ్లంట్ హైదరాబాద్ సందర్శనలో ఉన్నప్పుడు జనవరి 25, 1883లో 'మహ్మదీయ యూనివర్సిటీ' ప్రతిపాదనను మహబూబ్ అలీఖాన్ (6వ నిజాం) ముందుకు తీసుకొచ్చాడు. "భారత్‌లో ప్రస్తుతం పరిపాలిస్తున్న శక్తిమంతుడైన రాజు"గా మహబూబ్ అలీఖాన్‌ను పొగిడే బ్లంట్, 'యూనివర్సిటీ ఆలోచన'పట్ల మహబూబ్ అలీఖాన్ కూడా సానుకూలంగా స్పందించాడు. కానీ ఆ దిశగా మాత్రం

చర్యలు తీసుకోలేదు. అప్పటికీ నిజాం రాజ్యంలో మాధ్యమిక విద్య అంతగా అభివృద్ధి చెందలేదు. యూనివర్సిటీ నడపటానికి సరిపడ విద్యార్థులు లేకపోవడం దీనికి అడ్డంకిగా మారింది.

రెండేళ్లు తిరక్కముందే ఏప్రిల్ 22 1885లో పబ్లిక్ గార్డెన్‌లో 6వ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ అధ్యక్షత జరుగుతున్న ఒక సమావేశంలో కొంతమంది విద్యార్థులు, ప్రముఖులు "నిజామీయా విశ్వవిద్యాలయం" ప్రతిపాదనను లేవనెత్తారు. కానీ దాని గురించి నిజాం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అది కూడా ముందుకు సాగలేదు.

పదేళ్ల వరకు ఆ యూనివర్సిటీ విషయమై ఎటువంటి ప్రతిపాదనలు, ఒత్తిళ్లు లేకపోవడంతో ప్రభుత్వం కూడా దాని పట్ల పెద్దగా శ్రద్ధ చూపలేదు. అయితే 1895 నిజాం కళాశాల బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా హైదరాబాద్ ప్రధాని, సర్ వికార్‌ఉల్‌ఉమర్, 'విశ్వవిద్యాలయం అవసరాన్ని గుర్తిస్తున్నామ'ని చెప్పినప్పటికీ దానికోసం చాలా కాలం వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

అయితే ఆ తర్వాత సంస్థానంలో జరిగిన రాజకీయ మార్పులు, దేశంలో బ్రిటీష్ ప్రభుత్వం తీసుకున్న విద్యా సంస్కరణలు ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్ళాయి. 1911లో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన తండ్రి స్థానంలో రాజయ్యాడు. అతను అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే బ్రిటీష్ ప్రభుత్వం తను పాలించే ప్రాంతాలతోపాటు, సంస్థానాల్లో కూడా యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని 1913లో తీర్మానం చేసింది.

1913 సంవత్సరంలోనే హైదరాబాద్ వేదికగా ఏర్పడ్డ "దరుసలాం ఓల్డ్‌బాయ్స్ అసోసియేషన్" కూడా "యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని" తమ ప్రతిపాదనను ప్రభుత్వం ముందుంచింది. 1914లో ఆ సంస్థ పబ్లిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మొదటి సమావేశంలో పాల్గొన్న సర్ అక్బర్ హైదరీ తన ప్రారంభ ఉపన్యాసంలోనే "నిజాం దృష్టిలో యూనివర్సిటీని స్థాపించాలనే ఆలోచన బలంగా ఉందని, త్వరలోనే అది కార్యరూపం దాలుస్తుందని" ప్రతినిధిగా హామీ కూడా ఇచ్చాడు. కానీ మరో మూడేళ్ల వరకు ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదు.

అయితే బ్రిటీష్ పాలిత ప్రాంతాల్లోని మైసూర్‌లో జులై 27, 1916న 'మైసూర్ విశ్వవిద్యాలయం'. వారణాసిలో 'బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం' మొదలు కావడంతో పాటు పాట్నాలో కూడా అక్కడి పాలకుడు "పాట్నా యూనివర్సిటీ" స్థాపించేందుకు సన్నాహాలు చేసుకుంటున్న సమయంలో నిజాం సంస్థానంలో కూడా జమాలుద్దీన్ అప్ఘాని, బ్లంట్‌ల ఆలోచనలకు కార్యరూపం తొడగడం ప్రారంభమయ్యాయి. నిజాం ప్రభుత్వంలోని విద్యాశాఖలో కార్యదర్శిగా వున్న సర్ అక్బర్ హైదరీ 1917 ఏప్రిల్ 22న ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు విశ్వవిద్యాలయ తక్షణ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ఒక మెమోరాండం సమర్పించాడు. విదేశీ భాషలో విద్యాబోధన చేయడం వలన వచ్చే ప్రతికూల అంశాలను వివరిస్తూ, దేశీయ భాష అయిన ఉర్దూలోనే విశ్వవిద్యాలయం స్థాపించాలని ఒక ప్రతిపాదనను సమర్పించాడు. ఆ ప్రతిపాదన సమర్పించిన నాలుగు రోజుల తర్వాత ఏప్రిల్ 26న 'ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని" స్థాపిస్తున్నట్లు ఫర్మానా జారీచేశాడు. దీంతో ఇది దేశీయ భాషల్లో స్థాపించిన మొట్టమొదటి విశ్వవిద్యాలయంగా చరిత్రలో నిలిచిపోయింది.

"విద్యావంతులైన ముస్లిం యువకులను ఇస్లాం స్ఫూర్తి యోధులుగా" తీర్చిదిద్దడంలో ఉస్మానియా యూనివర్సిటీ సఫలీకృతమైందా లేదా అనేది నిర్ధారణ కాకున్నా హైదరాబాదీ యువకుల ఆలోచనా పరిధిని విస్తరింప చేయడంలో మాత్రం తనవంతు పాత్ర నిర్వర్తించింది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ స్థాపించిని యూనివర్సిటీలో చదువుకున్న వారిలో చాలామంది తదనంతర కాలంలో ప్రజాస్వామిక వాదులుగా రూపొందారు.

**బోధనా భాషపట్ల భిన్న కథనాలు:**

నిజాం మీర్ ఉస్మాన్ అలీ రాజాజ్ఞతో 1917, ఏప్రిల్ 26న యూనివర్సిటీ ఐతే ప్రారంభమైంది కానీ దానితోపాటూ అనేక ఇబ్బందులు కూడా తలెత్తాయి. బోధనా భాషగా ఉర్దూను ఎంచుకోవడం పట్ల వ్యతిరేకతోపాటు ప్రశంశలు కూడా వెల్లువెత్తాయి. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతానికి ఉర్దూ మాతృభాష కాకపోవడం. ఉర్దూలో మంచి పుస్తకాలు లేకపోవడం వంటి అంశాలు ప్రతిబంధకంగా మారాయి. అసఫ్ జాహి ప్రభువులు తమ వంశ పాలనను స్థిర పరచుకునేందుకే ఉర్దూను మెజారిటీ ప్రజానీకంపై రుద్దే కుట్ర ఇందులో దాగి ఉందని బాహాటంగానే విమర్శించారు.

ఉర్దూను బోధనా భాషగా ఏక పక్షంగా ఎంపికచేయడం రాష్ట్రంలోని అత్యధిక శాతం ప్రజలకు విద్యావకాశాలను దూరం చేసి వారి ప్రగతిని నిరోధించడంగానే భావించారు. ఈ వాదనలో నిజం లేకపోలేదు. హైదరాబాద్ భాష ఏది? జనాభాలో 14 శాతం మాట్లాడే ఉర్దూనా? లేక మిగిలిన 86 శాతం మంది మాట్లాడే తెలుగు, మరాఠీ, కన్నడనా? అనేది ప్రశ్న ముందుకు వచ్చింది. అప్పటి గణాంకాల ప్రకారం సంస్థానంలో కోటీ 16

లక్షల 34 వేల మంది జనాభా ఉన్నారు. వీరిలో 85 శాతంపైగా హిందువులు. ముస్లింల జనాభా 12 శాతం. నిజాం రాజ్యం బహుళ భాషలు మాట్లాడే ప్రాంతం. తెలుగు (48.2 శాతం), మరాఠీ (26.4 శాతం), కన్నడ (12.3 శాతం), ఉర్దూ (10.3 శాతం) మాట్లాడే వారున్నారు. త్రి భాషా పరంగా చూస్తే బోధనా మాధ్యమం మొదటి మూడు భాషల వైపు నుంచి ఉండాలి. కానీ చివరకు పాలకుల అభీష్టం ఉర్దూ వైపు మొగ్గింది. దీంతో ఉర్దూను బోధనా భాషగా రుద్దడమంటే మెజారిటీపై తమ భావాన్ని రుద్దడంగానే భావించారు.

అయితే పరిపాలకులు ముస్లింలు కావడం, సంస్థానంలో ఉర్దూ చదివిన విద్యావంతులు చాలినంత మంది లేకపోవడంతో పంజాబ్ నుంచి, సంయుక్త పరిగణాల నుంచి, ప్రస్తుత ఉత్తరప్రదేశ్‌ల నుంచి ఉద్యోగస్తులను దిగుమతి చేసుకునే పరిస్థితి ఆనాడు ఉండేది. ఉర్దూ భాషలో విద్యాబోధన చేస్తే భవిష్యత్తులో స్థానికుల నుంచే చదువుకున్న విద్యావంతులను ఉద్యోగాలలో నియమించుకునేందుకు కూడా ఈ భాష తోడ్పడుతుందని ఉర్దూను బోధనా భాషగా ఎంచుకోవడం వెనుక ఉద్దేశంగా తెలుస్తోంది.

జవహర్‌లాల్ నెహ్రూ దేశీయ భాషల గొప్పతనం, అందులోని ఉపయోగాల గురించి చెబుతూ *"రాష్ట్రీయ భాషలన్నీ గొప్ప ప్రాచీన వారసత్వాన్ని కలిగినవి. ఒక్కొక్క భాష లక్షలాది ప్రజల వాడుకలో వున్నది. అవి అన్ని తరగతుల ప్రజల జీవితంలోనూ, సంస్కృతిలోనూ, విడదీయరానంతగా ముడిపడి సామాన్య వర్గాలకూ, ఉన్నత వర్గాలకూ, వారధిగా వున్నవి. ప్రజలు తమ తమ స్వంత భాషల ద్వారా మాత్రమే విద్యారంగంలోగానీ, సాంస్కృతిక రంగంలో గానీ పురోభివృద్ధి చెందగలరన్నది నగ్న సత్యం"* (వందే...98) అన్న మాటలు నిజాం తీసుకున్న నిర్ణయాన్ని బలపరిచినట్లే అయ్యింది.

అయితే ఉర్దూ బోధనా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం పట్ల మేధావి వర్గంలో, ఉన్నత విద్యావంతుల్లో, సాధారణ ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈ నిర్ణయాన్ని దేశంలోని ప్రముఖులతో పాటు కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల్లోని విద్యావంతులు ప్రశంసించారు. కొన్ని విభాగాల్లో అయితే దీన్ని విప్లవాత్మకంగా పరిగణించారు. ఈ నిర్ణయాన్ని తీసుకోబోయే ముందే సర్ అక్బర్ హైదరీ  దేశ, విదేశాల్లో వున్న ప్రముఖ విద్యావేత్తలను సంప్రదించి వారి సూచలను, సలహాలను తీసుకున్నాడు.

దేశీయ భాషల్లో విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలనే నిర్ణయాన్ని ప్రముఖ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్వాగతిస్తూ **'నేను ఈ రోజు కోసం ఎంత కాలం నుంచో ఎదురుచూస్తున్నాను. విదేశీ భాషా సంస్కృతుల నుంచి స్వతంత్రం పొందిన మన విద్య సహజంగా అందరికీ అందుబాటులో వుంటుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి మనం మన స్వదేశీ సంస్థానాల మీద ఆధారపడడం జరిగింది. మీ సంస్థానం ఉర్దూ బోధనాభాషగా ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని నిర్ణయించుకోవడం నాకు ఆనాందాన్ని కలిగించింది"** అంటూ ప్రశంసలతో ముంతెత్తాడు.

కలకత్తా విశ్వవిద్యాలయ కమిషన్ అధ్యక్షుడుగా ఖ్యాతి గడించిన సర్ మైఖేల్ సాడ్లర్ ***"వాడుక భాషలను గుర్తించి వాటిని బోధనా భాషలుగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రవేశపెట్టే ప్రయోగాత్మకమైన ప్రతిపాదన, దానికి తోడుగా ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం ఉండే రీతిలో తీసుకున్న నిర్ణయం అత్యంత సమయోచితం. ఈ నిర్ణయం మీద విద్యా రంగ భవిష్యత్తు ఎంతగానో ఆధారపడి వుంది"*** అని పేర్కొన్నాడు.

ప్రముఖ రచయిత, చరిత్రకారుడు సర్దార్ కె.ఎం. ఫణిక్కర్ కూడా తన భారతీయ రాష్ట్రాలు అనే తన ఆక్స్‌ఫర్డ్ పత్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం గురించి రాస్తూ ***'ఒక భారతీయ భాషల్లో ఆధునిక విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించడం గొప్ప ప్రయోగంగా"*** దీన్ని ప్రశంసించారు.

ఒక దేశీయ భాషను బోధనా భాషగా ప్రవేశపెట్టిన ఘనత తొలిసారిగా ఈ యూనివర్సిటీకి దక్కినప్పటికీ  భారతీయ భాషల్లో విద్యాబోధన ద్వారా వికాసం కలిగించాలన్న నిజాం ప్రయత్నం సఫలమైందా అని ప్రశ్నిస్తే దానికి అవును అనీ కాదనీ రెండు సమాధానాలు వస్తాయి. అభిప్రాయాల్లో తేడాలున్నాయి. ఈ మొత్తం పథకం బుద్ధిశూన్యం, అనాచరణాత్మకం, వ్యర్థమని కొందరంటే, ఎవరూ చేయని సాహసోపేత చర్యగా మరికొందరు పేర్కొన్నారు. ఉస్మాన్ అలీ తన మాతృ భాషలో విశ్వవిద్యాలయం ప్రారంభించి, అది స్వల్ప కాలం కొనసాగినప్పటికీ ఇంతకు ముందెన్నడూ ఎవరూ చేయని గొప్ప ప్రయోగంగా దీన్ని చెప్పవచ్చు. అయితే ఈ ప్రయోగాన్ని చేపట్టి సుమారు శతాబ్దం కావస్తున్నా ఈ ప్రయోగం గురించి ఇంతవరకు శాస్త్రీయంగా పరిశోధన చేసిన వాళ్లు మాత్రం లేరు.

వివిధ సందర్భాల్లో యూనివర్సిటీని సందర్శించి, తమ అభిప్రాయాలు వ్యక్తం చేసిన వాళ్ల మాటల్లో మాత్రం ఈ ప్రయోగం విజయవంతమైందిగానే చూడవచ్చు. 1937లో యూనివర్సిటీని సందర్శించిన  ఆంధ్ర విశ్వవిద్యాలయం మొదటి వైస్ ఛాన్సలర్ సి.ఆర్ రెడ్డి తన స్నాతకోత్సవ ఉపన్యాసంలో

"ఒక భారతీయ భాషను మాధ్యమంగా ఎంచుకొని తద్వారా జ్ఞానాన్ని అందజేయడంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సాధించిన విజయం, ఇతర భారతీయ భాషలను మాధ్యమంగా ఎంచుకునే వాళ్లకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నాడు.

"ఇది మొత్తం దేశంలోనే అసలు సిసలైన దేశీయ విద్యాపీఠం" అని వర్ణించిన సి.రాజగోపాలచారి "భారతీయ భాషలో మానవీయ శాస్త్రాల బోధనతో పాటు ఉన్నతమైన శాస్త్రీయ విద్యను బోధించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం భారతదేశంలోనే ప్రత్యేకమైనది. ఇది ఒక రకంగా ముస్లిం – హిందూ మతాల ఉత్పత్తిగా చూడవచ్చు. ఇదీ కేవలం ఉస్మానియాకే ప్రత్యేకమైనదిగా చూడకుండా మొత్తం దేశానికి చెందిందిగా గర్వపడాలి" అంటాడు.

అయితే ఉర్దూను బోధనా భాషగా తీసుకోవడంలో ఎన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ ఆచార్య హెచ్.కె. షెర్వానీ పేర్కొన్నట్లు, "ఒక అర్ధ శతాబ్దానికి పైబడి మద్రాస్ విశ్వవిద్యాలయ ఆధీనంలో ఉన్న విద్య ఆశించిన ఫలితాలను సాధించడంలో విఫలమైనప్పటికీ ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపన ద్వారా ఉన్నత విద్యలో ఒక నూతన శకానికి శ్రీకారం చుట్టిందని" మాత్రం చెప్పవచ్చు.

★ **రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయు** T

# ఆర్ట్స్ కాలేజ్

**కాశీం**

సుందర స్వప్నాలను
తెలి కన్నుల ప్రేమలను
వెన్నెల వేకువలో
గడ్డిపూల పెదవులపై అల్లిన
చారిత్రక కావ్యం 'ఆర్ట్స్ కాలేజ్'

విరిగిపోయిన పేదల కలలు
ముత్యపు చినుకుల్లా జారిపడ్డ చెమటచుక్కలు
పగిలిన మునివేళ్ల నెత్తుటి వాసన
గోడ శరీరంపై వాలిన పక్షి స్మృతులు

ఇపుడో...!
నెలవంకకు వేలాడుతున్న చరిత్రను
బొడ్డుమల్లెల పరిమళంలో చదివాను
ఆశయాల ప్రేమల్ని 'ల్యాండ్‌స్కేప్' నిండా వెదజల్లి
శిరము వాల్చిన గడ్డిపరకతో సంభాషించాను.

ఒక తొలిజాములో
దాస్ కాపిటల్‌లో దాచుకున్న
ప్రియురాలి రాకకోసం
ఆకుల కనురెప్పలపై నిరీక్షించాను

క్యాంపస్ గోడలపై కలిసి రాలిన నినాదాలు
క్యాంటీన్ 'టీ' కప్పులో సుడితిరిగిన సుత్తీ కడవలి
'లా' కాలేజ్ మెట్ల మీద నెత్తురంటిన జ్ఞాపకాలు
ఎర్రజెండాతో సంభాషించి కరిగిపోయిన రాత్రుళ్లు
పారిజాత పువ్వుపై రాలిన పసిగుర్తులుగానే ఉన్నాయి

తూనీగ రెక్కలపై కాలం ప్రయాణించింది
నిప్పులు చిమ్మిన సూర్యోదయాలు
శత్రువును కూల్చిన గోధూళి వేళలు
. . . . . . . . . . . . . . . . . .

నేల కన్నులను ముద్దాడిన తెలంగాణ
పున్నాగపువ్వు విచ్చుకున్నది
పురాస్మృతులన్నీ పోరువంకలై
ఒక మలిసంధ్య వేళ
ఆర్ట్స్ కాలేజ్
ఐదు లక్షల మందిని ఈనింది
ప్రసవించిన నెత్తుటి పొత్తిళ్లలో
ఉద్యమానికి కాపలా కాస్తుంది

మే 2011

# ఉద్యమాల ఉనికిపట్టు ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఎన్.వేణుగోపాల్

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని చివరి అసఫ్ జాహీ ప్రభువు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ప్రారంభించాడేమో, తన పేరే పెట్టుకున్నాడేమో గాని, అది ఎప్పుడూ రాజుల సంస్కృతిని ఔదలదాల్చినది కాదు. ఎల్లవేళలా సామాజిక చలనాలకు స్పందించిన విద్యార్థి ఉద్యమ కెరటాల మీదనే ఉస్మానియా వంద సంవత్సరాల జీవితం గడిచింది. ఆ అలలు అప్పుడప్పుడు తీవ్రంగా ఎగిసిపడి ఉండవచ్చు, అపుడప్పుడు మౌనంగా ఆటుపోట్లు సాగించి ఉండవచ్చు. కాని ఉస్మానియా సముద్రం సంచలన రహితంగా ఎప్పుడూ లేదు. వంద సంవత్సరాల ఉస్మానియా చరిత్రను సింహావలోకనం చేస్తే దాని ఆవిర్భావ వికాసాల పరిణామాలన్నీ సామాజిక సంచలనాల, విద్యావంతుల ఆలోచనల, విద్యార్థి ఉద్యమాల ఉధృతిలో సాగినవేనని అర్థమవుతుంది.

అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలనే ఆలోచన 1915లో అక్బర్ హైదరీ అధ్యక్షుడుగా ఏర్పడిన హైదరాబాద్ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ అనే ప్రజాసంస్థది. అయితే బ్రిటిష్ ప్రభుత్వ ఉన్నతోద్యోగిగా 1905లో నిజాం ప్రభుత్వ అకౌంటెంట్ జనరల్‌గా వచ్చి, ఆ తర్వాత ఆర్థిక కార్యదర్శిగా, హోం కార్యదర్శిగా, పరిశ్రమల కార్యదర్శిగా ఎన్నో ఉన్నత పదవులు చేపట్టిన, బొంబాయికి చెందిన అక్బర్ హైదరీ ఈ సంస్థకు గౌరవాధ్యక్షుడే గాని, సంస్థ నిజంగా అప్పుడప్పుడే మేల్కొంటున్న హైదరాబాద్ సమాజానిది. అంతకు రెండు మూడు దశాబ్దాల ముందు నుంచి ప్రారంభమైన కళాశాల విద్యారంగంలో అప్పుడప్పుడే విద్యావంతులైన ఒక యువకుల బృందం ఈ సంస్థను స్థాపించి, నిర్వహించింది. దారుల్ ఉలూమ్ ఓరియెంటల్ కాలేజీలో చదువుకున్న మహమ్మద్ ముర్తుజా, టర్కిష్ సహాయనిధితో ప్రఖ్యాతుడైన అబ్దుల్ బాసిత్, స్థానిక ఉర్దూ దినపత్రిక నిర్వాహకుడు మీర్ అక్బర్ అలీ, ప్రభుత్వ రెవెన్యూ శాఖలో తహసీల్దార్‌గా పనిచేస్తుండిన మిర్జా మహమ్మద్ బేగ్ వంటి విద్యావంతుల బృందం 1915లో హైదరాబాదులో తొలి హైదరాబాద్ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాజ్యమంతటా విద్యావ్యాప్తికి ప్రయత్నించడం, ప్రత్యేకంగా కళల్లో, విజ్ఞానశాస్త్రాలలో, సాంకేతిక పరిజ్ఞానంలో ఉర్దూ మాధ్యమంగా ఉన్నత విద్య సాధించడం, ఉర్దూలో ఉన్నత విద్య కోసం ఒక విశ్వవిద్యాలయం స్థాపించాలని ప్రభుత్వాన్ని కోరడం ఈ సంస్థ లక్ష్యాలు. ఈ సంస్థ సమావేశాలు వరుసగా 1916లో ఔరంగాబాద్‌లో, 1917, 1918లలో హైదరాబాదులో, 1919లో లాతూరులో జరిగాయి. ఈ అన్ని సమావేశాల్లోనూ



విశ్వవిద్యాలయం స్థాపించాలనీ, అవసరమైన పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వాలనీ, శాస్త్రీయ విజ్ఞానాన్ని భారతీయ భాషలలో ప్రచురించాలనీ, విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్‌ను ద్వితీయ భాషగా నేర్పాలనీ విజ్ఞప్తులు తయారుచేసి ఉస్మాన్ అలీ ఖాన్‌కు సమర్పించారు. ఈ సామాజిక ఒత్తిడి మేరకే ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపన ప్రయత్నాలు ప్రారంభించి, 1917 ఏప్రిల్ 26న ఫర్మాన్ విడుదల చేసింది. ఏర్పాటు చేయనున్న విశ్వవిద్యాలయానికి పాఠ్యాంశాలు రూపొందించ డానికి 1917 నవంబర్4న ఒక ఉపసంఘాన్ని నియమించింది. 1918 మార్చ్‌లో ఒక సాంకేతిక పదాల నిర్ణయ కమిటీని, ఒక అనువాద మండలిని నియమించింది. అలా రాజు తలచుకున్న దానికన్న ఎక్కువగా ఒక ప్రజా బృందం కోరిక మీద, ఒత్తిడి మీద ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రారంభమయింది. అలా సమాజం కోరిక మీద ఏర్పడి, సమాజంతో ఆ అవిభాజ్యమైన సంబంధాన్ని వంద సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగించడమే ఉస్మానియా విశ్వవిద్యాలయ విశిష్టత.

ఆ సంబంధం మొదట ఆనాటి సమాజపు ఉన్నత వర్గీయులతో, ప్రభువంశీకులతో, విద్యావంతులతో, పాలకుల భాషతో మాత్రమే కావచ్చుగాని, క్రమంగా అది ఇతర వర్గాలకూ, భాషలకూ విస్తరించింది. బహుశా ఉస్మానియా విశ్వ విద్యాలయపు తొలి దశకం ముగిసే సమయానికి దానికి ఒక విశాలమైన ప్రాంగణం, తగినన్ని భవనాలతో మౌలిక సౌకర్యాలు కావలసిన అవసరం తెలిసి వచ్చింది. అలా ఉస్మానియా ప్రస్తుత ఆవరణకు చేరడం కూడ ఒక సామాజిక పరిణామమే. పందొమ్మిదో శతాబ్దపు హైదరాబాద్ రాజ్యంలో కవి, వేశ్య, రెండో, మూడో నిజాంల ఆస్థానంలో సంగీత, సాహిత్య, నృత్య విదుషీమణి, సైనిక, రాజకీయ రంగాలలోను ప్రముఖురాలు మహ్లఖాబాయి చందా ఎన్నో జాగీర్లు సంపాదించింది. తన అనంతరం తన ఆస్తిని నిస్సహాయ స్త్రీల సహాయార్థం ఉపయోగించాలని వీలునామా రాసి 1824లో మరణించింది. ఆమెకు చెందిన అడిక్‌మెట్ ఆస్తిలో నుంచి రెండున్నరవేల ఎకరాలు తీసుకుని 1928లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఇచ్చాడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్. అలా వేశ్యగా పేరు పొందిన స్త్రీకి చెందిన భూమి మీద, నిస్సహాయ స్త్రీలకు హక్కు ఉన్న భూమి మీద ఉస్మానియా విశ్వవిద్యాలయానికి శాశ్వత స్థావరం దొరికింది. యూరప్, అమెరికా, జపాన్, టర్కీ, ఈజిప్టులలో విశ్వవిద్యాలయ భవనాలనూ, అజంతా–ఎల్లోరా గుహలతో సహా భారత ఉపఖండపు నిర్మాణాలనూ పరిశీలించిన బెల్జియన్ భవన నిర్మాణ శిల్పి జాస్పర్ విశ్వవిద్యాలయ భవనాల రూపకల్పన చేశాడు. మొఘల్, హిందూ, బౌద్ధ, యూరోపియన్ నిర్మాణ శైలుల మేలు కలయికగా, నవాబ్ జైన్ యార్ జంగ్ నిర్వహణలో నిర్మించిన ఈ భవనాలు, ప్రధానంగా ఆర్ట్స్ కాలేజీ భవనం తెలంగాణ వడ్డెరల నెత్తుటితో, చెమటతో రూపొందింది. 1939కల్లా పూర్తయ్యాయి. అలా ఉస్మానియా నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలలో, ఆకృతిని ఊహించిన రూపకర్తలలో దేశదేశాల కళానైపుణ్యం కలగలిసింది. ఆర్ట్స్ కాలేజీ భవనం నిర్మిస్తూ ఆ వడ్డెరలు పొరుగున నిర్మించుకున్న గుడిసెలు వడ్డెర బస్తీగా, మాణికేశ్వరి నగర్‌గా 1940ల నుంచీ ఇవాళ్టిదాకా ఉస్మానియా విద్యార్థులకు ఆశ్రయమూ ఇస్తున్నాయి, విద్యార్థుల సామాజిక అవగాహనకూ, చైతన్యానికీ ప్రశ్నలూ సంధిస్తున్నాయి, పదునూ పెడుతున్నాయి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రస్తుత ఆవరణలోకి రాకముందే కనీసం రెండు విద్యార్థి సంచలనాలకు వేదిక అయింది. అది అప్పటి మొత్తం భారత ఉపఖండంలోనే ఒక భారతీయ భాష బోధనా మాధ్యమంగా ఉన్న ఏకైక విశ్వవిద్యాలయం కావడం, దక్షిణ భారతంలోని మూడు విశ్వవిద్యాలయాల్లో ఒకటి కావడం దాని ప్రాధాన్యతకు పునాది కాగా, ఎన్నో రాజకీయ, ఆర్థిక, సామాజిక సంచలనాలకు భూమిక అయిన హైదరాబాద్ రాజ్యపు ఇరవయో శతాబ్ది తొలి అర్ధభాగపు వాతావరణం దాని చైతన్యానికీ, ఆందోళనాచరణలకూ ప్రేరణనిచ్చింది. ఉస్మానియా పుట్టుకే స్థానిక వనరుల మీద, విద్యా, ఉద్యోగావకాశాల మీద స్థానికేతర శక్తుల ఆధిపత్యం ఉండగూడదనే ఆందోళనతో, ఆ ఆందోళనకు స్పందనగా నిజాం ప్రభుత్వం వెలువరించిన ముల్కీ నిబంధనలతో(1919) కలగలిసి సాగింది. ఆ ముల్కీ నిబంధనలు కూడా సక్రమంగా అమలు కావడం లేదని, స్థానికేతర అధికారులు, ఉన్నతోద్యోగులు ముల్కీ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, పంజాబ్, యునైటెడ్ ప్రావిన్సెస్‌ల నుంచి వచ్చినవారినే ఉద్యోగాలలో నింపుతున్నారని అసంతృప్తులతో 1935లో హైదరాబాద్ ఫర్ హైదరాబాదీస్ అనే ఉద్యమం ప్రారంభమయింది. ముఖ్యంగా హైదరాబాద్ రాజ్య ప్రభుత్వోద్యోగాలలో పంజాబ్, అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయ పట్టభద్రులకు ఉద్యోగాలు ఇస్తూ, ఉస్మానియా పట్టభద్రులను నిర్లక్ష్యం చేయడానికి వ్యతిరేకంగా ఈ ఉద్యమం ప్రారంభమైంది. అసలు ఈ ఉద్యమాన్ని నడిపిన హైదరాబాద్ సబ్జెక్ట్స్ లీగ్ అనే సంస్థ నిజాం రాష్ట్రంలో కుల మత సామరస్యం సాధించడం కోసం, ప్రాథమిక హక్కులు, బాధ్యతాయుత ప్రభుత్వం ఇవ్వాలని పాలకుడిని కోరడం కోసం ఏర్పడింది.



అప్పటిదాకా ఉద్యోగాల కోసం, స్థానికత కోసం, ఒకరకంగా ఆర్థిక, సాంస్కృతిక నినాదాలతో ఉద్యమించిన ఉస్మానియా, కొత్త భవనాలలో ప్రవేశించాక 1938లో నేరుగా రాజకీయ ఆకాంక్షల ఉద్యమాల యుగంలోకి ప్రవేశించింది. ఆ సంవత్సరమే హైదరాబాద్‌లో తొట్టతొలి రాజకీయ సంస్థగా స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భావ ప్రయత్నాలు, అప్పటికి ఎనిమిది సంవత్సరాలుగా పనిచేస్తున్న సాంఘిక సంస్థ ఆంధ్ర మహాసభ క్రమంగా రాజకీయాలలోకి ప్రవేశించక తప్పని స్థితి, ప్రభుత్వం కూడ అంగీకరించక తప్పని రాజ్యాంగ సంస్కరణలు వంటి ఉద్వేగభరిత వాతావరణంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణలోకి దిగింది. అప్పటివరకూ విద్యార్థులందరూ తప్పనిసరిగా చదవవలసిన, నిజాంను కీర్తించే ప్రార్థనా గీతం 'తా అబద్ ఖాలిఖే ఆలం' బదులు ఉస్మానియా విశ్వవిద్యాలయ హాస్టళ్ల విద్యార్థులు 'వందేమాతరం' గీతం పాడాలని నిర్ణయించుకున్నారు. (స్థలకాలాల పరిమితులను గుర్తించకుండా, వందేమాతరం గీతం పాడడం అభివృద్ధి నిరోధకమని ఇవాళ అనుకోవచ్చు గాని, 1930ల హైదరాబాద్ రాజ్యంలో రాజ్యధిక్కార వ్యక్తీకరణల్లో అది ఒకటి). ఆ గీతం పాడగూడదని అధికారులు అడ్డుకోవడం, విద్యార్థులు నిరసన తెల్పడం కొంతకాలం సాగిన తర్వాత, చివరికి 1938 నవంబర్ 28న విశ్వవిద్యాలయ అధికారులు వందేమాతరం ఆలపించ గూడదని ఉత్తర్వులు జారీచేశారు. విద్యార్థులు ఈ ఉత్తర్వులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, తమ ఇష్టం వచ్చిన ప్రార్థనా గీతం పాడుకునే హక్కు తమకు ఉందనీ, ఏదో ఒకటి పాడమని నిర్బంధించగూడదనీ వాదించారు. ఇదివరకు పాడినందుకు క్షమాపణలు కోరకపోతే, పాడినవారందరినీ హాస్టళ్లనుంచి బహిష్కరిస్తామనీ, హాస్టల్ బకాయిలు వెంటనే చెల్లించి ఖాళీ చేయాలనీ వైస్ చాన్సలర్ అన్నాడు. క్రమశిక్షణా రాహిత్యాన్ని అంగీకరించబోమనీ, విద్యార్థులు బుద్ధిగా ఉండకపోతే కఠినమైన చర్యలు తీసుకుంటామనీ స్వయంగా ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది. విద్యార్థులకూ ప్రభుత్వ రాజ్యాంగ వ్యవహారాల కార్యదర్శికీ చర్చలు జరిగాయి. కార్యదర్శి ప్రభుత్వానికి కొన్ని మధ్యే మార్గసూచనలు చేశాడు. కాని నిజాం ఆ రాజీ సూచనలను కూడ కొట్టివేశాడు. దానితో హాస్టళ్ల విద్యార్థులకు సంఘీభావంగా విశ్వవిద్యాలయ విద్యార్థులందరూ కూడా సమ్మెకు దిగారు. నగరంలోని ఇతర కళాశాలలూ, క్రమంగా రాజ్యంలోని అన్ని కళాశాలలూ, పాఠశాలలూ కూడ సమ్మెలో పాల్గొన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఆ ఆందోళన రాష్ట్రవ్యాపిత విద్యార్థి మహా ఉద్యమంగా విస్తరించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 350 మందిని, గుల్బర్గా కాలజీ నుంచి, పాఠశాలల నుంచి 200 మందిని, ఔరంగాబాద్, వరంగల్ కాలజీల నుంచి, పాఠశాలల నుంచి 500 మందిని బహిష్కరించారు. వారిలో చాలమందిని నాగపూర్, జబల్పూర్ కళాశాలలు పిలిచి చేర్చుకున్నాయి. చివరికి ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు విద్యార్థుల కోర్కెను అంగీకరించి, వందేమాతరం గీతం మీద నిషేధాన్ని ఎత్తివేసి, విద్యార్థులను వెనక్కి తీసుకోక తప్పలేదు.

ఈ సందర్భంగానే హైదరాబాద్ రాష్ట్రంలోకి ప్రవేశించిన కమ్యూనిస్టు భావాల వ్యాప్తిలో, హైదరాబాద్ రాజ్యంలో తొట్టతొలి కమ్యూనిస్టు సంస్థ అయిన కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపనలో కూడ ఉస్మానియా విద్యార్థుల పాత్ర ఎంతో ఉంది. ఆ తర్వాతి దశకంలో గుణాత్మక దశకు ఎదిగిన ఆంధ్ర మహాసభలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉస్మానియా విద్యార్థులెందరో పాల్గొన్నారు. ఉస్మానియా విద్యార్థులలో

కొందరు చదువులు వదిలేసి సాయుధ దళాల్లో, సాంకేతిక సేవలు అందించడంలో నిమగ్నమయ్యారు. సాయుధపోరాటం రోజుల్లోనే ఏర్పడిన ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ ఉస్మానియాలో బలమైన సంస్థగా ఉండింది.

సాయుధపోరాటం మీద తీవ్రమైన నిర్బంధం, బ్రిటిష్ ఇండియాలో అధికార మార్పిడి, హైదరాబాద్ రాజ్యంపై సైనిక చర్య, హైదరాబాద్ రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసుకోవడం, 1952 దాకా సైనిక పాలన, పౌర అధికారుల పాలన ముగిసి, 1952లో హైదరాబాద్‌లో మొదట ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చడానికి నెహ్రూ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. హైదరాబాద్ పౌర సమాజమూ ఉస్మానియా అధ్యాపక, విద్యార్థి లోకమూ ఈ ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గక తప్పలేదు.

సైనిక, పౌర పాలనల సమయంలో పాత నిజాం ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను తొలగించడమనే పేరుతో ఇతర ప్రాంతాలవారిని, ముఖ్యంగా మద్రాసు రాష్ట్ర అధికారులను, ఉద్యోగులను హైదరాబాద్ రాజ్యంలో నింపడంతో మళ్లీ ఒకసారి 1952లో ముల్కీ ఉద్యమం చెలరేగింది. అప్పుడు కూడ ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులే ఆ ఉద్యమానికి నాయకత్వం వహించారు. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి వాహనాన్ని తగులబెట్టడం వంటి క్రియాశీల చర్యలనూ, 1947 తర్వాత భారతదేశంలో విద్యార్థుల మీద తొలి పోలీసు కాల్పులలో ఐదుగురు విద్యార్థుల మరణాన్నీ చూసింది ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1950 దశకంలో ప్రారంభమైన ఈ విద్యార్థి ఉద్యమాల ధార ఆ తర్వాత ప్రతి దశాబ్దంలోనూ కనీసం ఒక ఉధృతమైన వెల్లువను చూసింది. ఆ ఆరు దశాబ్దాల ఉస్మానియా విద్యార్థి ఉద్యమ చరిత్ర దానికదే ప్రత్యేకంగా రాయదగినంత విశిష్టమైనది. ఒక వ్యాసంలో వివరించడానికి వీలు లేనంత విస్తారమైనది.

అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డికి అప్పటి ఉస్మానియా వైస్ చాన్సలర్ ప్రొ.డి.ఎస్. రెడ్డితో 1966లో అభిప్రాయభేదాలు వచ్చాయి. దానితో ప్రభుత్వం హఠాత్తుగా చట్ట నిబంధనలు మార్చి, వైస్ చాన్సలర్ పదవీకాలాన్ని తగ్గించి, సెనేట్‌లో ప్రొఫెసర్ల ప్రాతినిధ్యాన్ని రద్దుచేసి ప్రొ.డి.ఎస్.రెడ్డిని తొలగించింది. ఆ స్థానంలో గుంటూరు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డా. పి నరసింహారావును వైస్ చాన్సలర్‌గా నియమించింది. ఒకవైపు విశ్వవిద్యాలయ వ్యవహారాలలో రాజకీయ జోక్యాన్ని నిరసిస్తూ, చట్టం మార్పులను సవాలు చేస్తూ, విశ్వవిద్యాలయ స్వతంత్ర ప్రతిపత్తిని పరిరక్షించాలని కోరుతూ ప్రొ.డి.ఎస్.రెడ్డి న్యాయస్థానానికి వెళ్లారు. రాష్ట్ర హైకోర్టు ఆయన వాదనలను కొట్టేసింది గాని సుప్రీంకోర్టు ఆయన వాదనలను అంగీకరించి, నరసింహా రావు నియామకాన్ని రద్దు చేసింది. ఈ న్యాయ పోరాటం కన్న మిన్నగా విద్యార్థులూ, అధ్యాపకులూ విశ్వవిద్యాలయంలో రాజకీయ జోక్యాన్ని ప్రతిఘటించడానికి చేసిన పోరాటం విలువైనది, వీరోచితమైనది. ప్రభుత్వం నియమించిన వైస్ చాన్సలర్‌ను విద్యార్థులు క్యాంపస్‌లోకి అడుగు పెట్టనివ్వలేదు. చివరికి ఆయన పదవీ స్వీకార కార్యక్రమం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేస్తే, ఆ కాగితాలు తీసుకువెళ్లవలసిన రిజిస్ట్రార్‌ను అక్కడికి వెళ్లకుండా విద్యార్థులు అడ్డుకున్నారు. కొత్త నియామకాన్ని వ్యతిరేకిస్తూ సెనేట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) "ఉపాధ్యాయుల అభిమతానికి వ్యతిరేకంగా జరిగిన వైస్ చాన్సలర్ నియామకాన్ని ఉపాధ్యాయులు గుర్తించడం లేదు" అని తీర్మానించింది. ప్రొఫెసర్ల కార్యాచరణ సమితి అంతర్ విశ్వవిద్యాలయ బోర్డు చైర్మన్‌ను కలిసి తమ వాదనలు వినిపించింది. చిట్టచివరికి, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన, రాజ్ భవన్‌లో గంటలకొద్దీ వేచి చూసిన డా. పి.నరసింహా రావు ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ పదవి చేపట్టకుండానే వెనక్కి తిరిగిపోవలసి వచ్చింది. ఆనాటి ఘటనల గురించి ఆంధ్రపత్రిక 1966 అక్టోబర్ 20 సంచిక "ఉస్మానియా వివాదంలో కొత్త ఘట్టం: రాజధానిలో అల్లర్లు, పలు చోట్ల బస్సులపై రాళ్లు, విద్యుద్దీపాల విచ్ఛిత్తి, అధికారులచే ఆర్ టి సి బస్సుల ఉపసంహరణ" అని పతాక శీర్షిక పెట్టింది.

నిజానికి ఈ ఆందోళన విద్యార్థిలోకంలో రాజుకుంటున్న మరింత లోతైన అసంతృప్తికి సూచిక. ఆ మహా అసంతృప్తి మరి రెండు సంవత్సరాలలో జై తెలంగాణ ఉద్యమంగా మారింది. కొత్తగూడెంలో నిరాహార దీక్ష ప్రారంభమైన రెండు వారాల లోపే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి కార్యాచరణ సమితి ఏర్పడింది. అప్పటి నుంచి దాదాపు ఏడాది పాటు సాగిన ఉద్యమానికి, ఆ తర్వాత 1973లో జరిగిన ఉద్యమానికి కూడ ఆనాటి తెలంగాణలో ఉండిన ఏకైక విశ్వ విద్యాలయంగా ఉస్మానియా విశ్వవిద్యాలయమే నాయకత్వాన్ని అందించింది. ఒక విద్యాసంవత్సరం నష్టపోయినా సరే, ప్రతి

ఉస్మానియా విద్యార్థి శక్తిమేరకు పాల్గొన్న ఉద్యమం అది. రహదారుల మీద బారికేడ్లు నిర్మించి, మాల్టవ్ కాక్‌టెయిల్స్ విసిరి, ప్రభుత్వాన్ని స్తంభింపజేసి, ప్రాంతేతరుల రాజకీయార్థిక ప్రయోజనాల మీద, ఆస్తుల మీద దాడులు చేసి సమరశీల పోరాట రూపాలను చేపట్టిన ఉద్యమం అది. మూడువందల డెబ్భైమంది విద్యార్థి యువజనులు పోలీసు కాల్పుల్లో ప్రాణాలు అర్పించిన వీరోచితమైన ఉద్యమం అది.

మొదటి దశ జై తెలంగాణ ఉద్యమం, నక్సల్బరీ శ్రీకాకుళ విప్లవోద్యమాల ప్రభావం ఉస్మానియాను ఏకకాలంలో ముంచెత్తాయి. తెలంగాణ ప్రజాసమితి విద్రోహం వల్ల జై తెలంగాణ ఉద్యమం అపజయం పాలైనప్పుడు విప్లవోద్యమమే మిగిలిన పరిష్కారమనే ఆలోచన విద్యార్థులలో పెరిగింది. ఆ ఆలోచనల ఫలితమే ఉస్మానియాలో విస్తరించిన ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం. అప్పటికి సంఘపరివారానికి పట్టు ఉన్న విశ్వవిద్యాలయంలోకి ప్రగతిశీల శక్తులు రాగూడదని, ఆ ఉద్యమం మొగ్గగా ఉండగానే చిదిమివెయ్యాలని సంఘ్ పరివార్ కుట్రలు ప్రారంభించింది. 1972 ఏప్రిల్ 14న ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే జార్జిరెడ్డిని హత్య చేసి, హత్యా రాజకీయాలు ప్రారంభించింది. 'నీ చిందిన నెత్తురులో ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు' అన్నట్టుగా ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ప్రగతిశీల ఆలోచనలను రద్దు చేయడానికి, భయపెట్టడానికి సంఘ్ పరివార్ నెత్తురు చిందిస్తే, విద్యార్థి ఉద్యమ ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లాయి.

1974లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పడినప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులే ప్రధాన పాత్ర వహించారు. అతి త్వరలోనే ఎమర్జెన్సీ విధించబడి, విద్యార్థి ఉద్యమకారుల మీద తీవ్ర నిర్బంధం అమలయినప్పుడు, ఉస్మానియా విశ్వ విద్యాలయపు రాడికల్ విద్యార్థులే గ్రామీణ ప్రాంతాల అధ్యయనానికీ, జన సమీకరణకూ పూనుకున్నారు. ఎమర్జెన్సీ అనంతర ప్రజావెల్లువలో రాడికల్ విద్యార్థి సంఘం ఇచ్చిన చరిత్రాత్మక గ్రామాలకు తరలండి పిలుపులోనూ అతి ఎక్కువగా పాల్గొన్నది ఉస్మానియా విద్యార్థులే (అప్పటికి తెలంగాణలో ఉస్మానియా కాక అదనంగా మరొక విశ్వవిద్యాలయం –కాకతీయ మాత్రమే ఏర్పడి ఉంది). రమీజాబీ పై పోలీసుల అత్యాచారానికి నిరసనగా రాష్ట్రం ఆగ్రహం ప్రకటించినప్పుడు కొన్ని వారాల పాటు ఉద్యమాన్ని నిర్వహించినది ఉస్మానియా విద్యార్థులే. 'గ్రామాలకు తరలండి' కార్యక్రమ ఫలితంగా ఎన్నో ప్రజాసంఘాలు ఏర్పడి, అవన్నీ విద్యార్థి సంఘాలతో సమన్వయంలో ఉండడంతో దాదాపు ఏడెనిమిది సంవత్సరాలు ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి ఉద్యమాల వేదికగా, సామాజిక ఉద్యమాల సంఘీభావ వేదికగా ఎదిగింది. 1980ల తర్వాత రాష్ట్రంలో అన్ని విప్లవ పార్టీల నాయకత్వాలలోనూ గణనీయమైన సంఖ్యలో ఉస్మానియా విద్యార్థులున్నారు.

'ఆట పాట మాట బంద్' అని ఎన్.టి.రామారావు ప్రభుత్వం ప్రజా కార్యక్రమాల మీద అప్రకటిత నిషేధం విధించిన తర్వాత, 1989లో విద్యార్థి సంఘాల ఎన్నికల మీద నిషేధం విధించిన తర్వాత, 1992లో రాడికల్ విద్యార్థి సంఘాన్ని నిషేధించిన తర్వాత ఉస్మానియాలో విద్యార్థి ఉద్యమాల ప్రభావం గణనీయంగా తగ్గింది. కొన్ని పార్లమెంటరీ వామపక్షాలకూ, విప్లవ పార్టీలకూ చెందిన విద్యార్థి సంఘాలు ఉనికిలో ఉండినప్పటికీ విద్యార్థి సంఘాల ఎన్నికలు రద్దు కావడంతో ఉస్మానియాలో కూడ విద్యార్థి ఉద్యమం ఉండవలసిన స్థాయిలో లేకుండా పోయింది. ఉస్మానియాలో విద్యార్థి ఉద్యమాల వాతావరణం అదృశ్యమయిందనీ, మళ్లీ అటువంటి వాతావరణం రాదనీ, విద్యార్థులు సమాజం గురించి ఆలోచించకుండా తమ సొంత భవిష్యత్తును మాత్రమే చూసుకునే కెరీరిజంలో పడిపోయారనీ వ్యాఖ్యాతలు అనడం ప్రారంభించారు. ఉస్మానియాకు ఉండిన ఉజ్వలమైన విద్యార్థి ఉద్యమాల చరిత్ర ముగింపుకు వచ్చినట్టుగా భావించడం ఒక ఆనవాయితీ అయింది.

కాని ఆ స్తబ్దత ఐదారేళ్లు కూడ కాకుండానే బద్దలయింది. 1995-96 నాటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి ఉస్మానియా విద్యార్థులు ఆలోచించడం ప్రారంభించారు. మళ్లీ ఒకసారి 1980ల తొలిరోజుల ఉద్వేగభరిత, విద్యార్థి ఉద్యమ వాతావరణం ఉస్మానియా క్యాంపస్‌లో ప్రవేశించింది. సభలు, సమావేశాలు, చర్చలు, నిరసనలు, ప్రశ్నలు ఉస్మానియాలో మళ్లీ ఒకసారి ప్రతిధ్వనించాయి. ఆ విద్యార్థి చైతన్యాన్ని మొద్దుబార్చడానికి పాలకవర్గాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, విద్యార్థులను చీల్చడానికి ప్రయత్నించినప్పటికీ గత ఇరవై సంవత్సరాలుగా ఉస్మానియా మళ్లీ ఆరని జ్వాలగా ఉన్నది. 1996 నుంచీ అటు తెలంగాణ ఆకాంక్షలోను, ఇటు విప్లవ విద్యార్థి ఉద్యమంలోను, 2009-2014 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోను ఉస్మానియా విశ్వవిద్యాలయం తన అద్భుతమైన చారిత్రక వారసత్వానికి ఘనమైన వారసురాలిగా కొనసాగుతున్నది.

★ **రచయిత: వీక్షణం సంపాదకులు**

# శత వసంతాల ఓయూ-ప్రగతిశీల రచయితలు

● శివరాత్రి సుధాకర్

ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఎన్నో ఉద్యమాలు వెల్లువెత్తిన వేదిక ఇది. చైతన్య కేంద్రం. ధిక్కార స్వరాల ఝంఝ. సమస్త పీడనలపై పిడికిళ్లెత్తి నినదించేలా చేసే పోరాటాల బావుటా. ఇదో యుద్ధక్షేత్రం. ఈ యుద్ధభూమికి నూరు వసంతాలు. వేల ఆలోచనల్ని మండించే ఆరని కొలిమిది. లక్షలాది మంది విద్యార్థులకు జీవితాన్ని నేర్పింది. ఇక్కడ చదివినవాళ్లెందరికో మనుషుల్ని మనుషులుగా ప్రేమించేతత్త్వం నేర్పిందీ ఒడి. వందేళ్లుగా ఓయూ అనేకానేక సామాజిక, సాంస్కృతిక, విప్లవోద్యమాలకు ఊపిరిపోసింది. విద్యార్థుల్లో ఆలోచనలను మండించి యుద్ధ సైనికులుగా తీర్చిదిద్దితోంది. శత వసంతాలు పూర్తిచేసుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎందరెందరో సామాజిక శాస్త్రవేత్తలను, రచయితలను, కవులను, కళాకారులను, విప్లవకారులను అందించింది. ఎప్పుడు సామాజిక సంఘర్షణలు తలెత్తినా ఓయూ పరిష్కారానికి దారులు వేస్తోంది. పోరు బాటలు పరుస్తోంది.

1917-19లో ఉస్మానియా యూనివర్సిటీ ఏర్పడింది. ఆర్ట్స్ కాలేజీ భవనానికి 1934 జూలై 5న శంకుస్థాపన జరిగింది. 1939 డిసెంబర్ 4న ఆర్ట్స్ కాలేజీ భవనాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయం ఏర్పడిన రెండు దశాబ్దాల్లోనే విద్యార్థులు ప్రగతిశీల దారిలో పయనించారు. నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు వ్యతిరేకంగా వందేమాతరం గీతం పాడి సవాల్ విసిరారు. ఆ క్రమంలో విద్యార్థులు విశ్వవిద్యాలయం నుంచి సస్పెండైనా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. తర్వాత కాలంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఓయూ విద్యార్థులు క్రియాశీలకంగా పాల్గొన్నారు. గైర్ ముల్కీ ఆందోళనలకు ప్రాణం పోశారు. 1939లో వందేమాతర ఉద్యమాన్ని నడిపారు. దీంతో ఆగ్రహించిన నిజాం నవాబు యూనివర్సిటీ నుంచి 350మంది విద్యార్థులను సస్పెండ్ చేయించాడు. ఈ సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు 12రోజుల పాటు సమ్మెచేశారు. నాగపూర్ యూనివర్సిటీ వీసీ కేధారినాథ్ సస్పెండైన విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకు వారికి అడ్మిషన్‌లు కల్పించాడు. అట్లా సస్పెండైన వారిలో మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నర్సింహ్మారావు, వందేమాతరం రామచంద్రరావు తదితరులు వున్నారు. వందేమాతరం ఉద్యమంతో విద్యార్థి లోకమంతా స్ఫూర్తి పొంది నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. 1946లో జరిగిన చారిత్రక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉద్యమించారు. నిజాం సైన్యాలను గడగడలాడించారు. 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన ఉద్యమంలో ఇక్కడి విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించారు. 1952లో ముల్కీ నిబంధనలు అమలు కావడం లేదని ఉద్యమించారు. 'గైర్ ముల్కీ గో బ్యాక్' నినాదంతో కదం తొక్కారు. తొలి దశ తెలంగాణ ఉద్యమం (1969లో)లో వందలాది మంది విద్యార్థులు అమరులయ్యారు.

1969 తర్వాత ఓయూలో సామాజిక ఉద్యమాలు వచ్చాయి. 1969లో నక్సల్బరీ ఉద్యమం ప్రభావం ఇక్కడి విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపింది. వామపక్ష భావజాలంతో ఉన్న జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్‌లాంటి వాళ్లు విప్లవోద్యమాల వైపు మొగ్గుచూపారు. ప్రగతిశీల భావజాలం ఉన్న విద్యార్థులంతా శ్రీకాకుళ పోరాటంతో స్ఫూర్తి పొందారు. దీంతో ఓయూలో ప్రగతిశీల విద్యార్థి సంఘాలు, రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పడ్డాయి. అప్పటి నుంచీ ఉస్మానియా విశ్వవిద్యాలయం సామాజిక, సాంస్కృతిక, విప్లవోద్యమాలకు కేంద్రంగా ఉన్నది.

ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడి శత వసంతాలు నిండిన సంరంభం. ఇప్పుడు ఆనాటి చరిత్రను, సంఘటనలను తడిమిచూసుకోవడం మన బాధ్యత. వందేళ్ల ఓయూలోని ప్రగతిశీల రచయితల గురించి తెలుసుకోవాలంటే ముందుగా ఆ ప్రగతిశీల భావాలు ఎక్కడ మొదలయ్యాయో కూడా తెలుసుకోవాలి.

హైదరాబాద్ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీకి 1939లోనే బీజాలు పడ్డాయి. దీంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థుల్లో ఎక్కువ మంది కమ్యూనిస్టు భావజాలానికి ప్రభావితమయ్యారు. హైదరాబాద్ ఆబిడ్స్‌లోని ఇండియా కాఫీహౌస్‌లో అఖ్తర్ హుస్సేన్, మఖ్దూం మొహియుద్దీన్, సయ్యద్ ఆలం ఖుంద్‌మీరి, రాజబహదూర్‌గౌర్, జవ్వాద్ రజ్వీలాంటి యువకులు అక్కడ విస్తృత చర్చలు జరిపేవారు. ఈ వామపక్ష భావజాలం ఉన్న యువకుల ప్రభావం ఉస్మానియా

యూనివర్సిటీలో చదివే విద్యార్థులపై పడింది. ఉపన్యాసాలు, చర్చలు, వ్యూహాలు, ఎత్తుగడలతో వారు గొప్ప ప్రాపంచిక దృక్పథాన్ని కలుగజేశారు. 1935 నుంచి 1942 వరకు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నది. దీంతో ఈ భావాలున్న అనేక మంది యువకులు ఆంధ్ర మహాసభలో, విద్యార్థి సంఘాలతో, కార్మిక సంఘాల్లోనూ చేరి తమ కార్యకలాపాలు ఉధృతంచేశారు.

రష్యా విప్లవం, అంతార్జాతీయ ఫాసిస్టు వ్యతిరేకత, భారత సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలోని ప్రగతిశీల భావాల ప్రభావానికి లోనైన కొందరు యువకుల బృందం హైదరాబాద్ నగరంలో అప్పటికే సంఘటితమైంది. ఈ బృందానికి మఖ్దూం మొహియుద్దీన్ నాయకుడు. వీళ్లంతా కామ్రేడ్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు.

కామ్రేడ్స్ అసోసియేషన్ ఆవిర్భావంతో ఓయూలో ప్రగతిశీల కవులు వచ్చారు. ఆలం ఖుంద్‌మీరి లాంటి వాళ్ల కృషే దీనికి కారణం. 1930 'హంగ్రీ థర్టీస్' ప్రపంచాన్ని కుదిపేసింది. 1934నాటికి జర్మనీలో హిట్లర్ నియంతృత్వం పడగలు విప్పింది. దీనికి వ్యతిరేకంగా 1935 డిసెంబర్‌లో అలహాబాద్‌లో 'ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్' ఏర్పడింది. 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే 'ది డెయిలీ ట్రిబ్యూన్'లో 'భారత అభ్యుదయ రచయితల ప్రణాళిక' ప్రకటించారు. దీంతో ఇక్కడ అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది.

ప్రగతిశీల రచయితలు సామాజిక చైతన్యం రగిలించారు. పీడిత జన పక్షపాతం వహించారు. అభ్యుదయ కవులు కాల్పనిక కవిత్వంపై తిరుగుబాటు చేశారు. వర్గ పోరాట దృక్పథంతో రచనలు చేశారు. అలాగే సోవియట్ యూనియన్, బల్గేరియా, చైనా, వియత్నాం లాంటి దేశాల రచనల్ని, లాటిన్ అమెరికా, ఆఫ్రికా విముక్తి పోరాట యోధుల రచనల్నీ అభ్యుదయ సాహిత్యోద్యమం తెలుగు సాహిత్య లోకానికి పరిచయం చేసింది. ప్రగతిశీల కవులు, రచయితలు, కళాకారులు సమకాలీన సమాజంలో ప్రపంచీకరణ దుష్ప్రభావాలను ఎండగడుతూ రచనలు చేస్తున్నారు. మతోన్మాద దురహంకారాన్ని ఎదురు నిలిచి పోరాడుతున్నారు.

1946– 50లో కమ్యూనిస్టు భావజాలం సాహిత్యంపై ఎక్కువ ప్రభావం చూపింది. ఇదే కాలంలో ఓయూలో పల్లా దుర్గయ్య, సింగిరెడ్డి నారాయణరెడ్డి చదివారు. సినారె మానవతా వాద కవిత్వం రాశారు. అప్పుడప్పుడూ కొంతవరకు ప్రగతిశీల భావాలతో రాసేవారు. 1956 వరకు వచ్చిన కవిత్వం, కథలు, పత్రికలు ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావంతో ఆగిపోయాయి. దీంతో దాదాపు దశాబ్దం పాటు తెలంగాణ సాహిత్యంలో చీకటి అలముకుంది.

1960 చివరిలో ఫ్రాన్స్‌లో రెక్క విప్పిన రివల్యూషన్ విశ్వవిద్యాలయాలను మండించింది. తిరుగుబాటు బావుటాను ఎగురవేసింది. తెలుగు నేలపై ఈ ధిక్కార స్వరాల ప్రభావం పడింది. 1965లో ఆరుగురు యువ కవులు జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, నగ్నముని, చెరబండరాజు, మహాస్వప్న, భైరవయ్యలు తెలుగు సాహిత్యంలోకి మెరుపులా దూసుకువచ్చారు. తమను తాము దిగంబర కవులుగా ప్రకటించుకున్నారు. తమ కవిత్వంతో తెలుగు సాహితీలోకంలో నెలకొన్న స్తబ్దతపై అలజడి రేపారు. మూడు కవితా సంపుటాలతో తెలుగు సాహితీలోకానికి షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. అనేక విమర్శలనెదుర్కొన్నారు. ఈ దిగంబర కవితోద్యమం స్మానియా యూనివర్సిటీ విద్యార్థుల్లో తీవ్ర ప్రభావం చూపింది. ఈ కవులు తిరుగుబాటు తత్త్వం నుంచి విప్లవ పంథాలో పయనించారు. వీరిలో నలుగురు మార్క్సిస్టు సిద్ధాంతాలతో, ఇద్దరు అస్తిత్వవాద సిద్ధాంతాలతో ప్రభావితమయ్యారు. జ్వాలా, నిఖిల్, చెరలు 1970లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘంలో చేరారు. చెరబండరాజు ఓయూలో చదవకపోయినా ఆయనకు ఓయూతో విడదీయరాని అనుబంధం ఉన్నది. చెరబండరాజు కవిత్వంతో యువత ఉత్తేజం పొందింది. ఒక స్పష్టమైన రాజకీయ దృక్పథాన్ని ఏర్పర్చుకున్నారు.

ఈ కాలంలోనే నక్సల్బరీలో(1967) వసంతమేఘం గర్జించింది. 1968నాటికి శ్రీకాకుళాన్ని తాకి, దాని ప్రభావం తెలంగాణకు విస్తరించింది. 1969లో ఎనిమిది మంది యువ కవులు కలిసి తిరుగుబాటు కవులుగా వచ్చారు. వీరిలో వరవరరావు, లోచన్, ఎక్స్‌రే, ఐ, కిషన్, సుధాకర్, సుదర్శన్, యాదగిరిరావులున్నారు. 'చలి నెగళ్లు' కవితా సంపుటితో తెలుగు కవిత్వంలో ప్రకంపనలు సృష్టించారు వరవరరావు. జీవనాడి, ఊరేగింపు, స్వేచ్ఛ, సముద్రం, భవిష్యత్ చిత్రపటం, ముక్తకంఠం, ఆరోజులు, ఉన్నదేదో ఉన్నట్లు కవితా సంపుటాలు తీసుకువచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీలో పొందిన చైతన్యం, రాజకీయాలతో ఆయన కొందరు మిత్రులతో కలిసి సృజన ఆధునిక సాహిత్య వేదికను స్థాపించారు. దీంతో ఎందరెందరో యువ కవులను ప్రోత్సహించారు.

అనుముల శ్రీహరి, ఎస్వీ సత్యనారాయణ, జగదీశ్వరస్వామిల ఆధ్వర్యంలో విప్లవ శంఖం (1969) కవితా సంపుటి ప్రచురించారు. తెలంగాణ ఉద్యమంతో స్ఫూర్తిపొందిన మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులు రుక్నుద్దీన్, యాదగిరిలు 'విప్లవ ఢంకా' మోగించారు. ఆ కాలంలోనే 'జనధర్మ' పత్రిక తెలంగాణ

కవిత్వ ప్రత్యేక సంచిక ప్రచురించింది. అప్పుడే భువనగిరికి చెందిన ఓయూ విద్యార్థి ఎన్.గోపాల్(గోపీ), డాక్టర్ పి. లక్ష్మీనారాయణ, తెలిదేవర భానుమూర్తిలు తెలంగాణ ఉద్యమ కవిత్వం రాసి బుక్‌లెట్‌లుగా వేశారు. ఈ కవిత్వమంతటా తెలంగాణ అస్తిత్వం, పోరాటానికి సంబంధించిన కవితలే ఉన్నాయి. ఇందులో తెలంగాణ మాండలికాన్ని ఎక్కువగా వాడుకున్నారు. అసలు సిసలు తెలంగాణ పదాలతో దృశ్యమానం చేశారు.

ఉస్మానియా యూనివర్సిటీలో నందిని సిధారెడ్డి, నాళేశ్వరం శంకరం, అమ్మంగి వేణుగోపాల్, గుడిహాళం రఘునాథం, సలంద్ర లక్ష్మీనారాయణ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, దేవరాజు మహారాజు, జయప్రభ, ఐలేని గిరి, పాలకోడేటి సత్యనారాయణ మరికొందరు సాహితీ మిత్రులందరూ కలిసి 1976లో 'ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్'గా ఏర్పడ్డారు. 1971– 80 మధ్యకాలంలో వచ్చిన కవిత్వంతో 'ఈతరం యుద్ధకవిత' పేరుతో కవితా సంకలనం వేశారు. ఆ తర్వాత కొంతకాలానికే ఆ సర్కిల్ ఆగిపోయింది. పైన చెప్పిన వాళ్లలో చాలామంది అప్పట్లో ఓయూలోని పీడీఎస్‌యూ, రాడికల్ విద్యార్థి సంఘాలు ఇచ్చిన చైతన్యంతోనే ప్రభావితమయ్యారు. కవులుగా ఎదిగారు. యూనివర్సిటీ సమస్యలపై కాకుండా రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి చర్చనీయమైన సంఘటన జరిగినా ఈ కవులు వెంటనే స్పందించేవారు. పోరాటానికి సిద్ధమయ్యేవారు. సాహిత్యమే జీవితంగా, జీవితమే ఉద్యమంగా బతికారు. సమస్త దోపిడీ, పీడనలపై తమ రచనలతో పిడుగులు కురిపించారు.

నందిని సిధారెడ్డి భూమి స్వప్నం, సంభాషణ, ప్రాణహిత, ఒక బాధగాదు, ఇక్కడి చెట్ల గాలి, ఒక పాటల సంపుటి– నాగేటి చాళ్లల్ల, రెండు వ్యాస సంపుటాలు. ఇగురం, ఆవర్తనం ప్రచురించాడు. ఇటీవలే నందిని సిధారెడ్డి నాలుగు దశాబ్దాల కవిత్వాన్నంతా కలిపి సంకలనం వేశారు.

సలంద్ర కవిగా, జర్నలిస్టుగా కష్టజీవులవైపే ఉన్నాడు. సంచలనం కలిగించే ప్రతి సంఘటనకు స్పందించాడు. 1978లో హైదరాబాద్ నల్లకుంట పోలీసులు రమీజాబీ అనే ముస్లిం మహిళను పోలీసు స్టేషన్‌లో బంధించి సామూహిక అత్యాచారం చేసి చంపారు. అప్పుడు రాష్ట్రమంతటా భగ్గున మండింది. రమీజాబీ హంతకులకు శిక్షపడేలా చేసేందు సలంద్ర రమీజాబీ అభిమాన సంఘం పెట్టాడు. భావజాల సారూప్యం ఉన్న ప్రతిఒక్కరినీ ఈ పోరాటంలో భాగస్వామిగా చేశాడు సలంద్ర. 'వేడిగాలి' సంకలనం ద్వారా పరిచయమై చావుగీతం, దళిత్ మేనిఫెస్టో లాంటి కవితలతో ఆలోచింపజేశాడు. ఓయూ 'సీ హాస్టల్' రూమ్ నెంబర్ 35లో అల్లం నారాయణ, సలంద్ర మరికొందరు మిత్రులుండేవాళ్లు.

1980వ దశకంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. భూమిని నమ్ముకున్న రైతులు అప్పులపాలై కంటికి పుట్టెడు ఏడ్చారు. భారమైన అప్పుల బాధలు తాళలేక ఉరితాళ్లకు వేలాడారు. బువ్వపెట్టే రైతన్నలు ప్రాణాలొదిలేలా చేశారు పాలకులు. పత్తి రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్న పాలక విధానాలను, విదేశీ కంపెనీల లాభార్జన కోసం తలుపులు బార్లా తెరిచిన స్వదేశీ పాలకుల ఉదాసీనతనూ ఎండగట్టాడు కవి అమ్మంగి వేణుగోపాల్. గుక్కెడు నీళ్లైనా దొరకని కరువు గురించి గొంతెత్తి మాట్లాడుతున్నారు కవులు. కరువు జీవితాలను కవిత్వంగా మలుస్తున్నారు. వాటికి గల కారణాలను చెప్తున్నారు. పరిష్కారం చూపించాలని ప్రభుత్వాలను నిలదీస్తున్నారీ కవులు. వాళ్ల ప్రశ్నలు, ధిక్కారమంతా ప్రగతిశీల నేపథ్యంలోంచి వచ్చిందే.

1980వ దశకంలో స్వేచ్ఛ కోసం నినదిస్తున్న స్త్రీలంతా సంఘటితమయ్యారు. తెలుగు సాహిత్యరంగంలోకి స్త్రీవాద కవిత్వంగా దూసుకువచ్చారు. స్త్రీల అనుభవాలను, అనుభూతులను స్త్రీల దృక్కోణం నుంచే చూడాలన్న ఆలోచనతో వచ్చిందీ సాహిత్య ధోరణి. కుటుంబంలోని నిర్బంధ సంప్రదాయం మీద జయప్రభ పైటను తగలెయ్యాలని ఆగ్రహ ప్రకటన చేసింది. పితృస్వామ్య దోపిడీపై ప్రశ్నలు ఎక్కుపెట్టింది. అందాల పోటీల వ్యాపార సంస్కృతిని నిరసిస్తూ విమల సౌందర్యాత్మక హింస అనే కవిత ద్వారా స్త్రీలంతా చైతన్యం కావాలని పిలుపునిచ్చింది. పితృస్వామ్యం రాసిన తరతరాల శాసనాలను అందరం కలిసి తుదముట్టించాలని పిలుపునిచ్చింది శిలాలోలిత. ఇట్లా ఓయూలో చదివిన చాలామంది కవయిత్రులు స్త్రీవాద కవిత్వాన్ని సుసంపన్న చేశారు. ఇదే కాలంలో దళిత కవిత్వం, మైనార్టీ కవిత్వం, బహుజన అస్తిత్వ కవిత్వం వచ్చింది. ఓయూలో చదివి వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎందరో కవులు, రచయితలు ప్రగతిశీల భావాలతో రచనలు చేశారు.

పోలవరం నిర్మాణానికి వ్యతిరేకంగా కవులంతా సంఘటితమయ్యారు. సమస్త వనరుల దోపిడీకి వ్యతిరేకంగా తమ గళాలు విప్పారు. నూతన రాష్ట్రంలోనూ కొనసాగుతున్న దొపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా రచనలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. హక్కుల కోసం పోరాడుతూ సమసమాజం కోసం పోరాడుతున్నారు.

**★ రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయు**

# ఓయూ ఒక అందమైన జ్ఞాపకం

డా॥ఎ.సిల్మానాయక్

1917లో స్థాపించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విద్యా కేంద్రం ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఓయూలో ఆర్ట్స్‌కళాశాల భవనం ఒక చారిత్రక జ్ఞాపకం. ఆ భవనం అందమైన రాళ్ళతో చతురస్రాకారంగా నిర్మింపబడింది. దేశ విదేశాల నుంచి ఎందరెందరో విద్యార్థులు, పరిశోధకులు, పర్యాటకులను ఆకర్షింపచేస్తుంది. ప్రపంచానికి జ్ఞానాన్ని అందించిన విశ్వవిద్యాలయం. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి విభిన్న సంస్కృతి సాంప్రదాయాలు కలిగిన విద్యార్థులకు జ్ఞాన నిలయంగా ఉన్నది. ఇక్కడ వివిధ వర్గాల విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయిలో వివిధ రంగాల్లో స్థిరపడినారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులకు అమ్మఒడిలాగా ఆదరిస్తుంది. ఈ విశ్వవిద్యాలయంలో చదువుకోవడం జీవితంలో మధుర జ్ఞాపకంలాగా చిరస్థాయి వరకు గుర్తుండిపోతుంది.

నేను 1995లో బి.కాం డిగ్రీ పూర్తి చేసుకున్నాను. పీ.జీలో చేరేందుకు ఓయూలో ప్రవేశ పరీక్షల దరఖాస్తు కోసం నల్లగొండ జిల్లా, సూర్యాపేటకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక మారుమూల గిరిజన తండానుంచి హైద్రాబాదుకు బయలు దేరాను. అప్పట్లో ఆర్.టీ.సీ బస్సు ఎక్కితే యాభై(50) రూపాయల చార్జీ ఉండేది. అందుకని ఆర్థిక సమస్యల కారణంగా సూర్యాపేట నుంచి లారీలో ఎక్కాను. ఎందుకంటే లారీలో అయితే పది(10) రూపాయల చార్జీ ఉండేది. ఎల్.బి.నగర్ చౌరాస్తాలో దిగాను. సిటీకి అదే కొత్త ఓయూకు ఎట్లా వెళ్ళాలో తెలియదు. బస్‌స్టాప్‌లో నిలబడ్డాను. సింగిల్, డబుల్ డెక్కర్ బస్సులు వస్తూ పోతున్నాయి. వాటిమీద వెనక ముందు నంబర్లు వేసి ఉన్నాయి. రెండు వైపులా ద్వారాలున్నాయి. జనమంతా రన్నింగ్ బస్సులోనే దిగడం, ఎక్కడం చూసి ఆశ్యర్యపోయాను. కొంత సేపు అలాగే చూస్తూ ఉండి పోయాను. అమ్మో! ఈగల్లాగా మూగుతున్న ఈ జనంలో బస్సు ఎట్లా ఎక్కాలని అలాగే ఉండి పోయాను. తర్వాత అక్కడ బస్‌స్టాప్‌లో ఉన్న ఒక వ్యక్తిని అడిగాను. ఓయూకు ఎట్లా వెళ్ళాలి. ఏ నంబరు బస్సు ఎక్కాలని. అతను చెప్పిన విధంగా సికింద్రాబాదు వైపు వెళ్ళె బస్సు ఎక్కి నిలబడ్డాను. తార్నాకలో దిగి నడుచుకుంటూ ఆర్ట్స్ కళాశాల ముందు నుంచి ప్రెస్‌కు వెళ్ళి నాలుగు ప్రవేశ పరీక్ష దరఖాస్తులు పెట్టాను. వాటిలో మూడు దరఖాస్తులను ఆర్ట్స్ కళాశాలలో సబ్జెక్టుల వారిగా ఎం.ఏ.తెలుగు, ఆంగ్లం, లైబ్రరీసైన్స్ విభాగాలకు సమర్పించాను. ఇంకొక దరఖాస్తును కామర్స్ విభాగంలో ఎం.కాం.కోర్సు కొరకు సమర్పించాను.

ఆ సందర్భంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కళాశాలను చూసి ఆశ్చర్యపోయాను. ఇంత అందంగా అద్భుతంగా ఎట్లా నిర్మాణం చేసి ఉంటారని ఆలోచనలో పడ్డాను. ఇంత పెద్దపెద్ద రాళ్ళతో ఎట్లా నిర్మాణం చేసి ఉంటారని ఆలోచిస్తూ ఉన్నాను. ఆ భవనాన్ని, అందులో వస్తూ పోతున్న విద్యార్థులు, ఆధ్యాపకులను చూసి చాలా ముచ్చటేసింది. మనసు పులకరించింది. ఆ కళాశాల ముందున్న పచ్చని మైదానం, పచ్చని చెట్లూ, రంగురంగుల పూల చెట్లుండే ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌ను చూశాను. ఆ తర్వాత ఓయూ లైబ్రరీని సందర్శించాను. లోపలికి వెళ్ళి చూస్తే అంతా నిశబ్దంగా, నిండుగా భవనమంతా విద్యార్థులతో నిండి ఉన్నది. ఎటూ చూసినా పుస్తకాలు, విద్యార్థులు. ఆ అందమైన దృశ్యాలు చూసే సరికి మనసు ఉప్పొంగింది. ఎలాగైనా నేను ఈ విశ్వవిద్యాలయంలో కాలు మోపాలని ధృడంగా నిర్ణయించుకున్నాను.

జూన్ మాసంలో ప్రవేశ పరీక్షలు ప్రారంభమైనాయి. రెండు రోజుల్లో నాలుగు సబ్జెక్టులకు పరీక్షలు రాశాను. అప్పుడు నేను అన్నింటిలో అర్హతను సాధించాను. చివరగా స్నేహితుల సలహా ప్రకారం ఎం.ఏ.తెలుగులో ప్రవేశం పొందాను. నాకు పీ.జీ కళాశాల సికింద్రాబాదులో సీటు వచ్చింది, చేరాను. ఓ.యూ. ఆర్ట్స్ కళాశాలకు పక్కనుండే 'ఎ' హాస్టల్ రూం.నెం.16లో ఉండి ప్రతిరోజు బస్సు ఎక్కి కళాశాల తరగతికి వెళ్ళేవాడిని. ఆ విధంగా ఎంఏ పూర్తి చేసుకుని, ఇక్కడే మళ్ళీ ఎం.ఫిల్, పీహెచ్‌డీ పట్టాలను పొందాను. అట్లా ఓయూలో ఆరు సంవత్సరాల పాటు ఉండి చదువుకునే అవకాశం లభించింది. అట్లా ఈ విశ్వవిద్యాలయంలో చాలా మందితో స్నేహం ఏర్పడింది. రకరకాల చర్చ గోష్ఠులు జరిగేవి. విశ్వవిద్యాలయంలో చదువుకోవడం వల్ల జ్ఞానాభివృద్ధి కలిగింది.

ఆర్ట్స్ కళాశాల భవనం ముందు వివిధ విద్యార్థి సంఘాల బ్యానర్లు కట్టి ఉన్నాయి. నేను రోజు తరగతులకు వెళ్ళి మధ్యాహ్నం తర్వాత లైబ్రరీకి వెళ్ళి చదువుకున్నాను. అప్పట్లో అధ్యాపకులుగా నా గురువులు తెలుగు విభాగంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి , ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య వెల్దండ రఘుమన్న, ఆచార్య టి. కిషన్‌రావు, ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ గార్లు చక్కగా

పాఠాలు చెప్పేవారు. వారు అందించిన జ్ఞానంతో నేను సారస్వత తెలంగాణ పరిషత్తులో ఆధ్యాపకుడిగా పని చేస్తున్నాను.

ఓయూలో విద్యార్థి సంఘ నాయకులు అప్పుడప్పుడు వివిధ సమస్యల మీద సభలు, సమావేశాలు పెట్టేవారు. విద్యార్థి నాయకులు ఎంతో నిబద్ధతతో పనిచేసేవారు. అప్పట్లో ఓయూలో ఏబీవీపీ ప్రభావం ఎక్కువగా ఉండేది. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉండేవారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఎక్కువగా ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యు, ఎన్ఎస్‌యుఐ మొదలైన సంఘాలలో పని చేసేవారు. ఏబీవీపీ వైపు అంతగా మొగ్గు చూపేవారు కాదు. ఎందుకంటే అదోక మత, కుల తత్వానికి లోబడి హిందూ మత భావజాలంతో పని చేసేది. అయితే అప్పట్లో ఏబీవీపీ నాయకుడు మేడి చంద్రారెడ్డి బలవంతంగా బెదిరించి బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను అందులో సభ్యత్వం చేయించేవాడు. అట్లా ఆయన దౌర్జన్యానికి చాలా మంది మానసికంగా బాధపడి అయిష్టంగానే అందులో సభ్యత్వం తీసుకునే వారు.

ప్రతి ఆదివారం సాయంత్రం ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు ఓయూలో ఉన్న అన్ని హాస్టల్స్‌లో టీవీ రూంల దగ్గర బైఠక్ క్లాసులని బలవంతపు ఉపన్యాసాలు పెట్టించేవారు. అందులో పాల్గొనని విద్యార్థులను గుర్తించి, హాస్టల్స్ రూంలలో వెతికి బలవంతంగా పట్టుకొచ్చేవారు. ఎవరైనా ఎదురు తిరిగి మాట్లాడితే సామూహిక దాడులు చేసేవారు. అలాంటి సందర్భంలో వేరే విద్యార్థి సంఘాల వారికి, విద్యార్థులకు గొడవలు జరిగేవి. మిగిలిన సంఘాల వారు అంతంత మాత్రంగానే ఉండేవారు. అట్లా ఒక దశాబ్దపు కాలం పాటు వాళ్ల దౌర్జన్యాలు కొనసాగాయి. చంద్రారెడ్డిని ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘం వారు చంపేశాక ఓయూలో ఏబీవీపీ ప్రాబల్యం తగ్గింది.

నేడు ఇతర విద్యార్థి సంఘాలు వివిధ పేర్లతో పుట్టగొడుగుల్లాగా పుట్టుకొచ్చాయి. తెలంగాణ ఉద్యమంలో ఓయూ విద్యార్థుల పాత్ర చాలా కీలకమైనది. పదిహేను సంవత్సరాల పాటు మడమ తిప్పకుండా వివిధ విద్యార్థి సంఘాల వారు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సామూహికంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారు. తెలంగాణ ఉద్యమ ఫలితంగా అందరూ అద్భుతంగా మాట్లాడడం నేర్చుకున్నారు. కానీ తెలంగాణ వచ్చినాకా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు తయారైంది. ప్రపంచీకరణ మూలంగా సమాజంలో మార్పులు వచ్చి, నేడు విద్యావిధానం సరిగా లేదు. ప్రధానంగా తెలంగాణలో విద్యావిధానం కుంటుపడింది. ఓయూలో అధ్యాపక, అధ్యాపకేతర నియామకాలు లేక విద్య సర్వనాశనం అయ్యే పరిస్థితి నెలకొన్నది. ఉద్యోగ నియామకాలు నోటిఫికేషన్స్ లేక విద్యార్థులు నిరుద్యోగులుగా మారారు. ఓయూ లైబ్రరీ, పచ్చని చెట్లకింద పుస్తకాలతో కుస్తీ పట్టే రోజులు పోయాయి. అనుభవం గల అధ్యాపకులు పదవీ విరమణ చేస్తే వారి స్థానంలో కొత్త నియామకాలు లేక కాంట్రాక్టు అధ్యాపకులచే పాఠాలు బోధిస్తున్నారు. వారికీ జవాబు దారి తనం లేక బతుకు మీద భరోసా లేక సరిగ్గా పాఠాలు చెప్పడం లేదు.

ఇప్పుడున్న అధ్యాపకులు ఓయూలో జీతం కంటే గీతమే మేలని పాఠాలు చెప్పక అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల వైపు మొగ్గు చూపుతున్నారు. అడ్మినిస్ట్రేటివ్ వైపు పోకుండా, పాఠాలు చెబితే బాగుంటుంది. పైరవీలు చేసుకుని వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. విద్యార్థులు కూడా అలాగే తయారైనారు. జవాబుదారి తనం లోపించింది.

అట్లా పాత కాలంలో చదువుకుని నేను ఓయూ నుంచి ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ (తెలుగు) పూర్తిచేసుకుని హైద్రాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాను. ఓయూలో చదువుకోవడం మూలంగా నేను ఈ రోజు ఈ వృత్తిలో నిలబడి ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని ఉన్నాను. ఇప్పుడు ఓయూలో ఓరియంటల్ విభాగంలో తెలుగు శాఖకు బీఓఎస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాను. తెలుగు సాహిత్యం చదువుకోవడం మూలంగా, డా॥సి.కాశీం గారితో కలిసి పది సంవత్సరాల పాటు పని చేయడం మూలంగా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఆయన ప్రధాన సంపాదకుడుగా వస్తున్న "నడుస్తున్న తెలంగాణ" మాస పత్రికలో ఎడిటోరియల్ మెంబర్‌గా పనిచేసే అవకాశం చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఇదంతా కూడా ఓయూలో చదువుకోవడం వలన సాధ్యమయింది. ఇప్పుడు ఓయూ ఆర్ట్స్ కళాశాల వైపు లైబ్రరీ వైపు, ల్యాండ్ స్కేప్ గార్డెన్ ఆడిటోరియం, పరిపాలనా భవనాల వైపు, వెళితే చాలా బాధగా ఉంటుంది. ఎందుకంటే నేను చూసిన పాత వైభవం లేదు. పచ్చని మైదానాలు ఎండిపోయాయి. వసతి గృహాలు, కళాశాల భవనాలు కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తున్నామని చెప్పుకుంటున్నా ఓయూలో మాత్రం అభివృద్ధి కుంటుపడింది. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కొరత ఉన్నది. ప్రభుత్వం విశ్వవిద్యాలయానికి నిధులు ఇవ్వడం లేదు. నియమాకాలు లేక కాంట్రాక్ట్ వ్యవస్థ, తాత్కాలిక సిబ్బందిగా సరైన వేతనం ఇవ్వలేక నానా రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త పాతల మేలు కలయిక లేక నేడు విశ్వవిద్యాలయం బోసిపోయింది. నేడు ఏదో ఉప్పెన వచ్చినట్లు ఓయూకు శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హడావుడి చేస్తున్నారు. అలా కాకుండా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ విశ్వ విద్యాలయానికి పూర్వ వైభవం కల్పించి అటు ప్రభుత్వం, ఇటు సమాజం, ఇందులో చదువుకున్న ప్రపంచస్థాయిలో ఉన్న మేధావులు, బుద్ధిజీవులు, పరిపాలకులు, అధ్యాపకులు, విద్యార్థులు అందరూ సమష్టిగా దృష్టి పెడితే బాగుంటుంది.

★ **రచయిత: అధ్యాపకులు, తెలంగాణ సారస్వత పరిషత్తు**